ఆంధ్రమహిళ



SEPTEMBER '54 ANDHRA MAHILA ANNAS 8

చిన్న మొత్తములలో నిల్వ సేకరణ-

ఆంధ్ర మహిళా సభలో కార్యాలయము.

చిన్న మొత్తముల నిల్వలు ప్రోత్సాహించి, ప్రభుత్వమువారి పంచవర్ష ప్రణాళికకు తోడ్పడు స్త్రీల ఉద్యమములో ఆంధ్రమహిళాసభ సభ్యురాండ్రు ఎక్కువగా తోడ్పడవలెనని నిశ్చయింపబడినది. ఇందు కొరకై, ఆంధ్రమహిళా సభ ఆవరణలో ఒక ప్రత్యేకమైన కార్యాలయము ఏర్పరుపబడును. ఇందు దైనిక కార్యక్రమాన్ని నిర్ణయించి, స్త్రీ సామాన్యములో యీ ఉద్యమాన్ని గూర్చి ప్రచారం చేయుటకు, నిల్వచేయదలచినవారికి తగు సలహానిచ్చుటకు, సభ తరపున కొందరు యువతులు నియమింపబడుదురు. ఈ ఉద్యమంలో ఒక ప్రత్యేక ప్రతినిధిగా వ్యవహరించి, ధనము వసూలు చేయుటకు భారత ప్రభుత్వమువారు, ఆంధ్ర మహిళాసభకు అధికారమిచ్చియున్నారు. సభకు వచ్చిగాని, పోస్టు ద్వారాగాని అన్ని వివరములు తెలిసికొనవచ్చును.

ఇంకొక విషయము— మీరు కొనదలచిన సేవింగ్సు సర్టిఫికెట్లు సభ ద్వారా కొన్నయెడల సభకు 1¼% కమీషను వచ్చును. ఈ కమీషను సభయొక్క కార్యకలాపాలకై వినియోగించుకోవచ్చును. అందువల్ల మీరు నిల్వ చేయదలచిన మొత్తమునకు సభద్వారా సర్టిఫికెట్లు కొన్నచో, సభకు కూడా సహాయము చేసినవారగుదురు.

ఉత్సాహవంతులైన సోదరీమణులు, యింత వరకూ సభద్వారా నిల్వ సర్టిఫికెట్లు తీసుకున్న ము రమారమి రూ. 32945/- ఇందు మూలముగా సభకు వచ్చిన కమీషను రూ. 413/- ఇంకా పెక్కుమంది సోదరిమణులు యీవిధముగా సభద్వారా సర్టిఫికెట్లుకొని సహాయ పడవలెనని కోరుచున్నాను.

టి. జి. హైమవతి,
ఆర్. లక్ష్మి.

ఆంధ్ర మహిళ

వ్యవస్థాపకురాలు :

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

యెం.యే., బి.యెల్.,

సంపాదకురాలు :

శ్రీమతి చన్నఘంటమ్మ

యెం.యే., యెల్.టి.,

సంయుక్త సంపాదకురాలు :

శ్రీమతి కె. సుగుణమణి

సంవత్సర చందా ఆరు రూపాయిలు

ఆంధ్ర మహిళా సభవారిచే స్థాపించబడిన ముద్రణాలయములో ముద్రితము.

ఆంధ్రమహిళ

సంపుటి 11 :: సెప్టెంబరు '54 :: సంచిక 5

సంవత్సరచందా :: :: ఆరు రూపాయలు.

ఆంధ్రమహిళ

సంపుటి 11 :: సెప్టెంబరు '54 :: సంచిక 5

ఏడేళ్ల స్వాతంత్ర్యం

భారతమాత సకల సౌభాగ్య సంశోభిత. ఆ సౌభాగ్యం చూస్తే అనేకమందికి కళ్ళు కుట్టేయి. క్రీస్తుకు 326 సం॥ పూర్వమే అలెగ్జాండరు సింధునది దాటి వచ్చి, అంకినవన్నీ తర్లించుకు పోయేడు. క్రీస్తుకు వెనుక వెయ్యేళ్ళకు గజ్నీ మహమ్మద్ (1-2 సార్లు గాదు, 18 మార్లు దండెత్తి వచ్చి) గుళ్ళు - గోపురాలలోని మణులతో సహా కొల్లగొట్టుకు పోతేగాని అతని కళ్లు చల్లబడలేదు. 1193 లో ఢిల్లీ పతనం. సుమారు 300 ఏళ్ళు సుల్తానులు- ఖిల్జీలు - తుఘ్లక్‌ల జులుమ్. ఆవెనుక సుమారు 200 సంవత్సరాలు మొగలాయీల పరిపాలన, ఆపిమ్మట మరొక 200 ఏళ్ళు ఆంగ్లేయుల ప్రభుత్వం. ఇలా శతాబ్దాల తరబడిని యదేచ్ఛగా ఎవరికి అంకినంత వరకు వారు కొల్లగొట్టుకు పోయేరు— భారత వర్షంలోని భోగభాగ్యాల్ని. "భారత- భూమీ- మనదేగానీ- ఫలితము- మనకేదీ" అని ఆమె బిడ్డలు (పాడి— పంటలకు పుట్టిల్లయిన యింటనే) కూడు గుడ్డలకు కరువాసిపోయి, అలో లక్ష్మణా అని ఆలపించేరు. 1855 లో స్థాపింపబడిన కాంగ్రెస్ 62 ఏళ్ల కృషి సల్పగా ఆఖరుకు గాంధీజీ నాయకత్వం క్రింద అహింసాత్మక విధానంలో, ప్రపంచమంతా విస్తుబోయేటట్లు అఖండ త్యాగాలు గావించగా— 1947 ఆగష్టు 15 వ తేదీని మనకు స్వరాజ్యం లభించింది. "ఎప్పటికైనా గరిక మేసిన గాడిదే పోతుందిగాని గరిక అట్లేయుండి నవనవోన్మేషితయై వర్ధిల్లుతుంది" అని పెద్దల వాక్కులు.

స్వరాజ్యం వచ్చి ఏడేళ్ళయింది. స్వాతంత్ర 'బాల' "అష్ట వర్షాత్ భవేత్కన్య" అన్నట్లు మొన్నటి 1954 ఆగష్టు 15 నాటికి చక్కటి 'కన్య'కా మణియై మన కళ్లెదుటనే పెరిగింది. ఈ కన్యనింకా పెంచి పెద్దదాన్ని చేసి, తీర్చిదిద్ది, ప్రపంచ దేశాలమధ్య సగర్వంగా నిలబెట్టవలసిన బాధ్యత భారతీయుల ప్రతిఒక్కరిదీ యైయుంది. స్వరాజ్యం ఎందుకు కావాలన్నామో, గాంధీజీ ఏరామరాజ్య స్థాపనకోసరం అహోరాత్రాలు కలలుగాంచేడో, ఆ ఆశయసిద్ధికోసరం అంతా సహకరించి కృషి సల్పవలసియుంది. అందరికి (36 కోట్ల ప్రజానీకానికి) సుఖ జీవనాన్కి వలసిన పని— పాటు, అన్నం— బట్ట, వసతి— విద్య, వైద్యం— విహారం వగైరా సౌకర్యాలు కల్పింపబడాలి. గ్రామసీమలు మళ్ళీ నిత్యకల్యాణం — పచ్చతోరణాలతో విలసిల్లాలి అంటే అందరితోడ్పాటు కావాలి.

స్వరాజ్యం తెచ్చిన హక్కులతోబాటు అనేక బాధ్యతలూ వచ్చాయి. పైవారు కల్పించిపోయిన సమస్యలూ ప్రత్యక్షమయ్యాయి. అటూ ఇటూ పాకిస్తాను, వాటినుండి తరలి వచ్చిన వేలాది కాందిశీకులు, వారి పునరావాసం, అమాయక ప్రజానీకంలో హత్యాకాండ నివారణ, అందందు దేశమంతటా పెట్టి పోయిన సంస్థానాల్ని కూడగట్టుకోవడం, ఇలా ఒక్కొక్క సమస్యే పరిష్కరించుకున్నాం. స్వాతంత్ర రంగంలో పోరాటం ఒక విధంగా పూర్తయింది. వెంటనే ఆర్థిక రంగంలోను, అధికాహారోత్పత్తి రంగంలోను మరోరకం పోరాటం ప్రారంభించాం. సమగ్ర దేశాభ్యుదయాన్కి పంచవర్ష ప్రణాళిక తయారుచేసుకున్నాం. అన్నిరంగాల్లోను అవసరమైన వస్తూత్పత్తికి చిన్నవీ పెద్దవీ

యైన అనేక ప్రాజెక్టులు ప్రారంభించాం. ప్రజలందరూ తమ ప్రభుత్వానికి పూర్తి సహకార సానుభూతుల నిచ్చి తోడ్పడ్డారు కనుక ఇప్పటికి ఆహారం— బట్ట వగైరా విషయాల్లో స్వయం సమృద్ధికి రాగలిగేం. ఇంత స్వల్పకాలంలో ఇంత సమర్థతతో సాధించిన వాటిని గురించి భారతీయులు సగర్వంగానే చెప్పుకోవచ్చు. ఇంకా సాధించవలసింది ఎంతో వుంది. దేశమంతటా కానవచ్చే నవచైతన్యం, నూతనోత్సాహం, నిర్మాణ కార్యక్రమ నిర్వహణలో ప్రతి ఫలించి, గ్రామసీమల సర్వతోముఖాభివృద్ధికి, అందు ముఖ్యంగా స్త్రీజనాభ్యుదయానికి, దోహదం కావాలి.

మన నెహ్రూ ప్రధాని అటు సిలోన్, ఇటు చైనాలతో సంప్రదించి సాధించిన తటస్థ వాతావరణం, అటు జెనీవా, ఇటు కొరియా, ఇండోచైనాల్లో ప్రతిఫలించగా, అంతర్జాతీయరంగంలో భారతదేశానికున్న విశిష్టత మరింత ప్రస్ఫుటమయింది. ఐహికాముష్మిక సుఖజీవనాలకు సులభ పంథాలు నిర్మించి మళ్ళీ భారత దేశం అన్నిదేశాలకు మార్గ దర్శకమౌతుందని ప్రపంచదేశాలన్నీ (హైడ్రోజన్ బాంబుల అట్టహాస వాతావరణంలో) గంపెడాశతో మనవంక నిరీక్షిస్తున్నాయి. ఈ బాధ్యతకూడ భారతవర్షం దిగ్విజయంగా నెరవేర్చగలదని పాశ్చాత్య ప్రముఖులే ప్రశం సిస్తున్నారు,

ఈ పరిస్థితులన్నీ ఆబాల గోపాలం అవగాహన చేసుకుని కలసికట్టుగా కృషి సల్పి సాధించవలసింది ఇంకా ఎంతో వుంది. పాకిస్థాన్‌తో నీటితగాయిదాలు, ఫ్రాన్సు, పోర్చుగల్లులతో జరుగుతున్న సంప్రదింపులుకూడా త్వరలోనే పరిష్కారమైతీరాలి.

"భారతభూమి— మనదేగాదా— ఫలితము మనదేగా" అని ఇక హాయిగా పాడుకుంటూ, పరస్పరం హెచ్చరించుకుంటూ, అంతా కృషి చేస్తే ఈ సమస్యలు అష్టమ స్వాతంత్ర సంవత్సరంలోనే తప్పక పరిష్కార మవుతాయి.

"ప్రజకున్ స్వస్తి మహీపతుల్ వసుమతిం బాలించుతన్ న్యాయతన్
ద్రిజగంబున్ భజయించుగాతసుఖ; మీదేశం బసంక్షోభమౌ ;
ద్విజగోసంతతి కౌసుభం ;.... ...."

అన్న సుజానాశీస్సులు ఫలిస్తాయని ఆశిద్దాం. ★

ఆంధ్ర మహిళాసభలో 8 వ స్వాతంత్ర్య దినోత్సవము

ఆగష్టు 15 వుదయం 9 గంటలకు ఆంధ్ర మహిళా సభలో 8-వ స్వాతంత్ర దినోత్సవము జరిగింది. శ్రీ గాడేపల్లి సూర్యనారాయణ శర్మగారు పతాకావిష్కరణ జరిపారు. సభ్యురాండ్రు, విద్యార్థినులు జండా వందనము చేసి జాతీయ గీతములు పాడిరి.

ఆ తరువాత శ్రీమతి చన్నఘంటమ్మగారి అధ్యక్షతను జరిగిన సభలో ప్రసంగిస్తూ శ్రీ శర్మగారు గాంధీజీ నాయకత్వాన్న జరిగిన స్వాతంత్రోద్యమాన్ని గురించి విపులంగా చెప్పారు. గాంధీజీ బోధించిన యాదర్శాన్ని పొగడుతూ, ఈనాడు కూడా మన జాతీయజండా సంపూర్ణ ఆత్మ సమర్పణ కోరుతున్నదన్నారు. నేడు మనకు స్వాతంత్ర్యం లభించిందని హర్షిస్తున్నామేగాని, గాంధీజీ కాంక్షించిన 'రామరాజ్య' స్థాపన నేటివరకు జరగలేదని, ఈ లక్ష్యసిద్ధికై ప్రతి భారతీయుడు కృషి చేయాలని అన్నారు.

శ్రీమతి చెన్నఘంటమ్మగారు గాంధీజీ ప్రబోధించిన నూతన యాదర్శాలను గురించి చెబుతూ 'రామరాజ్య' స్థాపన యిదివరకు జరగలేదని మనం ఏమాత్రం నిరుత్సాహ పడనవసరం లేదని నేటి కాంగ్రెసు ప్రభుత్వం 'వెల్ ఫేర్ స్టేట్' స్థాపించడానికి ప్రయత్నిస్తున్నది. అభివృద్ధి ప్రణాళికలు తయారుచేసి, ప్రజల సహకారంతో వానిని అమలులో పెట్టుతున్నదని అన్నారు. శ్రీమతి చెన్నఘంటమ్మగారి అభివందనాలతో సభ ముగిసింది.

వరలక్ష్మీ వ్రతం

ఆగష్టు 13 వ తేదీ శుక్రవారం సాయంకాలం మహిళా సభ సభ్యురాండ్రు, విద్యార్థినులు జేరి సభా భవనములో వరలక్ష్మీ వ్రతం చేసేరు. సహస్రనామార్చన, పూజ జరిగింది. —టి. సుశీల.

ఆంధ్రరాష్ట్రంలో ప్రారంభించిన
సంఘ సంక్షేమ కేంద్రాలు

భారతసప్తమ స్వాతంత్ర్య వార్షికోత్సవ సందర్భంలో 1954 ఆగష్టు 15 వ తేదీని ఈ క్రింది జిల్లాల్లో సంక్షేమ కేంద్రాలు ప్రారంభింప బడ్డాయని ఆంధ్రరాష్ట్ర చైర్మను శ్రీమతి ఎ. చెన్నఘంటమ్మగారు తెలియ పరుస్తున్నారు.



శ్రీమతి ఎ. చన్నఘంటమ్మ
ఆంధ్రరాష్ట్రసంఘసంక్షేమబోర్డు చైర్మన్.

శ్రీకాకుళం జిల్లా : జిల్లా కలెక్టరు శ్రీ కరియప్పగారు పాత్రునివలస గ్రామంలో పార్కుకు ప్రారంభోత్సవం చేశారు. సాంఘికసంక్షేమ విస్తరణ స్కీము క్రింద ఈ పార్కు నిర్మింపబడింది. శ్రీ కరియప్పగారు మాతాశిశు సంరక్షణ కేంద్రానికి గూడా ప్రారంభోత్సవం జరిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని కార్య క్రమాల్ని గురించి మాట్లాడేరు.

పాత్రునివలస, అంపోలు, గ్రామాల్లో రెండు మాతా శిశు సంరక్షణ కేంద్రాలు ప్రారంభించేరు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజలు డబ్బు ఎలా యిస్తున్నది చెప్పేరు. ప్రజలు డబ్బు రూపేణాగాని, కాయకష్టం ద్వారాగాని, సాధన సామాగ్రి ద్వారాగాని, యివ్వ వచ్చునన్నారు, శ్రీమతి పొన్నమ్మ కరియప్ప, డి. సువర్ణాబాయి గారు మాతాశిశు సంరక్షణ గురించి మాట్లాడారు. శ్రీమతి పొన్నమ్మ కరియప్పగారు శిశుసంరక్షణ కేంద్రాన్ని తెరిచేరు. సభకు పూర్వం, శ్రీ. పి. సూర్యనారాయణగారు, జిల్లా కలెక్టరు గారికి పూలమాలవేసి, స్వాగతం చెప్పారు. సమాజ సంక్షేమ విస్తరణ సంఘసభ్యులు వీరిని ఊరేగింపుతో సభాస్థలికి తోడ్కొని వెళ్ళారు. పాత్రునివలసలో కార్య క్రమం ముగించుకొని, అక్కడికి 7 మైళ్ళలో ఉన్న అంపోలు గ్రామంలో జాతీయ విస్తరణ వికాశ బ్లాకుకు శ్రీ కరియప్పగారు ప్రారంభోత్సవం చేశారు.

విశాఖపట్నం జిల్లా : ఈ జిల్లాలో, బాలచెరువు గ్రామమందు సంక్షేమకేంద్రం ప్రారంభింప బడింది. గ్రామస్తులు చాల ఉత్సాహంతో ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. శ్రీమతి కృష్ణగారు, రిజిష్ట్రారుగారి సతీమణి, లాకళాశాల ప్రిన్సిపాలుగారి సతీమణి, మునిసపల్ డాక్టరు, వారి సతీమణి, మునిసిపల్ కౌన్సులరు. కుమారి. అనసూయాదేవి గారు, శ్రీమతి రుక్మణమ్మగారు, తదితరులు, ఈ ప్రారంభోత్సవంలో పాల్గొని జయప్రదంగా జరిగించేరు.

తూర్పుగోదావరి జిల్లా : ఈ జిల్లా సంక్షేమ వికాసకార్యక్రమాల ప్రాజెక్టు ప్రథమ కేంద్రాన్ని రాజానగరంలో, రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామినిత్యానందంగారు బాలనేరస్తులకు, వికలాంగులకు ప్రారంభించారు. శ్రీనివాసాచారిగారు అధ్యక్షత వహించారు. జిల్లా ప్రాజెక్టు కన్వీనరు కేంద్రపు ఉద్దేశాలను వివరించారు. శ్రీమతి లీలావతిగారు, శ్రీ వెంకట్రాజుగారు, పంచాయతీ బోర్డు అధ్యక్షులు శ్రీ పేర్రాజుగారు, సత్తిరాజుగారు, శ్రీ సూర్యయ్యగారు తదితర్లు మాట్లాడేరు. 54 కుంచాల రాగిభూమిని విరాళంగా ఇవ్వడాన్కి వాగ్దానం చేసేరు. పంచాయితీబోర్డు అధ్యక్షులు పలువిధాల సహాయం చేయడాన్కి ఒప్పు కున్నారు. సుమారు 12 గురు వికలాంగులు చాపల్నీ, బుట్టల్నీ అల్లేరు. తరువాత వికలాంగులకు, బాలనేరస్తులకు భోజనాలు పెట్టేరు.

పశ్చిమగోదావరి జిల్లా : ఈ జిల్లాలో కాళ్ళకూరు గ్రామంలో నర్సాపురం సబ్ కలెక్టరు శ్రీ బి. ఎస్. జయసింహాగారు సంక్షేమ కేంద్రానికి ప్రారంభోత్సవం జరిపేరు.

సంక్షేమ కేంద్రాలు

కమిటీ సభ్యులు శ్రీమతి ముల్పూరు చుక్కమ్మగారు అధ్యక్షత వహించేరు. శ్రీమతి రామారాజగోపాల్ జాతీయ పతాకము ఎగుర వేశారు. ప్రాజెక్టు కమిటీ కన్వీనర్ ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ గారు ఏర్పాట్లను జయప్రదంగా చేశారు.

కాళ్ళకూరు గ్రామస్థులు దాదాపు 6 వేల రూ. విలువ చేసే భవనాన్ని కొంతస్థలాన్ని ప్రసూతి శిశు కేంద్రానికి విరాళంగా యిచ్చేరు, ఈ కేంద్ర విజయానికి ఆ తాలూకా పెద్ద లంతా చాల తోడ్పడ్డారు.

ఈ విధంగా ఆరోజు కార్యక్రమం చాల జయప్రదంగా జరిగింది.

కృష్ణాజిల్లా : ఈ జిల్లాలో పోరంకి పెనమలూరు గ్రామాల్లో సంక్షేమ కేంద్రాలు ప్రారంభించేరు. నున్న గ్రామంలో జిల్లాకలెక్టరు శ్రీ అమేషా అబ్దుల్‌ఖాదర్‌గారు సంక్షేమ కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు. చింతా నారాయణ స్వామిగారు స్వాగత మిచ్చారు. మద్దాల సోమశేఖరరావు గారు. శ్రీమతి పాచుర్తి సుందరమ్మ, శారదగార్లు, ఈకార్య కలాపాలకు సహాయపడ వలసిందిగా గ్రామస్థులకు విజ్ఞప్తి చేసారు. భీమవరం కోటిరెడ్డిగారు వందనము అర్పించారు. ఈ కేంద్రంలో ఒక మహిళా సంక్షేమ ఆర్గనైజరు, ఒక మంత్రసాని ఉన్నారు.


గుంటూరుజిల్లా : పల్నాడు తాలుకాలోని ఘుర్జంపాడులో సంక్షేమ కేంద్రం ప్రారంభింప బడింది. అచ్చట ప్రసూతి చికిత్సాలయం తెరువబడింది. దీనికి శ్రీయుత మేడగం సుబ్బారెడ్డిగారు 10 వేల రూపాయలు ఇస్తామని వాగ్దానం చేసేరు. గుంటూరు జిల్లా ప్లానింగు ఆఫీసరు సంఘ అభివృద్ధిస్కీములో నుండి 10 వేల రూపాయలు ఇస్తామన్నారు. ఇతరులు, ఇతర విధాలుగా సహాయం చేస్తామన్నారు. ఒక మంత్రసానిని నియమించేరు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, పైసంఘంవారితో బాగా సహకరించారు.

నెల్లూరుజిల్లా : ఈ జిల్లా సంక్షేమ కార్యక్రమాల సంఘం వారు సంక్షేమ కేంద్రాలు ప్రారంభించారు. సగం గ్రామంలో సంక్షేమ కేంద్రాన్ని జిల్లాకలెక్టరు సతి శ్రీమతి మేడప్పగారు తెరచినారు. తరువాత డా॥ లక్ష్మిగారు, అల్లాడి అన్నపూర్ణమ్మగారు, తదితరులు ఈ సంక్షేమ కేంద్రాల్ని గురించి మాట్లాడేరు. తరువాత ఒక మిడిల్ స్కూలుకు, ఆస్పత్రికి శ్రీమతి మేడప్పగారు శంకుస్థాపన చేసేరు. ఇలాగే మర్రిపాడు, కొర్రిమర్ల, సిద్దిరెడ్డిపాలెం



మాంబట్టు ప్రసూతి కేంద్రం పారంభోత్సవం

ఆంధ్ర మహిళాసభ ప్రాజెక్టు కమిటీవారు నిర్వహిస్తున్న భాగం.



బ్లాకు నం. 1	బ్లాకు నం. 2	బ్లాకు నం. 3	బ్లాకు నం. 4	బ్లాకు నం. 5
1. కడలూరు	1. అక్కంపేట	1. తడ	1. రామపురం	1. వాటమబేడు
2. కొండూరు	2. అండగుండల	2. బోడిలింగలపాడు	2. పెరియావట్టు	2. దేవునికంద్రిక
3. మాంబట్టు	3. చేనిగుంట	3. తడకంద్రిక	3. పన్నన్గాడు	3. వెలగలవాగు
4. ఎండలూరుపాడు		4. పూడి		4. గొల్లలముల్వ
		5. కారూరు		5. గోపాలరెడ్డిపాలెం.
				6. కారిజాత

సంక్షేమ కేంద్రాలు

గ్రామాల్లో సంక్షేమ కేంద్రాలు ప్రారంభించేరు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పైసంఘంవారితో బాగా సహకరించారు.

<u>మహిళాసభ వెల్ఫేర్ ప్రాజెక్టు ప్రారంభం :</u> ఈ జిల్లాలో అదనంగా ఆంధ్ర మహిళాసభ సంక్షేమ ప్రాజెక్టువారు మరొక విస్తరణ కేంద్రాన్ని తెరిచేరు.

మహిళాసభవార్ని నెల్లూరుజిల్లాలో ఒక ప్రాజెక్టు నిర్వహించమన్నారు, ఈ కమిటీ నియామకాన్ని గురించి జూలై ఆంధ్రమహిళలో చూచే యుంటారు. ఈ కమిటీవారు జిల్లాకలెక్టరుతో సంప్రదించి, సూళ్ళూరుపేట తాలూకాలో, వెనుక బడిపోయిన ప్రాంతంలో 20 గ్రామాలు ప్రాజెక్టుగా నిశ్చయించేరు. దీన్ని 5 బ్లాకులుగా పరిగణించి వీటిలో సంక్షేమ కార్య క్రమాన్ని అమలు జరపటాన్కి నిశ్చయించేరు. ముందుగా అగస్టు 15 వ తేదీని మొదటి బ్లాకులో గల మాంబట్టు గ్రామంలో పని ప్రారంభించేరు. ఆ గ్రామస్థులతో సంప్రదించగా తమకు అవశ్యం ఒక ప్రశూతి కేంద్రం కావాలని, అందుకు వలసిన బిల్డింగు యిచ్చేరు.

మహిళాసభ కమిటీ మెంబర్లు స్వాతంత్ర దినంరోజున ఆ బ్లాకులోని గ్రామస్థులు, సూళ్ళూరుపేట పౌరులు, ఆప్రాంతీయ ఉద్యోగులు అందరు అమితోత్సాహంతో తోడ్పడగా సంక్షేమ కార్య క్రమానికి ప్రారంభోత్సవం జరిపేరు. ఆరోజున ఊరంతా తోరణాలు, పందిళ్ళతో అలంకరించేరు. గ్రామ పాఠశాల ఆవరణలో గొప్ప సమావేశం జరిగింది. ఉదయం మేళతాళాలతో గ్రామ విద్యార్థుల పాటలతో కుమారి గిడుగు భారతి, బాలానంద సంఘ బాలికలయొక్క ప్రార్థన గీతావళితో, సూళ్ళూరుపేట పంచాయితీబోర్డు ప్రెసిడెంటు శ్రీ కె. రాజగోపాలశెట్టిగారు పతాకావిష్కరణ గావించేరు. ఆనాటి స్వాతంత్ర్య దినం ప్రాముఖ్యతను గురించి ముచ్చటించేరు. ఆవెనుక మాంబట్టు గ్రామ పంచాయితీ బోర్డు ప్రసిడెంటు శ్రీ గురప్ప దేవర్‌గారి అధ్యక్షతను గొప్ప బహిరంగసభ జరిగింది. సూళ్ళూరుపేట డెప్యూటి తాహసిల్దారు శ్రీ ఎస్. నాగభూషణర్రావుగారు పంచవర్ష ప్రణాళిక ఆశయాల్ని గురించి ప్రజలకు తెలియజెప్పేరు. ప్రాజెక్టు కమిటీ సెక్రటరీ శ్రీమతి టి. జి, హైమవతిగారు సంఘసంక్షేమ కార్యక్రమాన్ని గురించి, గ్రామస్థులీయవలసిన సహకార సానుభూతుల్ని గురించి మాట్లాడేరు. సూళ్ళూరుపేట హైస్కూలు హెడ్‌మాస్టరుగారు శ్రీ వెంకట్రామయ్యగారు, హరిజన హాస్టల్ సెక్రటరీ గణపతయ్యగారు గాంధీజీ నిర్మాణ కార్యక్రమాన్ని గురించి, స్వయంకృషిని గురించి సభ్యులను హెచ్చరించేరు. ప్రాజెక్టు కమిటీ మెంబరు శ్రీమతి కె, సుగుణమణిగారు దేశాభ్యుదయంలో గ్రామాభ్యుదయానికున్న ప్రత్యేకతను గురించి, అందు స్త్రీ జనాభ్యుదయానికున్న ప్రత్యేకనుగురించి, ప్రశూతి కేంద్రంయొక్క ఆవశ్యకతనుగురించి ముచ్చటించేరు, ఆంధ్రులు కార్యశూరులై ఇతరులకు ఆదర్శకులు కావాలని హెచ్చరించేరు.

తర్వాత శ్రీమతి యన్. కామేశ్వరమ్మ (రేడియో అక్కయ్య)గారు ప్రసూతి కేంద్రాన్ని తెరుస్తూ బాలల పురోభివృద్ధికి వలసిన దోహదాల్నిగురించి విశదీకరించేరు. పిమ్మట అధ్యక్షుని తుది పల్కులు, వందన సమర్పణ, జన-గణ-మన గీతాలతో సభ ముగిసింది. మధ్యాహ్నం గ్రామస్థులు బీదసాదలకు ఐదారువందలమందికి సంతర్పణ గావించేరు.

సాయంత్రం శ్రీమతి ఎన్. కామేశ్వరమ్మగారు పిల్లల క్రీడా కేంద్రానికి ప్రారంభోత్సవం చేసేరు, ఇందుకు కావలసిన ఆట స్థలంకూడ గ్రామస్థులు ప్రత్యేకంగా యిచ్చేరు. "అక్కయ్యగారు" ఆప్రాంతాల "చిట్టి చిట్టి చెల్లాయిలు, తమ్ముళ్ళ"ను పోగుచేసి ఆటలు, పాటలు నృత్యాలపోటీల కార్యక్రమాలు జరిపి, అంతా ఆనంద వినోదాల్లో పాల్గొనేటట్లు చేసి దిగ్విజంగా నడిపించేరు. నెగ్గినవారికి బహుమతులు, వచ్చినవారందరికీ స్వీట్సు పంచిపెట్టారు. పరిసర బ్లాకులవారంతా త్వరలో తమకు కూడా ఈమాదిరి ఏర్పాట్లు చేయవలసిందని కోరేరు,

ఇలా ఆనాటి కార్యక్రమం అతి జయప్రదంగా సాగింది.

<u>చిత్తూరుజిల్లా :</u> ఈ జిల్లాలో యాదమగిరి గ్రామంలో సంక్షేమకేంద్రం ప్రారంభించబడింది. జిల్లా కలెక్టరు యాగంటిగారు ప్రసూతి వైద్యశాల భవనానికి ప్రారంభోత్సవం జరిపారు. సభకు శ్రీ పి. చిన్నమ్మరెడ్డి ఎం.ఎల్.ఎ.గారు అధ్యక్షత వహించారు. చిత్తూరుజిల్లా ప్లానింగు ఆఫీసరు శ్రీ పి. రాజగోపాల్ నాయుడుగారె మునిసిపల్ చేర్మెన్ శ్రీమతి ఆర్. రత్నాబాయమ్మగారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సతీమణిగారు, సమావేశానికి వచ్చారు. సుమారు వెయ్యిమంది స్త్రీ పురుషులు సమా

(మిగతా 27-వ పేజీలో చూడండి)



రాజకీయాలు

• శ్రీ గోళ్ళమూడి రామచంద్రరావు •

1954 జులై నెల నాలుగో వారం మొదలుకొని ఆగస్టు మూడో వారం వరకూ అంతర్జాతీయ రాజకీయ రంగంలో చెప్పుకోతగ్గ ప్రముఖ సంఘటనలు ఇవి— సూయజ్ సైనిక స్థావరాల విషయమై బ్రిటన్, ఈజిప్టులకు ఒప్పందం కుదరటం, పర్షియా నూనె పరిశ్రమను నడిపించే విషయమై విదేశ నూనె కంపెనీలతో పర్షియా ప్రభుత్వం రాజీ కుదుర్చుకొనటం, ఆగ్నేయాసియా సైనిక ఒప్పందంలో చేరేందుకు పాకిస్థాన్ మినహా కొలంబో రాజ్యాలన్నీ నిరాకరించటం, యూరప్ దక్షిణ ఒప్పందంపై అభిప్రాయ భేదాలు పెరగటం, బ్రిటన్, చైనాల రాజకీయ సంబంధాలు అభివృద్ధి కావటం. భారత రాజకీయ రంగంలో చెప్పుకోతగ్గ అంశాలు గోవా సత్యాగ్రహోద్యమం, ఉత్తర ప్రదేశ్ సోషలిస్టు సత్యాగ్రహం.

ఆంధ్రదేశ వ్యవహారాల్లో చెప్పుకోతగ్గవి కల్లు గీతకార్మికుల, ఇనాం రైతుల సత్యాగ్రహాలు.

*   *   *

ఎంతో కాలంనుంచీ పరిష్కారం కాకుండా ఉండి, ఈజిప్టులో ఎన్నో ప్రభుత్వాల పతనానికి కారణమయిన సూయజ్ స్థావరాల సమస్య ఈ నెలలో సౌమ్యంగా పరిష్కారమయింది. ఆ ప్రాంతంనుంచి తమ సేనలను క్రమక్రమంగా ఖాళీ చేయటానికి బ్రిటన్ అంగీకరించింది. రెండు పటాలాలు అక్కడినుంచి బయలుదేరటం కూడా జరిగింది. టర్కీ, మధ్య ప్రాచ్య దేశాలపై దండయాత్ర జరిగే సందర్భంలో బ్రిటిష్ సేనలు తిరిగి ఇక్కడికి రావటానికి కొత్త ఒప్పందం అవకాశమిస్తున్నది. అయితే దురాక్రమణ అని నిర్ణయించటంలో ఈజిప్టును సంప్రదించవలసి వుంటుంది. స్థావరాన్ని సరయిన పద్ధతిలో ఉంచటం విషయమై ఈజిప్టు వాదమే నెగ్గింది.

ఈ ఒప్పందంతో ఈజిప్టు విప్లవ నాయకులు తమ ఆశయాలు రెండింటినీ సఫలం చేసుకున్నారు. సూడాన్ ఎన్నికల్లో ఆ ప్రజలు ఈజిప్టులో చేరాలని కోరుతున్నట్లు నిరూపించి నైలు నదీలోయను ఏకం చేశారు. ఇప్పుడు బ్రిటన్‌ను సాగనంప గలుగుతున్నారు. ఈ లోపలే విప్లవ నాయకులు పదభ్రష్టులవుతారని బ్రిటిష్ ప్రధాని చర్చిల్ ఆశించాడు కాని, వాళ్ళు మరీ గట్టిగా పాతుకుని పోవటంతో రాజీకి రాక తప్పలేదు.

బ్రిటన్‌ను ఒక చెంప సాగనంపుతూ మరొక చెంప అమెరకాను ఈజిప్టు నాయకులు ఆహ్వానిస్తున్నారేమోనన్న సందేహాలు అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో ఏర్పడ్డవి. అమెరికా సహాయాన్ని స్వీకరించటానికి వారు సుముఖత చూపటమే దానికి కారణం. అయితే ప్రాంతీయ రక్షణ వ్యవస్థలు వేటిలోనూ ఈజిప్టు చేరదని ఈజిప్టు నాయకులు ఖండితంగా ప్రకటిస్తున్నారు. ముఖ్యంగా పాకిస్థాన్ టర్కీ ఒప్పందంలో కానీ, అఖిల ముస్లిం ఒప్పందంలో కానీ చేరేదిలేదనీ, ఆ విధంగా చేసి 35 కోట్ల భారతీయుల అసంతృప్తికి తాము కారణం కాదలచలేదనీ వాళ్ళు స్పష్టపరుస్తున్నారు. అంతేకాక, మే నెలలో జరిగిన కొలంబో సభ నిర్ణయం ప్రకారం ఆసియా, ఆఫ్రికా దేశాల సమావేశాన్ని ఏర్పాటు చేయటానికి ఇండోనీషియా చేస్తున్న కృషిని ఈజిప్టు సమర్థించటం కూడా చూస్తే, ఈజిప్టు అంత సులభంగా అమెరికా గుప్పెట్లో చిక్కుకోదనే తోస్తుంది.

రాజకీయాలు

ఈ నెలలోనే మధ్య ప్రాచ్యంలోని మరొక ముఖ్య సమస్య పరిష్కారమయింది. ప్రధాని మొసాదిక్ జాతీయం చేసిన పర్షియా నూనె గనులను పని చేయించే విషయమై 8 విదేశీ కంపెనీలతో పర్షియా ప్రభుత్వం ఒక ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పదం పర్షియా నూనె జాతీయ చట్టాన్ని గుర్తిస్తున్నప్పటికీ, గనులను నడిపించి, నూనెను అమ్మించటంలో మాత్రం విదేశ కంపెనీల పెత్తనమే అంతా ఉంటుంది.

పర్షియా ప్రభుత్వం కూడా తాను ఎటువంటి ప్రాంతీయ రక్షణ వ్యవస్థల్లోనూ జేరేదిలేదని ప్రకటించింది.

* * *

యూరప్‌లో సోవియట్ యూనియన్ మీద కత్తి కట్టటానికి ఉత్తర అట్లాంటిక్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లే ఆగ్నేయాసియా ప్రాంతంలో కూడా చైనా కత్తి కట్టేందుకుగాను ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని అమెరికా ఎంతో ప్రయత్నించింది. కాని ఆగ్నేయాసియా దేశాల్లో స్వతంత్ర విధానాన్ని అనుసరిస్తున్న ఒక్కటీ అందులో చేరటానికి అంగీకరించలేదు. అమెరికాతో సైనిక ఒప్పందం చేసుకున్న పాకిస్థాను, అమెరికన్ తాబేదార్లుగా ఉంటున్న సయాం, ఫిలిప్పిన్‌లు మాత్రం సంప్రదింపుల్లో పాల్గొనేందుకు అంగీకరించినవి.

మే నెలలో మొదటి కొలంబో రాజ్యాల సభ జరిగినప్పుడే పాకిస్థాన్, సింహళాల వైఖరి కొంత వరకు బయట పడ్డది. తమకు కమ్యూనిస్టు సమస్య ఏమాత్రమూ లేక పోయినప్పటికీ, కమ్యూనిస్టు దేశాల దండయాత్ర ప్రమాదం అసలే లేక పోయినప్పటికీ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ప్రమాదాన్ని వలసవాదంతో పాటు పోల్చటానికి ఈ దేశాలు సాహసించినవి. ఇప్పుడు ఆగ్నేయాసియా వ్యవస్థ సంప్రదింపులకు కొలంబో రాజ్యాలను ఏ విధంగానయినా దించాలని సింహళ ప్రధాని ఇటీవల విశ్వ ప్రయత్నాలు చేశారు. కాని ఇండియా, ఇండోనీషియా, బర్మాలు దానికి నిరాకరించి, ప్రస్తుతం, అటువంటి ఒప్పందం ఏర్పడటం శాంతికి ప్రమాదకరమని హెచ్చరించటం వల్లనూ, సింహళ ప్రజలే చాలా మంది ప్రతికూలించటంవల్లనూ ఆయనకూడా అందులో పాల్గొనక పోయేందుకే నిశ్చయించుకున్నారు.

పాకిస్థాన్ మాత్రం అమెరికానే ఆశ్రయించుకుని ఉన్నందువల్లనూ, ప్రజాభిప్రాయాన్ని పాటించే అలవాటు లేనందువల్లనూ, పశ్చిమ రాజ్యాలు సెప్టెంబర్‌లో ఏర్పాటు చేసిన సంప్రదింపులకు హాజరుకావటానికేనిశ్చయించుకున్నది.

ఇండియా మొదలైన దేశాలు సమర్థించని వ్యవస్థ తన శక్తి మీద తాను నిలబడటం అసాధ్యం. దానిని బలపరచటానికి ఇతర పశ్చిమరాజ్యాలుకూడా అట్టే ముందుకురావు. ఇంకపోతే అమెరికా ఒక్కటే ఆభారాన్ని వహించవలసి వుంటుంది.

* * *

తన సరికొత్త ఆయుధ బలంతో ఎటువంటివాళ్ళనయినా దెబ్బ తీయవచ్చునని అమెరికా ఉబలాటపడి, ఐక్యరాజ్య సమితిలో 'ఆమోదాల నాటకం' కూడా పూర్తి కానివ్వకుండా, కొరియా యుద్ధంలోకి దూకింది. కేవలం ఆయుధ బలం పట్టుదలతో ఉన్న ఆసియా ప్రజలను లొంగదీయలేదని తెలుసుకున్నది. కొన్ని లక్షలమంది సైనికులను పోగొట్టుకున్నది. అందుకని ఆసియా ప్రజల్నే చీలదీసి చైనామీదికి ఉసి కొల్పాలని ప్రయత్నిస్తున్నది. దానికి సిద్ధపడుతున్నది ప్రజామోదాన్ని పొందలేని ఆసియా దేశాల ప్రభుత్వాలే. సైనిక తిరుగుబాటుతో సయాంలో అధికారం చేజిక్కించుకున్న పిబుల్ సంగ్రాం, ప్రజలు తరిమివేస్తే అమెరికా నౌకా బలం చాటున దాక్కున్న చాంగ్ కై షెక్, బ్రిటిష్‌వాళ్ళు అధికారం అప్పగించిన లగాయతు ఎన్నికలు జరపకుండానూ, జరిగిన ఎన్నికలను రద్దుచేస్తూనూ ఉన్న పాకిస్థాన్ అధికారులు మినహా వాళ్ళను సమర్థించే వాళ్ళే లేకపోయినారు.

ఫార్మోజాలో చాంగ్ కై షెక్‌ను నిలబెట్టటానికి అవసరమయితే పెద్ద పోరాటానికే అమెరికా సిద్ధంగా ఉన్నట్లు ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ ప్రకటించటం, కొరియా, ఇండోచైనాల ఒప్పందాలను అమెరికా ఖండిస్తూ ఉండటం ఆగ్నేయాసియా ఒప్పందాన్ని ఏర్పరచాలని చేస్తున్న ప్రయత్నాలూ - ఇవన్నీ చూస్తే అమెరికా తన విధానాన్నేమీ మార్చుకోదలచలేదనీ, ఏదో విధంగా దూర ప్రాచ్యంలో చైనాతో గిల్లి కజ్జా తెచ్చుకోవాలని ఆలోచిస్తున్నదనీ తోచక మానదు.

రాజకీయాలు

యూరప్ రక్షణకని అమెరికా ప్రతిపాదించిన యూరప్ సైన్య పథకం ఇంతవరకూ ఫ్రాన్సు, ఇటలీల ఆమోదం పొందలేదు. ఆపథకం ప్రస్తుతపు పద్ధతిని పట్టి తిరిగీ జర్మన్ సైనిక విజృంభణకు అవకాశం ఇస్తుందని ఫ్రాన్సు భయపడుతున్నది. అందువల్ల ఫ్రాన్సు కొన్ని హామీలనూ, ప్రత్యేకాధికారాలనూ కోరుతున్నది. వీటికి అమెరికా కానీ, ఇతర యూరప్ రాజ్యాలుకానీ సుముఖంగా లేవు. ఫ్రాన్సు ఆమోదాన్ని చూడనిదే ఇటలీ ఈ పథకాన్ని ఆమోదించదనే చెప్పవచ్చు. అవి ఆ పథకాన్ని ఆమోదించకపోతే జర్మనీని సాయుధం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవలసి వస్తుందని ఐసెన్‌హోవర్ బెదరిస్తున్నాడు.

* * *

ఇది ఇట్లా ఉండగా, రష్యా అఖిలయూరప్ రక్షణకు ఒక పథకాన్ని ప్రతిపాదించింది. అందులో యూరప్ రాజ్యాలు యావత్తూ, అమెరికా పాల్గొనవచ్చుననీ రష్యా సూచించింది. ఆ ఒప్పందంలో బ్రిటన్, అమెరికాల ప్రవేశానికి రష్యా అంగీకరిస్తున్నందువల్ల, పశ్చిమ యూరప్‌ను ఒంటరిచేసి రష్యా దెబ్బతీస్తుందన్న భయానికి ఆస్కారంలేదు. జర్మనీలో సైనిక వాదం తల ఎత్తటం ఫ్రాన్సుకు ఎంత ప్రమాదకరమో రష్యాకూ అంత ప్రమాదకరమేకనుక ఆ భయంకూడా వుండదు. అందువల్లనే ఫ్రాన్సు ఒక్కటీ ఆ ప్రతిపాదనపై సంప్రదింపులు జరపటానికి ఇష్టపడుతున్నది.

* * *

జెనీవా సమావేశంలో చౌలిన్‌లే, ఆంతోనీ ఈడెన్‌లు కలుసుకున్నప్పటినుంచీ ఇండోచైనా పరిష్కారానికి చైనా సాయపడినప్పటినుంచీ బ్రిటన్, చైనాల రాజకీయ సంబంధాలు దృఢపడుతున్నవి. రాయబారి హోదాలో కాకపోయినప్పటికీ, కొంత చిన్నహోదాగల ప్రతినిధులనే పరస్పరం నియమించుకునేందుకు ఆసియా దేశాలు నిశ్చయించినవి. బ్రిటిష్ ప్రతినిధి నియామకం ఇంతకుముందే జరిగి ఉన్నది. ఫ్రాన్సుకూడా ఇండోచైనా సమస్యలో చైనా వైఖరిని హర్షించింది. చైనా పట్ల బ్రిటన్, ఫ్రాన్సుల సద్భావం, చైనాకు సమితిలో స్థానం ఉండవలసిందేనంటున్న న్యూజీలాండ్ వైఖరి, చైనా పట్ల ఆగ్నేయాసియాదేశాల స్నేహభావం— ఇవన్నీ చైనాపట్ల అమెరికా కొంత జాగ్రత్తతో మెలగాలని సూచిస్తున్నవి. ఆఖరికి జపాన్ ప్రభుత్వపక్షనాయకులుకూడా అమెరికా విధానం విఫలమయిందని బాహాటంగా విమర్శిస్తున్నారు.

* * *

ఈ నెలలోనే డచ్చి - ఇండోనీషియన్ యూనియన్ ఏర్పాటు రద్దు చేయబడ్డది. పశ్చిమ న్యూగినీని ఇండోనీషియాకు అప్పగించటానికి హాలెండ్ నిరాకరించింది. సమితి ఆప్రస్తావన తీసుకురావటానికి ఇండోనీషియా చర్యలు తీసుకుంటున్నది. మధ్యధరా సముద్రంలోని సైప్రస్‌ద్వీపం తమకు ఇప్పించాలని గ్రీకు ఐక్యరాజ్యసమితికి విజ్ఞప్తి చేసింది. అది ఇప్పుడు బ్రిటిష్ పాలనలో ఉన్నది. ఇండోచైనాలో ఆగస్టు 11 న యుద్ధవిరమణ జరిగింది. పర్యవేక్షణ ప్రారంభ మయింది.

ఆగస్టు 15 వ తేదీ - భారత స్వాతంత్ర్య దినంనాడు - గోవా ప్రజలు శాంతియుత సత్యాగ్రహోద్యమం ప్రారంభించారు. పరిసర భారత ప్రాంతాల్లో ఉన్న గోవా వాస్తవ్యులు ఈ సత్యాగ్రహం నడుపుతున్నారు. గోవా జాతీయులు కాని భారతీయులు వెళ్ళటానికి భారత ప్రభుత్వం అనుమతించలేదు. అసలు ఈ ప్రాంతాలను గురించి సంప్రదింపులు జరిపే అవసరమే లేదని వాదిస్తూ వచ్చిన పోర్చుగల్ ఇప్పుడు తటస్థ ప్రతినిధుల పరిశీలన జరగాలంటూ కోరుతున్నందువల్ల భారతీయ సత్యాగ్రహులను భారతప్రభుత్వం అనుమతించటంలేదు. పోర్చుగీస్ ప్రాంతాలనే కాక, పరిసర భారత ప్రాంతాల పరిస్థితులను కూడా తటస్థ ప్రతినిధులు పరిశీలించాలని పోర్చుగల్ వాదిస్తున్నది. భారత ప్రభుత్వం దానికి నిరాకరించింది, ఈ ప్రాంతాల పరిస్థితులను గురించే కాక, వాటి భవిష్యత్తును గురించి కూడా సంప్రదింపులు జరగాలని కోరుతున్నది. ఆగస్టు 24 న ఢిల్లీలో సంప్రదింపులు ప్రారంభించాలని కోరింది.

ఇండియా ప్రాంతాల మధ్య లంకవలె ఉన్న పోర్చుగీస్ ప్రాంతాల విమోచన పూర్తి అయింది. అయితే ఈ సందర్భంలోను ఫ్రెంచి ఇండియా విమోచనోద్యమ సందర్భంలోను, విమోచన మనే కీర్తిని సంపాదించటం కోసం

రాజకీయాలు

అక్కడి పార్టీల మధ్య స్పర్ధలు పెరుగుతున్నట్లు తెలుస్తున్నది.


ఉత్తరప్రదేశ ప్రభుత్వం నీటితీరువను హెచ్చించింది. దానికి నిరసనగా ప్రజాసోషలిస్టులు సత్యాగ్రహం జరుపుతున్నారు. ప్రభుత్వ విధానాలకు ప్రజలు తమ అసమ్మతిని తెలియజేసేందుకు సత్యాగ్రహం పనికిరాదని కాంగ్రెస్ పెద్దలు అంటున్నారు. సత్యాగ్రహమే పనికిరాకపోతే, ప్రజల అసంతుష్టి ఏవిధంగా పరిణమిస్తుందో ఊహించటానికి ఆట్టే కష్టపడనక్కరలేదు.

ఆంధ్రరాష్ట్రంలో కూడా రెండు సత్యాగ్రహాలు సాగుతున్నవి. ఈనాంరైతుల హక్కులను రక్షించేందుకు ప్రజాసోషలిస్టులు కరివెన అనే ఈనాం గ్రామంలో సత్యాగ్రహం జరుపుతున్నారు. ఈనాందారులకు భూములమీద మేల్‌వరం హక్కులేకాని, కుడివరం హక్కులు లేవని వాళ్ళు వాదిస్తున్నారు. ఎసెంబ్లీ సోషలిస్టు నాయకుడు పి. వి. జి. రాజుగారు మొదలైన వాళ్ళు అరెస్టయినారు. ఆంధ్ర ప్రభుత్వం ఈనాం రైతురక్షణ బిల్లు ముసాయిదాను ప్రకటించిందికాని, అది ఉపయోగించేది కాదని సోషలిస్టులు అభిప్రాయ పడుతున్నారు.

మద్యనిషేధం వల్ల నిరుద్యోగులయిన కల్లుగీతకార్మికుల తరఫున కె.ఎల్.పి. నాయకులు, కమ్యూనిస్టులు సత్యాగ్రహాలను నడుపుతున్నారు. ఆగస్టు 19 వరకు ఈ ఉద్యమాల్లోనూ, కరిలెన్ సత్యాగ్రహంలోనూ కలిపి 1160 మంది అరెస్టయినారు. మద్యనిషేధాన్ని రద్దుచేయాలని రామమూర్తి కమిటీ చేసిన సిఫార్సులను అమలు జరపవలసిందని ఆంధ్ర శాసన సభ గతసమావేశంలో తీర్మానించి ఉన్నది. పార్లమెంటరీ విధానంలో సత్సాంప్రదాయాలను ఏర్పరచి, తద్వారా పార్లమెంటరీ విధానాన్నే బలపరచటమే ప్రభుత్వ ఉద్దేశం అయినట్లయితే. అనధికార తీర్మానం నెగ్గటంతో రాజీనామా ఇచ్చి వుండవలసింది. లేకపోతే ఎసెంబ్లీ తీర్మానాన్ని అమలు జరపటమయినా చేసి ఉండవలసింది. కాని ఏదీ చేయకుండా. 'నీరో' పద్ధతినే అనుసరించ నిశ్చయించుకున్నది. దాని ఫలితమే ఈ సత్యాగ్రహాలు.

ప్రభుత్వం పార్లమెంటరీ సాంప్రదాయాలను ఉల్లంఘించింది కనుక, ఎసెంబ్లీలో విశ్వాస రాహిత్య తీర్మానం తీసుకుని రావలసిందని రాష్ట్ర కమ్యూనిస్టు కమిటీ ఆగస్టు 18 న తమ ఎసెంబ్లీపార్టీకి ఆదేశించింది.

ఇట్లా వ్యవహారాలు నడుస్తున్న సమయంలోనే, ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వంమీద తమ పెత్తనం గట్టిగా స్థాపించుకోవాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు. ముఖ్యమంత్రి కాంగ్రెస్ సహసభ్యుడు కనుకను, విశ్వనాథంగారు మినహా మిగిలినవారంతా కాంగ్రెస్ సభ్యులే కనుకనూ, ఆంధ్ర ప్రభుత్వం రాష్ట్ర కాంగ్రెస్ విధానాన్ని అనుసరించ వలసివుంటుందని వాళ్ళు వాదిస్తున్నారు. ఇటీవల ఆంధ్రాలో పర్యటించిన అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శి బల్వంతరాయ్ మెహతా కూడా ఈ వాదాన్ని సమర్థించారు. ఈ పరిస్థితులవల్ల వచ్చే ఎసెంబ్లీ సమావేశంలో ఆంధ్ర ప్రభుత్వపురంగు అటో; ఇటో తెలిసిపోతుందనే భావించవచ్చు.



అనాధ బాలికలు

డా॥ మిసెస్. ముత్తులక్ష్మిరెడ్డి

"అనాధలకు ఆహారం సమకూర్చలేని, విధవలకు మనశ్శాంతి యివ్వలేని భగవంతుడన్నా, మతమన్నా నాకు నమ్మకంలేదు." అని శ్రీరామకృష్ణపరమహంస శిష్యాగ్రేస్వరుడైన వివేకానందుడు ఉద్ఘాటించేడు. శ్రీరామకృష్ణుని దివ్య సందేశం ఈ శిష్యుని వల్లనే ప్రపంచానికి వెల్లడయింది. సంస్కృతం రాని మనలో చాలమందికి మన హిందూమతంలోని అనేక ధర్మాలు, స్వామి వివేకానందుని ప్రవచనాల ద్వారానే తేటతెల్లమయ్యేయి. రామకృష్ణమఠమూ, దాని వ్యవస్థాపకుడు శ్రీవివేకానందుడూ మూలంగా హిందూమతానికి పునర్జీవం ప్రాప్తించింది. దేశంలో ఎక్కడ క్షామాలు వచ్చినా, వరదలు, అగ్నిప్రమాదాలు వచ్చినా, అంటువ్యాధులు ప్రబలినా ఈ మఠంవారు చేసే సేవ అమోఘమైంది. శ్రీరామకృష్ణ సంస్థతరఫున అనేక అనాధశరణాలయాలు, ఆసుపత్రులు, విద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. వీరు ప్రత్యక్షంగా సేవలు గావించి– "మతమంటే మానవసేవ– మానవ సేవే– మాధవసేవ" అని నిరూపించేరు.



(డా॥ మిసెస్. ముత్తులక్ష్మిరెడ్డి)
(మద్రాసు అవ్వయ్‌హోమ్ సంస్థ వ్యవస్థాపకురాలు)

శ్రీమాన్ రాజగోపాలాచారిగారి అధ్వర్యాన్న రాష్ట్రంలోని దేవస్థానాలన్నీకూడ వాటికి వచ్చే ఆదాయంలో కొంత భాగం అనాధ బిడ్డల శరణాలయాలకు ఖర్చు పెట్టాలని నిర్ణయింపబడ్డం చాల హర్షింపదగ్గవిషయం. మన హిందూ మత చరిత్రలో ఇది గొప్ప ముందడుగు అవుతుంది.

"భగవంతుని ప్రసాదం అతని భక్తులందరూ పంచుకోవాలన్న ఉద్దేశంతో గుళ్ళల్లో ప్రసాదం పంచి పెడతారు. అందుచేత అటువంటి పవిత్రమైన వాతావరణంలో అనాధ బాలలు నివసించడం, పెరగడం, తర్ఫీదు పొందడం చాల సమంజసం" అని శ్రీరాజగోపాలాచారి గారు అడయారులో దేవస్థానం తరఫున తెరవబడ్డ మగపిల్లలఅనాధశరణాలయం ప్రారంభోత్సవ సందర్భంలో నుడివిన సుభాషితాలు. ఇప్పటికి దేవస్థానాల తరఫున 9 శరణాలయాలు తెరవబడ్డాయి. ఇంకా ఎన్నో తెరవవలసియుంది. ఈ రాష్ట్రంలో అనాధ బిడ్డలు లక్షలాదిగా వున్నారు. వీరిలో బాలురకన్నా బాలికలే ఎక్కువగానున్నట్లు జనాభా లెక్కల్లవల్ల తేలింది. ఈ అనాధ బాలికలను ఉత్తమ పౌరులుగా చెయ్యాలీ అంటే వారిని శరణాలయాల్లో పెంచి, యధోచిత శిక్షణనివ్వాలి. అలాగ ఆదరించనట్లయితే వాళ్ళంతా ముష్టివాళ్ళగానో, వ్యభిచారిణిలుగానో తయారవుతారు.

తల్లిదండ్రులున్నా కూడా బీదవాళ్ళయినట్లయితే ఆడపిల్లలకు వివాహాలు చెయ్యలేకపోవడం మనం చూస్తూనే వున్నాం. అటువంటప్పుడు అనాధలైన ఆడపిల్లలగతి వేరే చెప్పనక్కరలేదు. మన రాష్ట్రంలో విధవలు, భర్తల వల్ల విడిచిపెట్టబడ్డ దీనులు లక్షలాదిమంది స్త్రీలు పిల్లలతో అలమటిస్తున్నారు. మా శరణాలయంలోకి వచ్చేవారంతా ఈ తరగతికి చెందినవారే. అందుచేత స్త్రీలకు వివాహమొక్కటే జీవితపరమావధి అని అనుకోరాదు.

బాలికలు స్వతంత్రులుగా బ్రతుకగలవారిగాను, ఆత్మవిశ్వాసం గలవారిగాను తర్ఫీదు పొందియుండాలి. ఇంకా వారు టీచర్లు, డాక్టర్లు, నర్సులు, మంత్రసానులు, గుమస్తాలు, యిలా అనేక రకాల ఉద్యోగాలకు తర్ఫీదు పొందవచ్చు. ఏదో ఒక వృత్తిలో ప్రావీణ్యత పొందిన తర్వాత వారికి యిష్టమైనట్లయితే వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడవచ్చు. పిమ్మట ఏ కారణంచేతనైనా భర్త విడిచిపెట్టినా, లేక దురదృష్టవశాత్తు భర్త చనిపోయినా, ఆమె తననూ, తన కుటుంబాన్నీ కూడ పోషించుకోగలుగుతుంది. ఆడపిల్లల విషయంలో అంతా కూడా పైపద్ధతి ప్రకారం తర్ఫీదు ఇవ్వాలి.

అ నా థ బా లి క లు

మన హిందూమందిరాల్లో దేవునికీ, దేవికీ సమాన హోదానిచ్చి, అతనితోబాటు ఆమెనూ సమానంగా ఆరాధించి, పూజిస్తారు. దీన్నిబట్టే తెలుస్తుంది- మనమతంలో స్త్రీ పురుషులిద్దరూ సమానమేనని. అందుచేత బాలురతోబాటు అనాధ బాలికలకు కూడ దేవస్థానం తరపున కొన్ని శరణాలయాలు వుండాలి. క్రైస్తవ ప్రచారకులు, మత ప్రచారంకొరకని అనేక విద్యాసంస్థలు స్త్రీలకొరకు మన దేశంలో నెలకొల్పారు. అనాధ బాలికలకు, బాలురకు కూడ శరణాలయాలు స్థాపించేరు. అలాంటి క్రైస్థవ శరణాలయాలు దేశంలో 200 వరకు వున్నాయి. కాని మన హిందూ శరణాలయాలు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

"మన దేశంలో స్త్రీలకు సంబంధించిన గడ్డుసమస్యలు అనేకం వున్నాయి. ఐనా "విద్య— సద్విద్య- శిక్షణ" అనేటటువంటిగారడీ వల్ల ఎటువంటి సమస్యనైనా పరిష్కరించవచ్చు." అని శ్రీ వివేకానంద ప్రబోధించేరు. అందుచేత మీ స్త్రీలను విద్యావతులుగా చెయ్యండి. నేను ఒక స్త్రీగా బిడ్డలున్న తల్లిదండ్రులందరికీ యిదే సందేశం తిరిగియిస్తున్నాను. దేవస్థానాల్లోని అధికారులంతా పురుషులే అవడంవల్ల బాలికల శరణాలయాలు నిర్వహించడం కష్టమేగావచ్చు. కాని మద్రాసు పట్నంలో అనేక స్త్రీ సంస్థలున్నాయి. దేవస్థానంవారు ఆర్థిక సహాయం చేసినట్లయితే యీసంస్థలే బాలికల శరణాలయాలు కూడా నడపగలవు. తిరుపతి దేవస్థానంవారు మాత్రం బాల, బాలికల శరణాలయాలు రెండూకూడ జయప్రదంగా నడపగలుగుతున్నారు.

(సోషల్ వెల్ఫేర్ పత్రికనుండి)

పెద్దలీవిధంగా చెపుతున్నప్పుడు, దేశంలో అనాధల పిల్లలకు ఎంతో రక్షణ, పోషణాకల్పించాలని సంఘ సంక్షేమ శాఖ కృషి చేస్తున్నప్పుడు— ప్రభుత్వం యిదే తమ ఆశయం అని ప్రకటిస్తున్నప్పుడు- 40 ఏళ్ళగా శ్రీ పిఠాపురం మహారాజావారి ధర్మం వల్ల దిగ్విజయంగా ఎప్పుడూ 80 మంది (తల్లిదండ్రుల్లేని) బాల - బాలికల్ని పోషించి, విద్యాబుద్ధులుగరిపి, వృత్తి విద్యలుకూడా నేర్పించి, యుక్తవయస్కులైన ఆడపిల్లలకు వివాహాలు చేయించి, ఆదరిస్తూ వచ్చిన కాకినాడలోని అనాధ శరణాలయం— ప్రభుత్వంవారు మూసేయడం హర్షింపదగ్గ విషయంగా లేదు. కొత్త అనాధ శరణాలయాలు స్థాపించేముందు- ఇలా మూలబడ్డవాటిని పునరుద్ధరించడం ప్రభువులు, దేవస్థానాలు, ప్రజాహితాభిలాషులు, సంఘ సంక్షేమ కృషివేత్తలు అందరి కర్తవ్యమూ ఐయుంది.

॥సం॥

పాఠకులకు చందాదారులకు మనవి

'ఆంధ్రమహిళ' కాపీలు వి. పి. గా పంపించ వలసినదని అనేకులు మాకు వ్రాస్తున్నారు. అదనం కాపీలు అంత హెచ్చుగా ముద్రించని కారణమున అడిగిన వాదందరినీ సంతృప్తిపరచ లేక పోతున్నాం.

దయయుంచి కాపీలు కావలసినవారు, క్రొత్తవార్ని చందాదారుగా చేర్చి సంస్థకు తోడ్పడే వారు ముద్రణకు ముందుగానే తెలియపరుస్తుంటే అందర్నీ సంతృప్తి పర్చగలమని మనవి.

ఆంధ్ర ప్రజానీకం జూపుతున్న ఆదరణకు 'ఆంధ్రమహిళ' కృతజ్ఞురాలు. విరివిగా సేవ జేయగల అవకాశం యిస్తున్నందుకు తన విధిని యధాశక్తి నిర్వర్తింప గలదు.

పిల్లల ఆహారం

పసిపిల్లల ఆహారాన్ని క్రమంగా జేర్చేవి, వారి వారి తత్వాల్నిబట్టి కాలం, పరిమాణం కొంచంగా మార్చుకుంటుండాలి.

ఏ ఆహార పదార్థం	మొదట్లో ఎప్పుడు తినబెట్టొచ్చు	ఎంత
పళ్ళరసం	3-వ వారం	ఒక టీచెమ్చాడు, క్రమక్రమంగా అర చెమ్చాడు హెచ్చిస్తూ 6-వ నెల నాటికి 1-1½ ఔన్సులు చెయ్యొచ్చు.
పళ్ళు : (అరటి, మామిడి, ఆపిల్)	4-6 వారాలు	రోజుకు ¼ ఔన్సు. వారం విడిచి వారానికి ¼ ఔ. చొప్పున హెచ్చించండి.
కాడ్‌లివర్ ఆయిల్ వంటివి	6-8 వారాలు	నారింజరసంతో ఒక చుక్క. క్రమంగా హెచ్చిస్తూ రోజుకు ఒక టేబిల్ చెమ్చాడువరకు తేవచ్చు.
గ్రుడ్డు	3-4 మాసాలు	మెత్తగా వండిన పూర్ణం. క్రమంగా 6 వారాల నాటికి పూర్ణమంతా యివ్వొచ్చు. గ్రుడ్డుసొన కొంచం కొంచం చేరుస్తూ— క్రమంగా 5—6 మాసాలనాటికి గ్రుడ్డు పూర్తిగా యివ్వొచ్చు.
అన్నం వగైరాలు : (జొన్న, గంటి, చోడి, పేలాలు, మెత్తటి అన్నం.)	4-6 మాసాలు	జావలాగవడగట్టి 1-1½ ఔ. క్రమంగా మెత్తగా వండి అన్నం నేర్పండి.
కూరలు : (కేరట్, బంగాళాదుంప, దుంప కూరలు, ఆకు కూరలు, బీట్, బీర, చిరగడం)	4-6 మాసాలు	వండి, మెత్తగా పిసికి ఒక టేబుల్ చెమ్చాడు యివ్వాలి. 6-8 మాసాలనాటికి 1½-2 ఔ.లకు హెచ్చించండి.
పప్పులు	4-6 మాసాలు	బాగా వండి పిసకాలి. 1 టేబుల్ చెమ్చాడు. అన్నంతో గాని వట్టినేగాని పెట్టండి. క్రమంగా పరిమాణం హెచ్చించండి.
మాంసం పులుసు	6 మాసాలు	½ ఔన్సు. 6—10 నెలలకు 2 ఔన్సులకు హెచ్చించండి.
చపాతీలు	6-7 మాసాలు	చిన్న ముక్కలు. క్రమంగా పెద్దవి ఇవ్వండి.
మాంసం (మరలో మెత్తగా తిప్పింది)	9 మాసాలు	ఒక టీచెమ్చాడు. పరిమాణం క్రమంగా జాగ్రత్తగా హెచ్చించండి.

భోజనం దగ్గర - మీ బిడ్డ చూపే దృక్పథం.

15—21 మాసాల వయస్సప్పుడు	"ఇది నాది" అనే స్థితి. తినడాన్ని కెలకడం, పిసకడం చేస్తుంది. పైపై బుజ్జగింపులు వగైరాల్నిబట్టి ఆకలి మారుతుంటుంది. రుచిలో భేదాలు యిస్తే పసిగడుతుంది.

పిల్లల ఆహారం

2-వ ఏట	తిననంటుంది, మారాం చేస్తుంది. కేరట్, బీట్‌రూట్ వంటి రంగు రుచీ ఉన్న తిళ్ళు అంటే యిష్టపడుతుంది.
3-వ ఏట	తీపీ, పులుపూ కావాలంటుంది. కొత్త కూరలు తింటుంది.
4-వ ఏట	తిండి దగ్గర మళ్ళీ మారాం. పూర్తిగా ఎగ్గొట్టడం కూడా చేస్తుంది! ఈ స్వభావం నిల్వదు. ఏమీ శ్రమపడకండి.
5-వ ఏట	సాధారణంగా పెట్టినవన్నీ తింటుంది. కూరలు వగైరాలు కలిపిన అన్నం అంటే యిష్టపడుతుంది.
6-వ ఏట	ఇష్టా ఇష్టాలు చూపిస్తుంది; తిండి దగ్గర తరుచు మొండిపట్లు పడుతుంటుంది.
7-వ ఏట	పెట్టింది తింటుంది. తరుచు త్వరగా త్వరగా తినేసి ఆటకు పరిగెట్టడాన్కి చూస్తుంటుంద. తిండి తినడం అనగానే హడావిడి!

- ప్రతీ బిడ్డనూ ప్రత్యేక వ్యక్తిగా గమనించండి.
- తిండి దగ్గర క్రమరీతిని ప్రవర్తించేటట్లు నేర్పడాన్కి అనువైన కాలంయిది. రకరకాల ఆహారాలు, వంటకాలూ యిప్పుడు నేర్పొచ్చు.

(సోషల్ వెల్ఫేర్ పత్రికనుండి తర్జుమా)

రామాబాయి రనడే

రామాబాయి జీవిత చరిత్ర చదువుతూవుంటే అది ఒక కథలా తోస్తుందేగాని, 'యిది వాస్తవం' అని అనిపించదు. చిన్నతనం నుండీకూడా రామాబాయి అటువంటి పట్టుదలను కనుపరచింది.

సతారా రాష్ట్రంలోని 'దేవరాస్త్రా' పల్లెలో రామాబాయి 1862 వ సంవత్సరంలో పుట్టింది. ఈ రాష్ట్రంలో చాలా మంది రైతాంగానికి చెందినవాళ్ళు. తదితరులంచరూ బ్రాహ్మలు. ఈ బ్రాహ్మలలో ఉత్తమవర్గానికి చెందిన కరులేకర్ వంశంలో పుట్టింది రామాబాయి. రామాబాయి వంశీయులు కొంకణ్ ప్రాంతాలకి చెందినవాళ్ళు. భూస్వాములేకాక పండితులుకూడా మరాఠా సైన్యంలో చేరి కీర్తి ప్రఖ్యాతులని ఆర్జించుకొన్నారు. మరాఠా రాజ్యంలో పీష్వాల పతనంతోపాటే యీ కరులేకర్ల కాంతి కూడా సన్నగిలింది.

రామాబాయి తండ్రి అన్నివిధాలా తన వంశీయుల పేరు నిలిపాడు. తల్లి ప్రఖ్యాత వైద్యుని కూతురు. ఆ చుట్టు పక్కల దొరికే మూలికలతో మందులు తయారు చేసి, బీదసాదలకి సహాయపడేది. తన పిల్లలనీ, యిరుగు పొరుగు పిల్లలనీ చేరతీసి రామాయణ, పురాణగాథలు చెప్తూండేది. 'ఇదంతా ఎందుకొచ్చిన అవస్త' అని ఎవరేనా అడిగితే 'వాళ్ళకి యీ కథలు యిప్పుడు తెలియకపోయినా తరువాత జీవితంలో ఎంత సహాయపడతాయి' అని చెప్పేదట రామాబాయి తల్లి. అంతేకాదు 'యీ కథలు ఎవరికీ ఏహానీ చెయ్యవు. ఏమేనా చేస్తే మంచే చేస్తాయి' అనేదట. అనేక సంవత్సరాల తరువాత, యిలా కథలు విన్న ఒక చిన్న పిల్ల 'నా జీవితంలో ఎన్నెన్నో జరిగాయి. నేనెన్నో మరిచిపోయాను. కాని నా మనః ఫలకంమీద శాశ్వతంగా వున్నాయి అమ్మ చెప్పిన కథలు' అని వ్రాసింది. ఇటువంటి యింటిలో చిన్నతనం అంతా గడిపినా రామాబాయికి ఎవరూ, చదువనూ, వ్రాయనూ నేర్పుదామని తలపెట్టలేదు. రామాబాయి ఒకసారి, తండ్రి తన అన్నయ్యకు రాసిన ఉత్తరం చదువలేకపోయింది. ఆక్షణం నుండీ కూడా రామాబాయికి చదువుకోవాలనీ వ్రాయడం నేర్చుకోవాలనీ బలీయమైన కోరిక ఏర్పడింది. కాని చెప్పేవారు ఎవరూ లేరు. ఆ రోజులలో స్త్రీలకెవరికీ చదువన్నా వ్రాతన్నా యిష్టం తక్కువ. అయినాకూడా రామాబాయి ఎన్నో ఉపయోగకరమైన విషయాలు నేర్చుకొంది. తండ్రి గాంభీర్యాన్నీ ఔన్నత్యాన్నీ తల్లి నవనీత హృదయాన్నీ తనలో జీర్ణింప చేసుకొంది. కౌమారదశలోనే ఉత్తమనారీ లక్షణాలన్నీ అలవరచుకొంది.

రామాబాయికి పన్నెండో సంవత్సరంలో వివాహ ప్రసక్తి వచ్చింది. మహదేవ్ గోవింద్ రనడె దక్షిణాపథాన పేరుగాంచిన వ్యక్తి. రామాబాయికంటె ఇరవైరెండు సంవత్సరాలు పెద్ద. ఇటువంటి వ్యక్తిని వివాహమాడటానికి రామాబాయికి భయమేవేసింది. కాని రనడెకికూడా యీ వివాహం అంత యిష్టంలేదు అని విన్నప్పుడు యింకా భయపడింది. ఎవరికి ఇష్టం లేకున్నా వివాహం మట్టుకు అయిపోయింది: మహాపండితుడయిన రనడెకీ అక్షరజ్ఞానం లేని రామాబాయికీ.

ఇంటికి భార్యను తీసుకువచ్చాక రనడె ఒకటి గమనించాడు: రామాబాయి సూక్ష్మగ్రాహి. ఆనాడే నిశ్చయించాడు: ఆమెకి చదువనూ వ్రాయనూ నేర్పాలని. ప్రతిదినం భార్యాభర్తలు కొన్ని గంటలు గురుశిష్యులయేవారు. ఇది, పురాతన సాంప్రదాయాను వర్తులయిన కుటుంబంలోనివారికి నచ్చలేదు. రామాబాయే దానికి కారణంగా ఆమెని అసహ్యించుకొనేవారు. అయినాకూడా రామాబాయికాని రనడె కాని తాము పట్టిన పట్టు విడువలేదు. యీ దీక్ష ఫలితంగా రామాబాయి చదువనూ వ్రాయనూ నేర్చుకొంది. ఇంటి పనులూ, వంటా సరిగా రాకపోయినా బాధపడని యింట్లోవారికి, ఆమె చదువుకరీటక ప్రాయం అయింది.

శ్రీమతి కె. రామలక్ష్మి

కొద్దిరోజుల శ్రమతో రామాబాయి ఇంగ్లీషు కూడా నేర్చుకొంది. "క్రియా సిద్ధిస్సత్వే మహతాన్నోపకరణే" అన్నది అక్షరాలా నిరూపించింది రామాబాయి. కొన్ని సంవత్సరాల తరువాత తన జీవిత చరిత్రను మరాఠీ భాషలో వ్రాసింది. పుస్తకాలంటే యిష్టంవున్న ప్రతివారూ చదువవలసిన జీవితచరిత్ర అది. ఆమె మంచి వక్తకూడా అయింది. బొంబాయి గవర్నరు ఆధ్వర్యాన జరిగిన ఒక సభలో ఇంగ్లీషులో ప్రసంగిస్తూ ఆడపిల్లలకి ఒక హైస్కూలు స్థాపించాలని ఉద్ఘాటించింది.

కొద్ది సంవత్సరాల తరువాత రనడె నాసిక్‌కి జడ్జిగా వెళ్ళవలసివచ్చింది. భార్యాసమేతంగానే వెళ్ళాడు. పూర్వీకులైన పెద్దలు కూడా లేనందున చాలా రోజులు భార్యాభర్తలు ఆనందంగా వున్నారు. చాలా కాలంవరకూ పిల్లలు కలుగనందున, ఒక అమ్మాయినీ ఒక అబ్బాయినీ పెంచుకున్నారు రనడె దంపతులు. తీరిక సమయంలో తన చుట్టుపక్కలవారిని పరిశీలించడం నేర్చుకొన్న రామాబాయి, అందరూ తనంతసంతోషంగా లేరన్నసంగతి తెలుసుకొంది. అప్పటినుండీ యితర స్త్రీలయెడల ఆమె ఆదరాభిమానాలు ద్విగుణీకృతం అయాయి. భర్తతోపాటు పర్యటిస్తూ ఆమె అనేక విషయాలు తెలుసుకొంది.

జీవితం ప్రశాంతంగా ఎన్నాళ్ళు సాగుతుంది ?.... రనడెకి చాలా జబ్బుచేసింది. ఆ జబ్బునుండి ఆయన తేరుకోడని డాక్టర్లునిర్ధారణ చేశారు. ఆ జబ్బులోనే రనడె 1901 లో స్వర్గస్థుడయాడు. రనడె జీవితంతోపాటే తన జీవితంకూడా ఒక లెఖన ముగిసినట్లుగా భావించింది రామాబాయి. కారణం, ఆమెకి జీవితంలో వెలుగుబాట చూపిన వ్యక్తే రనడె. అతడే లేకుంటే ?—కొన్నాళ్ళపాటు ప్రపంచంతో సంబంధమేలేకుండా ఏకాంతంగా కాలం గడిపింది. ఆమె పెంపుడు కూతురు ఎన్నోవిధాల ప్రయత్నించింది, సాంఘికసేవలో మనశ్శాంతి కలిగిద్దామని. కాని రామాబాయి భర్తృవియోగం తీవ్రాఘాతంగాభావించింది. దానినుండి కోలుకోలేనని తలపోసింది. తన కూతురి ప్రోద్బలంవల్ల - యీరోజుల్లోనే భర్తతోకలిసిన తన జీవితాన్ని పుస్తకరూపంలో రాసింది. "Reminiscences of our life" అన్న యీ మరాఠీ పుస్తకం ఉత్తమ సాహిత్య వర్గానికి చెందుతుందని అంటారు. ఆ తరువాతే రామాబాయికి తోచింది: తన భర్త స్థానాన్ని ఇంకే యితర విషయమైనా పూరింపలేదా ? పండిత రామాబాయి తన కష్టాలను ధైర్యంగా ఎదుర్కోలేదా ? అలాగేతనూ, ధైర్యం తెచ్చుకొని మానవాళికి ఉపయోగించే ఏ కార్యక్రమమేనా ప్రారంభించరాదా ?


హిందూ వితంతువుల దైన్యావస్థ రామాబాయికి తెలుసు. వారికి తనకు చేతనయిన సహాయం చేయ నిశ్చయించింది. అలాగే జైళ్ళలో విషాద పూరిత జీవితాలను గడిపే యువతులసంగతి ఆలోచించింది. వారికీ తనకు చేతనయిన సహాయం చేయ నిశ్చయించింది. రోగార్తులు-వారికి కూడ ధైర్యంచెప్పేవారు అవసరం. కాని యిన్నీ ఒక్కర్తే ఎలాగ చెయ్యగలదు ? స్త్రీలని యీ విషయాలలో తర్ఫీదు చేయడానికి ఒక కేంద్రం స్థాపించింది. అదే "పూనా సేవా సదన్." ఈ సేవాసదన్‌కి బొంబాయి రాష్ట్రంలో అనేక ఉపశాఖలు ఏర్పడ్డాయి. మొదట్లో యీ సేవాసదన్ సమావేశాలు రామాబాయి యింట్లోనే జరిగేవి. కాని త్వరలోనే యీ సంస్థ స్వంత భవనం కొనుక్కో గలిగింది. ఈ సంస్థ సేవికలను తయారుచేయడమే కాకుండా స్త్రీలకు చదువనూ వ్రాయనూ నేర్పేది. జీవితంపట్ల ఆశాభావాన్ని అంకురింప చేయడమే యీ సంస్థ లక్ష్యం. కాలం గడచిన కొద్దీ యీ సంస్థకు అనేకులు సహాయులయారు. ఈ సంస్థ చేసే పనికూడా విస్తరించింది. స్త్రీలకి చదువు సంధ్యలు నేర్పడం, ఆరోగ్య విధులు నేర్పడం, స్థానిక పారిశుద్ధ్యాన్ని నేర్పడం - కాక, గ్రంథాలయాలు స్థాపించి ఉపన్యాసాలు యిప్పించి స్త్రీల విజ్ఞానాభివృద్ధికి అనేక విధాల పాటుపడింది. దేశ భవిష్యత్తులో తాము ఒక స్థానాన్ని ఆక్రమించు కోవాలనే కోరిక దేశస్త్రీలలో యీ సంస్థ నాటకల్గింది. సేవాసదన్‌లో నర్సింగ్,వైద్యసంఘాలు స్థాపించింది రామాబాయి. వీటిలో హిందూ వితంతువులు, కన్యలు చేరి చేయూత నిచ్చారు. వీరిలో మొదటి దళాన్ని రామాబాయి, పూనా ససూన్ ఆసుపత్రికి ట్రైనింగుకై తీసుకొని వెళ్ళింది. ఆదినం మొదలు అనేకులు నర్సింగు అభ్యసించి రోగుల సదుపాయాలు చూడ్డానికి కంకణం కట్టుకున్నారు. తన గృహంలోనే అందరికీ అన్ని సదుపాయాలూ సమకూర్చింది. పిల్లలూ పెద్దలూ అంతా గుమిగూడి తమ అభిరుచులకి ఆకృతి కల్పించుకొనే వారు. పిల్లల కోసం ఆమె అనేక పుస్తకాలు వ్రాసింది.

స్త్రీల హక్కుల పోరాటంలో కూడా రామాబాయి పాత్ర వహించింది. బాలికల విద్యా సౌకర్యాల కోసం, హిందూ వితంతువుల ఉద్ధరణ కోసం ఆమె ఎంతో పాటు

పడింది. పిల్లల ఆరోగ్యం స్త్రీల ఆరోగ్య విషయాలు ఆమె ముఖ్యాతి ముఖ్యంగా ఎంచేది. కారణం, వారే భావి భారత దేశానికి ఆయువు పట్టని ఆమె నమ్మకం. ఆమె, ప్రతి రెండు వారాలకి ఒక కారాగారాన్ని సందర్శించేది. వారిలో ఆశాభావం నశించి పోకుండా వారికి పద్యాలూ, గ్రంథాలూ చదివి వినిపించేది.

ఏప్రిల్ 1922 లో రామాబాయి జబ్బు పడింది. అదే సంవత్సరం అదేనెలలో ఆమె స్వర్గస్తురాలయింది. ఆమె చనిపోయినా ఆమె పేరు శాశ్వతంగా నిలిచి పోయేందుకు సేవాసదన్ వుంది. ఈ రోజు వరకూ, సేవాసదన్ సేవికలకి తర్ఫీదు యిస్తూనే వుంది.

ఒకే ఒక స్త్రీ (అబల!) యింతసేవచేయ కల్గినదంటే లక్షలాది వనితలున్న భారత దేశంలో సేవికలకి కొదువలేదు. రామాబాయి రనడె జీవితం ఒక లక్ష్యంగా పెట్టుకొంటే నిరక్షరాస్యత ఎంతలో తొలగదు? దీక్ష పూనాలేకాని స్త్రీలు సాధించనిదేమిటి? రామాబాయి నేటి వనితాలోకానికి ధృవతార కావాలి. అప్పుడే పీడిత ప్రజానీకానికి ఆశాభావం అంకురింప చేసే వనితా రత్నాలు పైకి వస్తారు. రామాబాయి రనడె కీర్తినికూడా యినుమడింపచేసింది. రామాబాయి భౌతికంగా చనిపోయినా, చేసిన అపారమైన సేవ వల్ల ఆమె కీర్తి శాశ్వతంగా జీవించే వుంటుంది, రామాబాయిరనడె ఒక స్వయంసిద్ధ.



కస్తూరిబా గాంధీ జాతీయ స్మారక ట్రస్టు

సేవాకార్యము, సీతానగరము.

—————:o:—————

శ్రీ కస్తూరిబాగాంధీ 1944 ఫిబ్రవరి 22 వ తేదీన ఆగాఖాన్ భవనములో రాజకీయబందీగా వున్న సమయమున మరణించిరి. ఈమె మహాత్మాగాంధీ అడుగు జాడలలో నడుచుచూ పేదస్త్రీలు, పిల్లలయొక్క యోగ క్షేమములనెల్లప్పుడు కోరుచూ వారి సేవలోనే ప్రాణత్యాగ మొనర్చిరి. గాన మన దేశనాయకులు కస్తూరిబా పేర వివిధ రాష్ట్రములలో ఒక జాతీయ స్మారక నిధిని ప్రోగు చేసిరి. ఆంధ్రరాష్ట్రమునందు శ్రీ బులుసు సాంబమూర్తి, శ్రీమతి దుర్గాబాయిగార్ల కృషి ఫలితముగా ఐదు లక్షల రూప్యములు వసూలైనవి. ప్రప్రథమమున ఈ జాతీయ స్మారక నిధికి పూజ్యబాపూజీ అధ్యక్షులుగావుండిరి.

కస్తూరిబా నిరాడంబరియై ఎల్లప్పుడు పల్లెటూరి జీవితమునే అభిలషించుచూ, అచ్చటి ప్రజల సేవయందు నిమగ్నురాలై యున్నదగుటచే ఈమె పేర నున్న ఈ జాతీయ నిధి పల్లెలలోని స్త్రీ, శిశువుల, ప్రసూతి, పరిశుభ్రత, ఆరోగ్యము, విద్యల కొరకు వుపయోగించవలెనని బాపూజీ నిశ్చయించిరి. వీరు ఈ కార్యక్రమ మంతయు స్త్రీ కార్య కర్తల ద్వారానే జరిపించ దలచిరి. గాన గ్రామాదులందు పని చేయుటకు ఉత్సాహ వతులగు స్త్రీ కార్యకర్తలను తయారు చేయుటకై శిక్షణ కేంద్రములున్నూ, ఈ కార్య కర్తలద్వారా పల్లెలలో గ్రామసేవా కేంద్రములు నడుపుటకున్నూ నిర్ణయించిరి.

ఆంధ్ర దేశమందు నిధి కార్యక్రమ ప్రారంభము:— ఆంధ్ర రాష్ట్రములో గ్రామసేవికా శిక్షణ కేంద్రము ఏర్పరచుటకు 1945 సం॥ రములో ఆంధ్రరాష్ట్ర కస్తూరిబా గాంధీ జాతీయ స్మారకనిధి ప్రతినిధి యగు శ్రీమతి దుర్గాబాయమ్మగారు ఎనమండుగురు మహిళలను సేవాగ్రామములోని హిందూస్థానీ తాలీమీ సంఘమునకు పంపి ఒక సంవత్సరము తరఫీదు ఇప్పించిరి. ఈ మహిళల ద్వారానే ఆంధ్ర దేశమందు ట్రస్టు కార్యక్రమము ప్రారంభమయ్యెను. శ్రీమతి దుర్గాబాయమ్మగారు కాన్‌స్టిట్యూషన్ అస్సెంబ్లీ మెంబరుగా ప్రత్యేక బాధ్యతలు వహించవలసి వచ్చుటచే ట్రస్టునుండి స్వల్ప కాలములోనే విరమించుకొనిరి. తదుపరి శ్రీమతి డి.యస్. విద్యాదేవి B.A., B.L. గారు 1950 జనవరి వరకు ప్రతినిధిగా పనిచేసి వీరుకూడ విరమించిరి. అప్పటినుండి శ్రీమతి దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మగారి యజమాన్యమున ఆంధ్ర దేశమందు ట్రస్టు పని జరుగుచున్నది.

శిక్షణ కేంద్రములు:— ఆంధ్ర దేశమందు ప్రథమమున కస్తూరిబా గ్రామ సేవికా శిక్షణ కేంద్రము ప్రారంభించుటకు తగిన స్థలము నిర్ణయించవలసి వచ్చెను. ఇందుకు తూర్పుగోదావరి జిల్లా సీతానగరమునందు కీర్తిశేషులు, విఖ్యాత పురుషులు యగు డా॥ బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యంగారు స్థాపించిన గౌతమీ సత్యాగ్రహ ఆశ్రమము తోడియుండునని తలచి శ్రీమతి దుర్గాబాయమ్మగారు పూజ్య బాపూజీని కోరగా వారు దీనిని అఖిలభారత చరఖా సంఘం నుండి ట్రస్టుకి ఇప్పించిరి. ఈ ఆశ్రమము 11 ఎకరముల విస్తీర్ణము కలిగి 13 పెంకుటిండ్లున్నూ, మరి కొన్ని పూరి ఇండ్లతోనూ గ్రామ సమీపముగా శిక్షణ కేంద్రమునకు చాల అనుకూలముగా యున్నది. ఇచ్చట 1946 జూన్ 9 వ తేదీన మద్రాసు ప్రభుత్వపు అప్పటి విద్యాశాఖామంత్రి శ్రీ అవినాశలింగంచెట్టియారు గారిచే గ్రామ సేవికా శిక్షణ కేంద్రమున్నూ, పునాది పాఠశాలయున్నూ నెలకొల్పబడినవి. ఇప్పటికి శిక్షణ కేంద్రమునందు 116 మంది గ్రామసేవికలు శిక్షణ బడసిరి. వీరు ఆంధ్ర దేశమందలి వివిధ జిల్లాలనుండియు, హైదరాబాదు కస్తూరిబా ట్రస్టు, మరియు స్త్రీ జనాభ్యుదయ శాఖ తరపు నుండియు కూడ వచ్చిరి. పునాది పాఠశాలకు చుట్టు ప్రక్కల పల్లెల నుండి 450 మంది బాలబాలికలు వచ్చి విద్య నభ్యసించిరి. గ్రామ సేవికలకు శిక్షణ కాలములో ఉచిత భోజన వసతు

లిచ్చి రెండు సంవత్సరములు తరఫీదు ఇవ్వబడును. వీరిలో మంత్రసాని శిక్షణ బడయగోరు వారు ప్రథమమున 6 మాసములు గ్రామ సేవికా శిక్షణ పొంది, తదుపరి రెండు సంవత్సరములు మంత్రసాని శిక్షణ పొందవలెను. శ్రీ బొబ్బిలి మహారాజావారు మంత్రసానులకు వారి ఘోషా ఆసుపత్రిలో శిక్షణ యిచ్చుటకై అవకాశమిచ్చి, విద్యార్థినులుండుటకు తగిన గృహవసతి కూడ ఏర్పరచి యిచ్చుటచే 1946 సంవత్సరాంతమున 8 గురు స్త్రీలను మంత్రసాని శిక్షణకై బొబ్బిలి పంపడమైనది. ఇంతవరకు ఆంధ్ర దేశమందు సేవాశ్రమం (Service Home) లేదు. పేద అసహాయ స్త్రీలకు 8 వ తరగతివరకు విద్యాయోగ్యతయున్నూ, కుట్టు, వడుకు మొదలగు చేతిపనులయందు ప్రత్యేక నిపుణతయున్నూ కలుగజేసి, జీవనాధారము చూపు ఈ సేవాశ్రమం అవసరము ఆంధ్ర దేశమునకు ఎంతైననుకలదు. గాన ఇచ్చట కస్తూరిబా ట్రస్టువారు తమ అధ్వర్యమున సేవాశ్రమం నడుపుటకు పూనుకొనిరి. ఆంధ్ర రాష్ట్ర స్త్రీజనాభ్యుదయశాఖవారు దీనికి అన్నివిధముల తోడ్పడుటకు అంగీకరించిరి. 1954 జూన్ 23 వ తేదీన కేంద్ర సాంఘిక సంక్షేమ అధ్యక్షులు శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్ గారిచే ఈ సేవాశ్రమ ప్రారంభోత్సవము జరిపించడమైనది. దీనికి ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వమువారున్నూ, మరియు కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘమువారున్నూ ఆర్థిక సహాయము చేయ నంగీకరించినందుల కెంతయు సంతసించుచున్నాము. ఇచ్చటి గ్రామ సేవికా శిక్షణలో ఒక భాగమైన ప్రీ బేసిక్ టీచర్సు ట్రైనింగుకి రాష్ట్ర ప్రభుత్వంవారు రికగ్నిషన్ ఇచ్చిరి.

శిక్షణ ఆదర్శములు :— పూజ్యులైన కస్తూరిబాకి గ్రామసేవిక ప్రతిమూర్తియై ఆమె జీవితములోని నిరాడంబరత, నిష్ట, గ్రామజీవనము, మాతృత్వము, శక్తి, సహనము, ఔదార్యము అలవరచుకొనవలెను. సేవిక లక్ష్యములు ఉన్నతముగాను, జీవితమార్గము నిర్మలముగాను వుండవలెను. ఈమె ఆర్థిక, ప్రాపంచిక స్వలాభాపేక్షలు లేక పవిత్రమైన సేవాదృష్టి కలిగియుండవలెను. కుగ్రామములకు కూడ వెళ్ళి అజ్ఞానాంధకారములో మూఢ విశ్వాసములతో కుమిలిపోవు పేద ప్రజలకు మార్గము చూపవలెను. నేటి పల్లెటూళ్ళలో పారిశుద్ధ్యము, ఆరోగ్యము, విద్యాసౌకర్యముల ఆవశ్యకత ఎంతైనను కలదు. గాన గ్రామసేవిక, గ్రామములలో పారిశుద్ధ్యము మొదలు విద్యాబోధవరకు నిపుణురాలై ప్రవేశించవలెను. ఈమె పల్లెటూళ్ళలోని ప్రతి సమస్యను పరిష్కరించవలసియుండును. కాబట్టి ఈమె సేవికగాను, నాయకురాలుగానుకూడ ఎన్నబడుచుండును. పై ఆదర్శముల ననుసరించి శిక్షణ కేంద్రమునందు సేవికలకు తరిఫీదు ఇవ్వడమగును.

సంఘజీవితము :— విద్యార్థినులు సంకుచితక్షేత్రముల నుండియు, వివిధ సంప్రదాయముల నుండియు శిక్షణకు వచ్చుచుందురు. ఇట్టి వారికి జాతి, మత, కుల విచక్షణ లేకుండా శిక్షణ ఇచ్చుటేగాక, సామాజిక జీవితమును, ఐకమత్యమును, జాతీయ భావములను ప్రేరేపింపజేయుట ఈ శిక్షణలోని ముఖ్యాంశములు. సంఘజీవితావసరములగు ఆహార, వ్యవసాయ, ఆర్థిక, పుస్తక భాండాగార, వృత్తివిద్య, వ్యాయామ, ఆరోగ్య, పారిశుద్ధ్య వగైరా వివిధ శాఖలకు బాధ్యతగల మంత్రులను ఏర్పరచి వీరి ద్వారా కేంద్ర కార్యకలాపములు సక్రమముగా జరిపించడమగును. కేంద్రములో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు ఏక కుటుంబముగా కలసి మెలసి వ్యవహరింతురు.

కేంద్రములోని జీవితము — పాఠ్యక్రమము :— ఈ కేంద్రములో శిక్షణ పొందుటకు వచ్చిన విద్యార్థినులు స్వయంపోషక జీవితమును అలవరచుకొనవలసియుండును. ఇందు ముఖ్యముగా వారు సమయమును వ్యర్థపరచక, దానిని సద్వినియోగము చేయుట నేర్చుకొనవలెను. ప్రారంభమున కేంద్ర దైనందిన కార్యకలాపములకు భయపడెదరు. కాని ఇచ్చటి జాతీయ వాతావరణమునకు పూర్తిగా అలవడిన తరువాత పాయిఖానా పనికి కూడా వెనుదీయరు. కేంద్రములోని కార్య కలాపము ఉదయం 4-30 మొదలు రాత్రి 9-30 గంటల వరకు జరుగును. ఈసమయము ప్రత్యక్ష, బౌద్ధిక జ్ఞాన తరగతులకున్నూ, కేంద్రమునందు సామూహిక విధుల నెరవేర్చుటకున్నూ వినియోగించబడును.

శిక్షణ కేంద్రము $10\frac{1}{2}$ మాసములు జరుగును. $1\frac{1}{2}$ మాసము వేసవి శలవులు కాక పండుగలు, ఉత్సవములు మొదలగు విశేష కార్యక్రమములు, ప్రతి శుక్రవారము శలవులు పోను మొత్తము 240 రోజులు పాఠ్యక్రమము జరుగును. ఇందు వివిధ మతములు, గ్రామసమస్యయందు ప్రత్యక్ష, బౌద్ధిక జ్ఞానము, సంస్థ నడుపు విధానము, చరిత్ర, భూగోళము, ప్రపంచపరిచయము, ఆరోగ్య

శాస్త్రము, ప్రథమచికిత్స, రాష్ట్రభాష హిందీ, సామాజిక శాస్త్రము, చితా ఆవర్జా, (అకౌంటెన్సీ) పూర్వబునియాని, పేథ శిక్ష, బాలమనోవిజ్ఞానము, జంతుశాస్త్రము, సంగీతము, వ్యాయామము, సహకార పుద్యమము, వ్యవసాయము, వస్త్రస్వావలంబి శిక్షణ (ప్రత్తిగింజ తీయుట మొదలు నేత వరకు గల క్రియలు) చేతిపనులు (కుట్టు, కత్తిరింపులు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, నవారు, పట్టానేత, మగన్‌పొయ్యి, సబ్బు తయారుచేయుట, తాటియాకు, ఈతాకు, బీరపీచు, చొప్పదంటు, కాగితములతో ఉపయోగకరములగు వివిధవస్తువులు తయారుచేయుట) చిత్రకళ, గలవు.

ఈ విద్యావిధానమునందు పరీక్షలకు ప్రాముఖ్యత ఇవ్వబడదు. అయినప్పటికీ కేంద్ర కార్యకలాపములందున్నూ, వారి సాంఘిక జీవితమునందున్నూ నిత్యము విద్యార్థినుల సామర్థ్యము కనిపెట్టబడుచుండును. శిక్షణానంతరము ట్రస్టు ద్వారా పంపబడిన నిరీక్షకులు విద్యార్థినులు తయారు చేసిన చార్టులు, రిపోర్టులు, దినచర్య. రెండు సంవత్సరముల శిక్షణ కాలములో వారు వ్యక్తిగత జీవితములో కనబరచిన ప్రగతి, లిఖిత, వక్తృత్వ పరీక్షల ద్వారాను, కార్యకర్తల సలహాల ఆధారముతోను వీరి యోగ్యతా యోగ్యతలు నిర్ణయించెదరు.

గ్రామ సంబంధ బాంధవ్యములు :— విద్యార్థినులకు గ్రామానుభవము కొరకున్నూ, గ్రామీణులతో పరిచయాభివృద్ధికిన్నీ విద్యేతర కార్యక్రమములుకూడ ఏర్పరచడమగును. గ్రామ పారిశుద్ధ్యము, బాల బాలికలకు, వయోజనులకు తెలుగు, హిందీ అభ్యాసము, మనోరంజన కార్యక్రమములు, ఇండ్లకు వెళ్ళి వారి కష్ట సుఖములు, ఆరోగ్యము గురించి తెలుసుకొనుట, సమిష్టి భోజనములు, కలరా, మశూచి మొదలగు అంటువ్యాధులు ప్రబలినప్పుడు వాటి నివారణోపాయముల గురించి చెప్పుట, పార్టీ విశేషములు తొలగించుట, ఆపత్సమయములందు గ్రామవాసులకు సహాయము చేయుట, ఉదాహరణకు : ఇండ్లు అంటుకొనినప్పుడు మంటలు ఆర్పుట, ఇండ్లలోని సామానులు భద్రపరచుట, వారికి వంట భోజన సదుపాయములు చేయుట, అవసరమైన ప్రథమ చికిత్స చేయుట. ఇటులనే గోదావరీ వరద భీభత్సమునకు గ్రామము గురి కాకుండ స్వయముగా శరీరశ్రమ చేసి అనగా మట్టిమోసి గోదావరీ గట్టును గండ్లు పడకుండ కాపాడుట, వరదబాధితులకు ఆశ్రయమిచ్చి రక్షించుట వగైరా కార్యక్రమములద్వారా గ్రామీణుల కష్టములు తొలగించి వారిలో విద్యా విజ్ఞానాభివృద్ధులు కలుగజేయుటకై కృషి సల్పడమగుచున్నది.

జాతీయ ఉత్సవములు, పండుగలు, శిక్షణ విహారములు.

కేంద్రములో పండుగలు, పర్వదినములు, జాతీయ ఉత్సవములకు హెచ్చు ప్రాముఖ్యత ఇవ్వబడును. ఆయా సందర్భములలో ప్రాతఃకాల నగరసంకీర్తనము, పతాకవందనము, అఖండ సూత్ర యజ్ఞము, వినోద కార్యక్రమములు, బహిరంగ సభలు, గ్రామ పారిశుద్ధ్యము, సామూహిక ప్రార్థనలు వగైరా జరుపబడుచున్నవి. మృత వీరుల జాతీయస్మారక దినములు, స్వాతంత్ర్యదినము, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినము, రిపబ్లిక్‌డే, గాంధీ వర్ధంతి మొదలు, కస్తూరిబా వర్ధంతి వరకు సామూహిక సూత్రయజ్ఞము, వారి జీవితచరిత్ర పఠనము, బహిరంగ సభలు జరుపబడుచున్నవి. కస్తూరిబా వర్ధంతికి కేంద్ర వాసులందరు నూలు సమర్పించగా దానితో బట్టనేయించి బీదవిద్యార్థినులకు ఇవ్వడమగుచున్నది. పై కార్యక్రమములందు గ్రామవాసులందరు పాల్గొందురు.

శిక్షణ విహారములకై విద్యార్థినులను గ్రామసంప్రదాయ, దేశచరిత్ర, సంస్కృతి, కళ, విద్యలకు ప్రాముఖ్యత చెందిన స్థలములకు తీసుకొని వెళ్ళడమగును. తద్వారా విద్యార్థినులకు ప్రత్యక్షానుభవము పొందుటకు సదవకాశము లభించుచున్నది.

గ్రామసేవ, ఆరోగ్యకేంద్రములు :— సీతానగరమునందు తరిఫీదు పొందిన సేవికలద్వారా ఆంధ్రదేశమందలి వివిధ జిల్లాలలోని గ్రామములందు గ్రామసేవ, ఆరోగ్య కేంద్రములు ప్రారంభించి గ్రామాభివృద్ధి కార్యక్రమములు జరిపించడమగుచున్నది. వేరు వేరు జిల్లాలలో మొత్తము 25 గ్రామసేవ, ఆరోగ్యకేంద్రములున్నూ, ఒక శిశుశరణాలయమున్నూ ప్రారంభించబడినవి. పూజ్య బాపూజీ ఆదేశించిన నిర్మాణ కార్యక్రమమును గ్రామములందు అమలు జరుపుటయే గ్రామసేవా కేంద్రముల ముఖ్యోద్దేశము. గాన దీని ననుసరించి కేంద్రములందు పని జరుగు

చున్నది. నేటి పిల్లలే భావిభారత పౌరులుగా తయారు కావలసి యున్నందునను, చాల కాలమునుండి ఎన్నో దురాచారములకు లోనైన వయోజనులయందునూ తన జీవితమును ప్రవేశపెట్టవలసి యున్నందునను గ్రామసేవా కేంద్రములందు బాల్వాడీ, బేసిక్, వయోజన విద్యాతర గతులకు ముఖ్యస్థానమివ్వబడెను. కేంద్రములందు విద్య, విజ్ఞాన, ఆరోగ్య, స్వయంపోషకములకు సంబంధించిన విషయములు బోధించుటమాత్రమేగాక గ్రామసేవికలు జాతి మత కుల వర్గ విచక్షణగాని, పార్టీ విభేదములుగాని లేక సేవాకార్యములద్వారా గ్రామస్థులను ఆకర్షించుకొనె వీరు గ్రామస్థులతోబాటు కష్టసుఖములను అనుభవించుచూ కలసి మెలసి యుండుటచే కొంతకాలమునకు వీరి యెడల గ్రామస్థులకు భక్తి విశ్వాసములు కలుగుచున్నవి. అందువలన గ్రామాభివృద్ధి కార్యక్రమములు జరిపించుటకు హెచ్చు అవకాశము లభించుచున్నది. రాయలసీమ యందలి కడప, చిత్తూరు జిల్లాలలో వర్షాభావముచే పంటలు లేక కరువు కాటకములు ప్రబలినప్పుడు అచ్చట పనిచేయుచున్న గ్రామ సేవికలు ఈ కరువు బాధకు గురియైకూడ ఆకలి దప్పులచే అలమటించు పేదల ప్రాణములు రక్షించుటకై అమోఘమైన సేవచేసి ప్రభుత్వము, రామకృష్ణమిషన్ వారల మన్ననలను పొందిరి.

సీతానగరమందు 19 జనవరిలో శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు గారిచే ప్రసూతి వైద్యశాల ప్రారంభోత్సవము జరిపించడమైనది. ఇందు M B., B.S., డాక్టరు కడు సేవాభావముతో పనిచేయుచున్నారు, ఈ వైద్యశాల ద్వారా సీతానగరము చుట్టు ప్రక్కల సుమారు 20 గ్రామములలో 22 వేల మంది ప్రజలు వైద్యసహాయము పొందుచున్నారు. వీరిచ్చట ఆరోగ్య విధులు, అంటువ్యాధుల నిరోధ నివారణోపాయములు వగైరా తెలుసుకొనుచు తమ తమ ఆరోగ్యములను జాగ్రత్తగా కాపాడుకొనుట నేర్చుకొనుచున్నారు. ఇది కేవలము ప్రసూతి వైద్యశాలయే అయినప్పటికీ చుట్టు ప్రక్కల ఇతర వైద్య సౌకర్యము లేనందున ఒక్క ప్రసూతి కేసులేగాక స్త్రీలకు అన్నివిధములగు రోగములకు చికిత్స చేయడమగుచున్నది. ఇంతియేగాక అత్యవసర ప్రమాద పరిస్థితులు యేర్పడినప్పుడు పురుషులకుగూడ వైద్య శాలలలోనే (In patients) వుంచి చికిత్స చేయవలసివచ్చుచున్నది. ప్రభుత్వమువారిచ్చిన పాలపొడితో పాలు తయారుచేసి ప్రతి దినము సుమారు 300 మంది బీద పిల్లలకు, గర్భిణి, బాలింత స్త్రీలకు, అనారోగ్యులకు పంచడమగు చున్నది. ఆంధ్ర దేశమందలి వివిధ జిల్లాలలో బొబ్బిలి, సీతానగరమందు మంత్రసాని శిక్షణ బడసినవారిద్వారా ఆరోగ్య కేంద్రములు నడపబడుచున్నవి. ఈ కేంద్రముల వలన మరణముల సంఖ్య తగ్గి గ్రామారోగ్యములు బాగుపడుచున్నవని తెలుపుటకెంతయు సంతసించుచున్నాము.

<u>పునఃశిక్షణ శిబిరములు</u> :— ఆంధ్రదేశ మందలి కస్తూరిబా కేంద్రములలో పనిచేయుచున్న సేవికలు వారి గ్రామ సమస్యలు, కష్టసుఖములు చర్చించుటకున్నూ, తగిన సలహాలు పొందుటకున్నూ ఈ శిబిరములు ప్రతి సంవత్సరము ఏర్పరచబడినవి. పలు ప్రముఖులు విచ్చేసి కార్యకర్తలు చేయు పనికిన్నీ, వారి విజ్ఞానాభివృద్ధికిన్నీ తోడ్పడు వేరు వేరు విషయములపై ఉపన్యాసములిచ్చుచుందురు. గాన ఈశిబిరములు గ్రామాభివృద్ధి కార్యక్రమములు జరుపుటయందు సేవికలకు చాల సహాయకరముగా నుండును.

<u>ప్రేక్షకుల ఆగమనము</u> :— దేశములోని అనేకమంది ప్రముఖులు, నాయకులు, నిర్మాణ కార్యకర్తలు సీతానగరం విచ్చేసిరి. వీరిలో శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారు, శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య, శ్రీ జయప్రకాశ నారాయణ్ దంపతులు, శ్రీ పైడా వెంకటనారాయణ M.L.A మద్రాసు, ఆంధ్రరాష్ట్రముల మంత్రులగు శ్రీ మాధవ మీనన్ దంపతులు, శ్రీ గురుపాదం, శ్రీ భక్తవత్సలం, శ్రీ అవినాశలింగం చెట్టియార్, శ్రీ చంద్రమౌళి, శ్రీబి.పి. పట్టాభిరామారావు, శ్రీ ఎమ్. వి. కృష్ణారావు, శ్రీ తిమ్మారెడ్డిగార్లు, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్లు, ఆరోగ్య, విద్యా శాఖాధికార్లు, భారత దేశమందలి వివిధ రాష్ట్రములనుండి అఖిలభారత చరఖాసంఘాధ్యక్షులు శ్రీ కృష్ణదాసు జాజూజీ, ధీరేంద్రమజుందారు, కస్తూరిబా ట్రస్టు కేంద్ర కార్యదర్శి శ్రీ శ్యామలాల్ జీ, మంత్రి శ్రీమతి సుశీలాపైజీ, శ్రీమతి సుచేతాకృపలాని, సేవాగ్రాం హిందూస్థాన్ తాలీమీసంఘం కార్యదర్శినులు శ్రీ ఆర్యనాయకం, ఆశాదేవిగార్లు, శ్రీ భన్సాలీ, కస్తూర్బా ట్రస్టు వైద్యకీయ సలహాసంఘం సభ్యులు డా॥ వర్దేకర్ జీ, శ్రీమతి డా॥ సౌంద్రం రామచంద్రన్, కేంద్ర ఆర్థిక శాఖామాత్యులు శ్రీ సి.డి. దేశ్‌ముఖ్

సేవాకార్యము, సీతానగరము

కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘాధ్యక్షురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ గార్లున్నూ మరియు తదితర ప్రముఖులు అనేకమంది సీతానగరం విచ్చేసి పలువిధములుగా ప్రోత్సహించిరి.

ఆర్థికస్థితి :— భారత దేశమున వివిధ రాష్ట్రములలో వసూలైన సొమ్ము ఆరాష్ట్రములలోనే వాడబడును. రాష్ట్రములో ఏఏ జిల్లాలలో ఎంత వసూలైనదో ఆ వసూలైన మొత్తములో మూడు వంతులు ఆయా జిల్లాలలోనే ఖర్చుచేయడమగును. నాలుగవవంతు రాష్ట్రమంతటికి సంబంధించిన కేంద్రములకై వినియోగింపబడును. ఆంధ్ర రాష్ట్రమందలి వివిధ జిల్లాలలోని గ్రామసేవ, ఆరోగ్య కేంద్రములకై ఒక్కొక్క కేంద్రపు ఖర్చులో నూటికి 15 నుండి 50 శాతము వరకు స్థానిక చందాలు వసూలు చేయవలసియున్నది. కస్తూరిబాట్రస్టుద్వారా నడుపబడుచున్న ఈ కేంద్రములు గ్రామములందలి బీద అసహాయ ప్రజానీకమునకు మిక్కిలి సహాయకరముగా యుంటున్నవి. కాని వీరినుండి కేంద్రములకు వలయు ఆర్థిక సహాయము లభింపజాలకున్నది. గాన గ్రామపురోభివృద్ధికై తగినన్ని కేంద్రములు నడుపుటకు వలయు ఆర్థిక సహాయము ప్రభుత్వము, మరియు స్థానిక సంస్థలనుండియు ఆశించడమగుచున్నది.

సహాయకులు, సలహాదారులు :— సీతానగరమునందలి గ్రామసేవికా శిక్షణకేంద్రము, ప్రసూతివైద్యకీయకేంద్రము, ఆయా జిల్లాలయందలి గ్రామసేవ, ఆరోగ్య కేంద్రములు దేశములో అనేకమంది ఆదరాభిమానములకు పాత్రమైనవి. అఖిల భారత చరఖాసంఘంవారు సీతానగరమునందలి శిక్షణ, వైద్యకీయ కేంద్రములకు వసతి సౌకర్యములు కలుగజేసి, వ్యవసాయమునకు పొలము కూడ యిచ్చిరి. రాజమండ్రి కలప వర్తక సంఘంవారు శిక్షణ కేంద్రమునకు సింగరు మిషను యిచ్చిరి. రాజమండ్రి కాపరస్తులు ముడుంబి భానుమతి, భాస్కరమ్మలు, శ్రీమతి దామెర్ల శకుంతలగారును నృత్య ప్రదర్శనము జరిపి ధనసహాయముచేసిరి. తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు రేడియో వగైరా పరికరములకు రు 1500/- లు విరాళముగా ఇచ్చిరి. ఇది గాక శిక్షణ కేంద్రపు ఇంటి మరమ్మత్తులు, నీటికి వసతికి ధనసహాయము చేసిరి. శ్రీ స్థానం నరిసింహారావుగారు తమ సోదరి సత్యాదేవి స్మారక చిహ్నముగా ఒక వీణ, గ్రంథాలయమునకు 300 పుస్తకములు ఇచ్చిరి. శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మగారు గ్రంథాలయమునకు 100 పుస్తకములు ఇచ్చిరి. ఆంధ్ర రాష్ట్రమునందలి వివిధ స్థానిక సంస్థలవారు కేంద్రములకు ఆర్థిక సహాయము చేయుచున్నారు. గోదావరి భీభత్స సందర్భమున ప్రభుత్వము, రామకృష్ణమిషన్‌వారు సీతానగరమునందలి వైద్యకీయకేంద్రమునకు మందులు, పాలపొడి, వస్త్రములు వగైరాలిచ్చి వరద బాధితులకు సహాయము చేయుటయందు తోడ్పడిరి. కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘమువారున్నూ మరియు రాష్ట్ర ప్రభుత్వమువారున్నూ ఆంధ్ర కస్తూరిబా ట్రస్టుకి ఆర్థిక సహాయము చేయుచూ చేయూతనిచ్చి ప్రోత్సహించుచున్నందులకు మిక్కిలి సంతసించుచున్నాము.



విజ్ఞానపు వేయిపడగలు

"ఏకంసత్ - విప్రా బహుదా వదంతి"

శ్రీ మద్దూరి శ్రీరామకృష్ణ

సత్యం ఒక్కటే - పల్వురు పలువిధాల చెపుతారు.

సృష్టి పరిణామంలో మానవునికి కొంతవివేకం కలిగి నప్పటినుండీ కూడ, అనంతంగా తోచేది, అనంతకోటి నామరూపబేధాలతో గూడిందిగా కవబడే బాహ్య ప్రకృతిని పరిశీలించి, దాని యదార్థత్వాన్ని అవగాహన చేసుకోవాలన్న జిజ్ఞాస కలుగుతూనేవుంది.

అన్వేషణ :—ఈ జిజ్ఞాస - విజ్ఞానదృష్టి మానవసహజం. ఇవే ఇంతవరకు మనిషి సేకరించిపెట్టిన విజ్ఞానానికి మూల కారణం. విజ్ఞానమంటే మన పంచేంద్రియాల ద్వారా ఎరుగ నయ్యే విషయసంచకమని పాశ్చాత్తులనుకున్నారు. కాని, మన ప్రాచ్యుల దృక్పథం అంతకంటె సమగ్రమైంది. భౌతికం - భౌతికేతరంకూడ అవగాహన చేసుకొని, అసలు వస్తువుని గ్రహించగలిగిందే నిజమైన విజ్ఞానం; దేన్ని తెలుసుకోవడం వల్ల సర్వాన్నీ తెలుసుకోవడం అవుతుంతో అదే 'విజ్ఞానం' అన్నారు- మనవారు; "కస్మిన్ను భగవో విజ్ఞాతే సర్వ మిదం విజ్ఞాతం భవతి". ద్వందం - బహూత్వం ఎందుకు చూస్తావు, భిన్నత్వంలో ఏకత్వం గ్రహించు; అంతా ఒక టేసుమా, "ఏకమేవా - ద్వితీయం" అని సూచించేరు. కాని, భౌతిక శాస్త్రజ్ఞునికీ, సాధారణదృష్టికీ ఎటుజూచినా భిన్నత్వంలాగు తోస్తుంది; అన్వేషణ ప్రారంభించేరు. మనిషి - మన్ను, చెట్టు - పుట్ట, రాయి - రప్ప, ఇనుం - బంగారం, నీరు - గాలి, సూర్యుడు - చంద్రుడు, ఆకాశం- నక్షత్రాలు, ఇలా విభిన్నమైనవాటిని చూచి చూచి, విశ్వం అంటే ప్రదేశం (Space) అందులోనున్న ద్రవ్యం (Matter) అని వర్గీకరించుకున్నారు. విశ్వమంటే ఏమిటో తెలుసుకోవాలంటే ఈరెంటినిగురించే ఆరాతీయాలను కున్నారు. శాస్త్రపరిశోధన ప్రారంభమైంది. అంతలో కాలం (Time) అనేది మరొకటి ఉందిరోయ్, మొత్తం మూడు అన్నారు. వీటి సంగతి తేలుద్దాం పట్టండి అన్నారు. అనేక పరిశోధనలు, ప్రయోగాలు గావించేరు; చుట్టు త్రోవలు త్రొక్కి త్రొక్కి ఎంతో వెదుకులాడేరు. ఆఖరుకు 'ఏది చూచినా అయోమాయ్ గారడీ లాగుందే!' నన్నకాడికి వచ్చేరు. ఇక దిక్కులు చూడ్డం మొదలెట్టేరు.

ప్రవేశం :- (Space) అంటే అకాశం (అవకాశం- ఏమీలేనిది), దీన్ని తెలుసుకోవడం ఎట్లాగ! ఎటు జూచినా ప్రదేశం- ప్రదేశం- అనంతగాతోచే ప్రదేశమహార్ణవం. ఈ ప్రదేశమహార్ణవంలో భూగోళం- సూర్య- చంద్ర- నక్షత్రగోళాలు- నెబ్యులాలు- గెలాక్సీలు- మహా సముద్రంలో చిరు తెప్పల్లాగ అక్కడక్కడ అపురూపంగా, ఆవగింజల్లాగైనా లేవు!

"ఏకంసత్ - విప్రా బహుదా వదంతి"

కాలం :- (Time) పోనీ కాలం సంగతి చూద్దాం అంటే ఇది పైదాన్ని మించింది! కాలాన్ని అవగాహన చేసుకోవాలని భూతం- వర్తమానం- భవిష్యత్తు అని విభాగించి చూడబోతే, సినిమా ప్రాజెక్టర్‌లో ఫిల్ములాగ పరుగిడి పోతుందాయిరి! భవిష్యత్తు అనుకున్నది అంతలోనే వర్తమానమై, అది అంతట్లో భూతమై, బుద్ధికి అందకుండా మరో పూర్ణాను స్వారంలాగుంది. ఈ రెంటినీ అలా ఉంచండిరా, మన పంచేంద్రియాలకు అందేది, పదార్థం (Matter) ఉంది, దీని తాళం పడదాం పట్టండి అని ఉపక్రమించారు.

పదార్థం :- (Matter) దీన్ని గురించి శాస్త్రజ్ఞులు తేల్చిన పరిశోధనలు ఇలా ఉన్నాయి: పదార్థం అంటే కొంత ప్రదేశాన్ని ఆక్రమించేది అన్నారు. ఇది వాయు-ద్రవ-ఘన రూపాల్లో ఉంటుంది. ఉదాహరణ: గాలి, నీరు, ఉప్పు, బంగారం, పంచదార. ఇలా ప్రపంచంలో ప్రతీ పదార్థాన్నీ పరిశీలించగా, పరిశీలించగా, అన్నీ మొత్తంమీద 93 రకాల ధాతువులు (Elements) అనే మూల పదార్థాలవల్ల నిర్మింపబడ్డాయి అన్నారు- సున్నం ఇటుకవగైరాలవల్ల అనేక రకాల యిళ్ళు రూపం దాల్చినట్లు. ఉదాహరణ: బంగారం ఒక ధాతువు, భాస్వరం మరో ధాతువు. నీరు అంటే ప్రాణవాయువు- ఉదజని అనే రెండుగాలుల సంయోగ వస్తువు. ఉప్పుఅంటే క్లోరిన్ అనే విషగాలి, సోడియం అనే ధాతువు కలిసి యేర్పడింది. పంచదార అంటే బొగ్గు- ప్రాణవాయువు- ఉదజనుల యౌగికం (Compound) ఇలాగ ధాతువులు ఒకటి- రెండు- మూడు ఇంకా ఎక్కువగాను, వేరు వేరు పరిమాణాల్లో, వేరువేరు విధాలుగా సంయోగం చెంది, అనంతకోటి పదార్థాల రూపేణా ప్రత్యక్షమౌతున్నాయి. మన భూమి, భూమిమీద వస్తువులేగాదు, సూర్య చంద్రాది గోళాలూ ఇంతేనన్నారు.

[సశేషం]

సంక్షేమ కేంద్రాలు

(8-వ పేజీ తరువాయి)

వేశంలో పాల్గొన్నారు, అధ్యక్షులు శ్రీ పి. చిన్నమరెడ్డిగారు ప్రసంగిస్తూ యీ ఆస్పత్రివల్ల ఎంతో ప్రయోజనం ఉన్నదని, ప్రజలు యీ ఆస్పత్రికి ధన సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆస్పత్రికి ఒక కమిటీని ఎన్నుకొన్నారు. కాళహస్తి తాలూకా కోవనూరులో ఒక ప్రసూతి చికిత్సాలయానికి డా॥ వి. వి. చలంగారు ప్రారంభోత్సవం జరిపారు. ఆ సందర్భంలో జరిగిన డి. వి. రాఘవ రెడ్డిగారు అధ్యక్షత వహించారు. ప్రసూతి చికిత్స కేంద్రాల అవసరాన్ని చలంగారు వివరించారు. రాఘవరెడ్డిగారు చికిత్సకేంద్రం అభివృద్ధికి యీ ఫిర్కా ప్రజలు కృషి చెయ్యాలన్నారు. ప్రసూతి సమయంలో స్త్రీలు అనుసరించదగ్గ జాగ్రత్తలను శ్రీమతి మరియమ్మగారు వివరించారు. ఈ కేంద్రానికి కోవనూరు గ్రామ పంచాయితీ బోర్డు 200 రూ॥లు, కంతనపల్లి గ్రామ పంచాయితీ 100 రూ॥లు, అంజారుగ్రామ పంచాయితీ 100 రూ॥లు, తిమ్మసముద్రం గ్రామ పంచాయితీ 50రూ॥లు విరాళాలివ్వడానికి వాగ్దానం చేసేరు. అద్దూరు వెంకురెడ్డిగారు సభికులకు విందుచేశారు. రామకృష్ణారెడ్డిగారు కృతజ్ఞతాభివందనాలతో సభ ముగిసింది.

కడపజిలా : ఈ జిల్లా సంక్షేమ కార్యక్రమాల సంఘంవారు వల్లూరు గ్రామంలో ఒక సంఘ సంక్షేమ కేంద్రం ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలు ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. సంఘంవారికి తోడ్పడ్డానికి ఒప్పుకొన్నారు, సభ జయప్రదంగా జరిగింది.

అనంతపురం జిల్లా : (రిపోర్టు మాకు చేరలేదు)

కర్నూలు జిల్లా : డిటో

ఈమాదిరి ప్రాజెక్టులు దేశం మొత్తంమీద యిదే రోజున 78 ప్రారంభింపబడతాయని ఇవి 1,560 గ్రామాలకు సేవగావిస్తాయని, వీటిల్లో 2,160 గ్రామసేవికలు కృషిచేస్తారని కేంద్ర సంఘ సంక్షేమ బోర్డు చేర్మన్ శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్‌గారు ఢిల్లీలో పత్రికావిలేఖరులతో ప్రసంగిస్తూ అగస్టు 12 వ తేదిని తెలియపర్చేరు.

ఈ ప్రాజెక్టులు ఎలానడిచేదీ ఇదివరకే విశదీకరించేరు. ఈ వివరాలు ఆంధ్రమహిళ జూలై- ఆగష్టు పత్రికల్లో ప్రకటించేము.

గాంధీజీ సుభాషితాలు

నూతన సాంఘిక పద్ధతి :—దేశంలోని మానవులందరూ సమాన అంతస్థులో వుండేటట్లు చేయాలని నేను కోరుతున్నాను. శతాబ్దాలుగా వృత్తులు చేసేవాళ్ళు దూరంగా వుంచబడి తక్కువవారిగా చూడబడుతున్నారు. వాళ్ళను 'శూద్రులు' అంటే తక్కువజాతివారు, అని పిలుస్తున్నారు. ఇప్పుడు నేను సాలి బిడ్డకూ, రైతు బిడ్డకూ, బడిపంతుల బిడ్డకూ ఏమీ వ్యత్యాసం లేకుండా చేయాలని అనుకుంటున్నాను.

ఏ నూతన సాంఘిక పద్ధతికూడా నిర్బంధంగా ప్రవేశపెట్ట కూడదు. అలాచేస్తే వ్యాధికంటే పథ్యం కఠినమైనట్లుంటుంది. సంఘ సంస్కరణలో నాకు ఓపిక తక్కువ. మనదేశ సాంఘిక వ్యవస్థలో పూర్తిగా మార్పు తేవాలని కోరుతున్నాను. కాని ఇది క్రమంగా రావాలిగాని ఒక్కసారిగా పైనుంచి బలవంతంగా పెట్టినట్లుండరాదు.

* * *

స్త్రీలు :— స్త్రీలను అబలలనడం చాల అన్యాయం. అది పురుషుడు స్త్రీకి చేసిన ప్రథమ అన్యాయం. బలంలో అయినట్లయితే పురుషుల బలం పశుబలం కాబట్టి స్త్రీలో యిది తక్కువనే ఒప్పుకోవాలి. కాని- మానసిక శక్తిలో చెప్పవలసివస్తే, పురుషునికంటె వెయ్యి రెట్లు, స్త్రీయే గొప్పది. స్త్రీలో పురుషునికంటె ఎక్కువ సహజమైన తెలివి, త్యాగబుద్ధి, ఓర్పు, ధైర్యం కలవని ఒప్పుకోవాలి. అన్నెందుకు ? స్త్రీలేందే పురుషుడు లేనేలేడు.

ప్రసవవేదనకు మించిన బాధవుందా ? కాని తాను సృష్టించిన బిడ్డను చూచి ఆమె ఆబాధనంతా మరచిపోతుంది. తర్వాత ఆ బిడ్డ దినదినాభి వృద్ధి పొందాలని ఆమె పడే అగచాట్లు ఎవరు పడతారు ? ఆ ప్రేమ ఇప్పుడామె సంఘాభ్యుదయానికి వినియోగించాలి. తాను పురుషుని, విలాసవస్తువు అన్న సంగతి మర్చిపోవాలి. అప్పుడామె మాతృదేవిగా, ఆదర్శవనితగా, పురుషుని ప్రక్క సమాన స్థాయిలో నిల్వగలదు. యుద్ధోన్మత్తతలో మునిగియున్న పురుషులకు స్త్రీలే శాంతి పాఠం నేర్పాలి.

* * *

మాతృత్వమూ - కర్తవ్యమూ : - మాతృదేవిగా మన బాలికలు నెరవేర్చ వలసిన విధులను వారికి ముందుగా నేర్పక పోవడం బహుశోచనీయం. గృహిణీత్వం ఒక పవిత్రధర్మం అనుకున్నప్పుడు మాతృత్వం కూడా అంతే. ఆదర్శమాతగా చరించడం సాధారణ కార్యంగాదు. ఇందుకు వలసిన విజ్ఞానం వున్నప్పుడే బిడ్డల్ని కనాలి. గర్భధారణ సమయంనుండి బిడ్డపుట్టేవరకు తన కర్తవ్యం ఏమిటో పూర్తిగా తెలిసియుండాలి. ఎవరైతే ఆరోగ్యవంతులు, తెలివైనవారు చక్కటి తర్ఫీదు పొందినవారు ఐన బిడ్డల్ని దేశానికి వప్పజెప్పుతారో, వారు గొప్పదేశసేవ చేసినట్లే.

* * *

విధవావివాహం : - వితంతు వివాహంలో తప్పేమీలేదు. అది తప్పు అన్నట్లయితే భార్య మరణించినప్పుడు భర్త పెండ్లి చేసుకోవడం కూడా అంతే అనాలి.

* * *

బిడ్డల శిక్షణ : - బిడ్డలకు చక్కటి తర్ఫీదు ఇవ్వడానికి తల్లిదండ్రులకు విస్తారమైన ప్రపంచజ్ఞానం వుండాలని నాకు బాగా నమ్మిక కుదిరింది. సామాన్యంగా మనం ఏమను కుంటామంటే, బిడ్డలు ఐదు ఏళ్ళ లోపుగా ఏమీ నేర్చుకోరని. కాని, నిజానికి, బిడ్డలు ఐదేళ్ళు దాటిన తర్వాత నేర్చుకొనేది చాల తక్కువనే చెప్పాలి.

ఆదర్శ గృహానికి మించిన పాఠశాలలేదు. సత్యవంతులూ, ఆదర్శ ప్రాయులూనైన తల్లిదండ్రులకు మించిన గురువూలేడు.

అపూర్వ భారతం, అపూర్వ కవి!

(హాస్యనాటిక - ఏకాంకిక)

(" 'బొల్లి బొల్లరా మల్లన్నా అంటే, గోల్కొండ రత్నాలు గొప్ప తాటికాయలంతేసి!' అన్నట్లుంటాయి యీ తెనాలి రామలింగని బొల్లులు - నమ్మకండి" అని భట్టుమూర్తి, రాయల సభలో, ఆక్షేపిస్తే "రాయలవారూ, అష్టదిగ్గజాలూ అనుజ్ఞయిస్తే అతనికంటె గొప్ప బొల్లి బొల్లుతా!!" నన్నాడట తెనాలి రామకృష్ణుడు! ఆ తమాషా చూదామని అంతా అంగీకరిస్తే, రాయల ఆస్థానంలో అందరి యెదుట, మర్నాడు, ఈ నాటకం ప్రదర్శించేడట రామలింగకవి. సహృదయులు కూడ ఈ 'అపూర్వ భారతా'న్ని అల్లే గ్రైకొందురుగాక అని ఈ నాటకం ఉపక్రమిస్తున్నాం.)

———:o:———

1 వ రంగం

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానం.

శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజాలైన కవులు, అల్లసాని పెద్దన, ముక్కుతిమ్మన, భట్టుమూర్తి, తెనాలి రామకృష్ణుడు వగైరాలు సభాసదులు ఉంటారు.

శ్రీకృ.దే : పెద్దనగారి మనుచరిత్రలోని "పాటున కింతులోర్తురె" అన్న పద్యం, తిమ్మనగారి పారిజాతాపహరణంలోని "ఈసునఁబుట్టి డెందమున" అన్న పద్యం, భట్టుమూర్తికవి వసుచరిత్ర యందలి "ఆజాబిల్లి వెలుంగు వెల్లికల" అన్న పద్యం ఈ మూడూ తుల్య సందర్భం గలిగి అతి మనోహరమైన పద్యాలు. సభాసదులు వీటిని విమర్శింప విన ముచ్చటగుచున్నది.

తె.రా : విమర్శించుట కేమున్నది? అల్లసాని పెద్దన అటు నిటు నేడ్చెను, ముక్కు తిమ్మన ముద్దుగా నేడ్చెను, భట్టుమూర్తి బావురుమని యేడ్చెను!

(ఈ రామలింగకవి ఎప్పుడూ ఇంతేనని సభాసదుల కరతాళధ్వనులు)

భట్టు : అష్ట దిగ్గజములన బరగు మహాకవులనిట్లు బరిహసించి తానే మహా కవిపుంగవుడనుకొనుచున్నాడు యీ రామలింగన్న. ఏదీ- నేనిచ్చు యీ సమస్య పూరించమనుడు — చూతము : "కుంజరయూధంబు దోమ కుత్తుక సొచ్చెన్"

తె.రా : "గంజాయిత్రాగి తురకల సంజాతులఁగూడి కల్లు
చవిగొన్నావా?
లంజెల కొడుకా! యెక్కడ- కుంజరయూధంబు
దోమ కుత్తుక సొచ్చెన్?"

భట్టు : శ్రీరాయలవారు, పెద్దలు గమనించెదరుగాక, నిండు పేరోలగమున యీతని ప్రేలుడు కారుకూతలు!

శ్రీ.కృ.దే : రామలింగకవి వాచాలతకు రాయల కోపమున కాతడు గురి యగుచున్నాడు. మేమిట్టి పరుష వాక్యములు పూర్తిగా గర్హించుచున్నాము. అతడు సభ విడిచి పోనైన పోవలెను, లేదా క్షమాపణ కోరవలెను.

తె.రా : ప్రభువులు క్షమించెదరుగాక! లేకున్న యీ వెర్రి భట్టా, మహాకవులకు సమస్య లొసగువాడు!

శ్రీ.కృ.దే : చాలును- రామకృష్ణకవి. రాయలవారే యీ సమస్య యిచ్చియుంటి రనుకొమ్ము ; ఏది నీపూరణ. నీ తత్వమేమైన మారునేమో చూచెదముగాక!

తె.రా : "రంజనచెడి పాండవులరి - భంజనులై విరటుఁ
గొల్వఁ బాల్పడి రకటా!
సంజయ! యేమనిచెప్పుదుఁ- గుంజరయూధంబు
దోమ కుత్తుక సొచ్చెన్"

(రాయలు పరమానంద భరితుడగును. శెభాష్ అని సభాసదులందరు ఎంతకైన రామకృష్ణుడేసరి అంటూంటారు. అంతలో రాజభటుని ప్రవేశం)

శ్రీమతి పి. సూర్యకుమారి.

రా.భ: జయ! శ్రీ శ్రీ కృష్ణదేవరాయలు మహారాజులుం గారికి జయ! ప్రభూ! ఢిల్లీ సుల్తాన్ పంపిన రాయ బారి యట. తమ దర్శన భాగ్యమునకు.............

శ్రీ.కృ.దే: మంచిది. ప్రవేశపెట్టుము. సుల్తానులకు మాతో పని యేమైయుండవచ్చును?

(రాయబారి ప్రవేశం)

రా: మహా-రాజా-వార్కీ-మాదీ- సుల్తాన్ - సందేహం - హిది- సుల్తాన్-వార్కీ-మీద-భార్తం- రాయించ్వాలా - హుద్దేశం. మీకీ- దర్బార్ మే- బడాబడా- కవీశ్వర్- హుండ్వాలా- సుల్తాన్‌వార్కీ- మాలుమ్- హైంది. అందుకీ- కొందర్- కవీశుల్‌కి- ఢిల్లీ- పంప్‌వాలా. బడా- యీనామ్ ....

శ్రీ.కృ.దే: మంచిది. గ్రహించితిమి. అట్లే పంపెదమని చెప్పుము.

(రాయబారి నిష్క్రమించును)

శ్రీ.కృ.దే: విన్నారా? ఢిల్లీ సుల్తాన్‌మీద భారతం వ్రాయ గలవారు కావలెనట. మీలో పెద్ద పెద్ద కవీశ్వరులు కావలెనట. ఎవరు వెళ్ళ నిచ్ఛగించెదరు?

(ఎవరును పో నిచ్ఛగింపరు)

భట్టు: ఢిల్లీ వెళ్ళినచో జుట్టు తీయించుకోవలెను; లేదా జిజియా పన్ను చెల్లించవలెనుగాన మా కిష్టములేదు. తెనాలి రామన్న తానే మహాకవినిగదా అని గర్వపడు చున్నాడు ప్రభువులు అతనినే పంపనగును.

(భట్టు మూర్తికీ రామలింగనికీ ఎప్పుడూ బద్ధవైరం)

శ్రీ.కృ.దే: రామలింగకవి అభిప్రాయము వినగోరు చున్నాము.

తె.రా: దిగ్గజములు దిగులు మోము వైచినచో మీసము లున్న రామల్లింగసింగమే పోగలడు! ప్రభువుల ఆజ్ఞ యైనచో రామకృష్ణకవి వెళ్ళి యీ కార్యము చక్క బెట్టుకొని రాగలడు. అతనికి ఎనమండుగురు తోడువచ్చిన జాలును. వీరే అష్టదిగ్గజములని బొల్లులు బొల్లి, కథ అంతయు నేనే నడుపగలవాడను!

(సభలో మరల కరతాళ ధ్వనులు) (తెర పడును)

2 వ రంగం

ఢిల్లీ సుల్తాన్ సభ.

(సుల్తాను, సభాసదులు యథోచిత స్థానములలో ఆసీనులై యుందురు.)

(తెనాలి రామకృష్ణుడు, ఎనమండుగురు కవుల వేష ధారులతో ప్రవేశము.)

సుల్తాను: కవీశం సాబ్! మీకీ- బడా- కవీశం- కోన్?

తె.రా: (ఒక్కొక్కరి చూపుతూ) అదిగో వారు- మను చరిత్ర గ్రంథకర్త- కవితా పితామహులనబరగు- అల్లసాని పెద్దన; అల్లదిగో వారు పారిజాతాపహరణ ప్రబంధకర్త ముక్కు తిమ్మన; ఇల్లదిగో వీరు వసు చరిత్ర రచయిత భట్టుమూర్తి............ వీరందరికి చేతగానిదేదైననూ సాధించగలవాడను నేను- వారి గురువును!

సు: మాకీ- బలే బలే- సంతోషం! నీకీ- బహూత్- హుషార్- ఆద్మీ! కవీశంభాయి! మాకీ- మీదా- భరాతం- కట్వాలా- వ్రాయ్‌వాలా. అందుకీ- మీకీ- ఒకటి- మాషం- షర్తు- యిచ్‌నామ్, అచ్ఛాహైతో- బడా- యీనామ్. నైతో మీ తల్‌కాయ్- గొర్గుతాం- మాలుమ్‌హై?

తె.రా: (అందరి తరపునా) చిత్తం! చిత్తం. సుల్తాను వారు చూస్తారుగా! మాకు మాత్రం చక్కటి విడిది భోజనం వగైరాలు ఏర్పరచాలి. (బ్రాహ్మణో భోజన ప్రియా!)

సు: సుబ్‌దార్! అరే- ఇస్కో- బొమ్మన్‌కి- బడా- భోజన్ పెట్వాలా.

(అందరు నిష్క్రమింతురు)

(తెర పడును)

3 వ రంగం

విడిది

ఎనమండుగురు బ్రాహ్మణులు, తెనాలి రామకృష్ణుడు ఉపవిష్టులై ఉంటారు.

బ్రాహ్మ: ఐతే సుల్తాన్‌మీద భారతం వ్రాయడం మాట

ఏమైనా ఆలోచిస్తున్నారా ? భోజనం మాత్రం మహా బాగా జరుగుతూవుంది ! నెల్లాళ్ళూ ఇట్టే అయిపోయింది. రేపు సుల్తాన్‌ను చూడాలిలావుంది. భారతం మాట ఏమిటి ?

తె.రా : చూచేరా ! ఈ 18 వట్టి తాటాకు కట్టలు. ఇవి 18 పర్వాలన్నమాట ! ఒక్కొక్కడు రేపు 2-3 కట్టలు మోసుకొని నా వెంట రావాలి. ఇప్పుడు మీ సిగల్లో ఇంతింత జుట్టు కత్తిరించి, వాటికి తాటాకు పేరు బిళ్ళలు కట్టి, నా బిచాణాలో దాస్తా. వాటి పని తర్వాత ఉంది- మనం రాయలు దగ్గరకు తిరిగివెళ్ళాక.

బ్రా : మీరేమి చేయమంటే అలా చేయవలసిందనే రాయల వారు మా కాజ్ఞాపించి పంపేరు. అదిగాక సుల్తాన్ వ్రాయమన్న భారతం వ్రాయలేనందుకు మా తలలు ఎలాగా గొరుగుతాడు !

4 వ రంగం

సుల్తాను కొలువు కూటం.

(అష్టదిగ్గజాల పేర్లతో బ్రాహ్మణులు, తెనాలి రామకృష్ణుడు తాటాకు కట్టలు మోసుకుంటూ ప్రవేశం.)

సు : మాకీ- మీద- భరాతం- సమాప్తం- హోగయాక్యా ?

బ్రా : చిత్తం. కాశీ-గయా చూచుకొనే ఇంటికి పోదామనుకుంటున్నాం ప్రభువుల చిత్తం.

తె.రా : చిత్తం. చిత్తం. 18 పర్వాలు పూర్తిచేసి తీసుకొచ్చేం. ఒక్క సందేహం ఉంది.

సు : మీకీ బలే- సందేషం బోలో- భాయ్. సందేహం- ఎందుక్క- పద్వాలా ?

తె.రా : ఏమీలేదు. భారతం అంతటికీ ముఖ్య స్త్రీ పాత్ర ద్రౌపతి.

సు : అచ్చా- అచ్చా.

తె.రా : ఆవిడకు ఐదుగురు భర్తలున్నారు. ప్రభువువారు కాక, సుల్తానా వారికి మిగిలిన నలుగురు భర్తల పేర్లు చెప్పేయెడల, తమ మీద వ్రాసిన భారతం ముగించి, చదివి వినిపించి, శెలవు తీసుకుందామని....

సు : అరె- అల్లా ! హిది- యేమ్టి- భాయ్ ! మాది- సుల్తానాకి- హైదు- భర్త ! తూ తూ , ఇది-భరాతం- మాకీ- వద్దూభే.

తె.రా : అరెరె ! ప్రభువులు అలా సెలవిస్తే ఎలాగ ? ఈ ఎనమండుగురూ నేనూ నెల్లాళ్ళు రాత్రింబగళ్ళు కష్టపడి యింత గ్రంథం తయారు చేసుకొచ్చేం. ఢిల్లీ సుల్తాను వారి మెప్పుపొంది, గొప్ప గొప్ప బహుమానాలు పొందాలని గంపెడాశలు పెట్టుకొని ఉన్నాం; ప్రభువులు పర్యాలోచించాలి.

సు : మీకీ- బడా- బహుమాన్, చేస్తాంభే. సలాం- చేస్తామ్. ఆ భరాతం- అగ్గిమె- డాలో. సుబేదార్- దేఖో- అగ్గి- లావ్.

(18 తాటాకు కట్టలు అంటించేస్తారు)

సు : ఈ- బొమ్మన్‌కీ- బడా బడా- ఈనాం- హిచ్చి- పంప్వాలా. పహిలే వాలా- హీడ్కీ- బడేఆద్మీ- దోగుణ్- ఈనాం- దేవ్. అల్లా, అల్లా ! సైతాన్- మీకీ- సలాం చేస్తాం- జావో, జావో. (అందరు శెలవు తీసుకొందురు)

(తెర పడును)

5 వ రంగం.

శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానం.

(శ్రీకృష్ణ దేవరాయలు, కవులు, తదితరులు సభ జేసి యుందురు)

(బ్రాహ్మణుల నెత్తులమీద పెద్ద పెద్ద గుమ్మిడి కాయల మూటలు, కాయలు పైకి కనబడకుండ కట్టి, మోయించుకుంటూ తెనాలి రామకృష్ణుడు, చంకలో అంగవస్త్రమున చుట్టిన ఒక కట్టతో ప్రవేశించును)

శ్రీకృ.రా : ఇదేమి ? రామకృష్ణ కవీ- ఇంతింత పెద్ద మూటలు ?

తె.రా : భట్టుమూర్తి బొల్లిల్లాంటివి కావు నమ్మండి. ఢిల్లీ వజ్రాలు గొప్ప గుమ్మడికాయలంతేసి !" ఈ అష్టదిగ్గజాలూ నేనూ రచించిన అపూర్వ భారతాని బలే మెచ్చుకొని, ఈ అపూర్వ బహూమతులిచ్చి పంపించేడు ఢిల్లీ సుల్తాన్. ఈ వజ్రాలన్నీ బహూమతులిచ్చి నాకు సలాం పెట్టి పంపించేసేడు.

(అంతా ఆశ్చర్యంగా వింటూ చూస్తుంటారు)

(రామకృష్ణ కవి ఎంతకేని తగు, ఎన్ని బొల్లులు బొల్లినా యితడే బొల్లవలెనని అష్టదిగ్గజ వేషధారులు అనుకుంటూ మూటలు దింపుకుంటారు)

శ్రీకృ.దే: ఏదీ? ఆ అపూర్వ భారతం?

తె.రా: ఇంకెక్కడిది? అక్కడే కాల్చేసేం! సుల్తానే కాల్పించేసేడు!

భట్టు: అంటే—అంత బాగున్నదన్నమాట!

శ్రీకృ.: నీ చంకనున్న దేమిటి?

భట్టు: మళ్ళీ ఏ "తిలకాష్ట— మహిష- బంధనమో ప్రదర్శిస్తాడు! అంతకంటె ఏముంది? ఎరుగము గనుకనా ఈతడి ప్రజ్ఞలు!

తె.రా: ఢిల్లీకి వెళ్ళి జయించుకొచ్చాను. భట్టువంటి చేత గాని వాని జుట్టు సిగ తరిగి బుజువు తెచ్చాను. ఇదిగో "అష్టదిగ్గజ ప్రలాప హంతక తెనాలి రామకృష్ణ కవి సింగని విజయ రాజీయం!" (అని ఏడు గురిది జుట్టు శిఖలూ, వాటికి కట్టిన తాటాకు పేర్ల బిళ్ళలతో ప్రదర్శిస్తాడు)

భట్టు: రామలింగన్నా కవే; నేనూ కవినే! కవులకేమి లోటు!

ఆ॥ దేవునానమున్న దేశానకొకరుండ - నిప్పుడూరనూర
నింట నింట
నేపురార్వురేడ్వు రెనమండ్రు తొమ్మండ్రు - పదుపు
రైరి కవులు పద్మనాభ!

శ్రీ.కృ.దే: మొత్తము మీద రామకృష్ణ కవి బొల్లిలూ కవిత్వమూ చాల చమత్కారముగా నుండునని నేను, ఆస్థాన కవులు, అందరు ఒప్పుకొనుచున్నాము. చాలు గదా!

తె.రా: మాతో పోల్చుకొని భట్టుమూర్తి తానొక కవినని చెప్పుకొనుచున్నాడు!

క॥ కవి యల్లసాని పెద్దన - కవి తిక్కనసోమయాజి
గణుతింపంగా
గవి నేను రామకృష్ణుఁడఁ - గవియను నామంబు
నీరు కాకికి లేదే?

(జయ - శ్రీకృష్ణదేవరాయలుంగార్కి జయ - జయ ఆంధ్ర భోజునుకి జయ - జయ - రామలింగ కవికి జయ - అను జయజయ ధ్వనులతో సభ ముగియును)

(తెర పడును)

మూలం : పెరల్ బక్

ఫ్రిల్లు

అనువాదం : "శ్రీ శిల్పి"

"ఈ కాలర్లతో ఖచ్చితంగా వుండకపోతే లాభం లేదు" అంటూ పోస్టు మాస్టరుగారి భార్య కొంచం ఆయాస పడుతూ పడక కుర్చీలో చేరబడింది. ఈ ప్రాంతాల్లో గడిపిన యీ పది సంవత్సరాలుగా ఆమె శరీరం స్థూలమయి వుంది, "టైలరు వచ్చేడమ్మా" అని చెప్పిన నౌకరు ప్రక్కగా నిలుచుని వున్నాడు.

బల్లమీద వున్న విసినికఱ్ఱ తీసుకొని మెల్లగా విసురుకొంటున్న అతిథి ఆమె ధోరణికి ప్రశంసిస్తూ "వీళ్ళని మీరు పగడలో పెట్టినట్లు నాకూ చేతనయితే బాగుండునండీ. ఇక్కడ బట్టలు యెంత చవుక అయితే మాత్రం యేం లాభం యీ టైలర్లతో వేగటం ఎంతో కష్టం. మా టైలరున్నాడు చూచేరూ మూడు రోజుల్లో యిచ్చేస్తానని చెప్పి వారాలు గడిపివేస్తాడు. అదయినా చివరకు ఎందుకూ పనికి రానిదిగా తయారు చేస్తాడు. వీళ్ళ కుట్టూ వీళ్ళూను. అబ్బా !" అంటూ నిట్టూర్చి, విసిని కఱ్ఱతో వేగంగా విసురుకో సాగింది.

"ఇప్పుడు చూడండి" ధీమాగా అంది శ్రీమతి. నౌకరుతో సగర్వంగా "టైలరనిటు పిలువు" అని ఆజ్ఞాపించింది. వినయ విధేయతలు వుట్టిపడుతూ "చిత్తమమ్మా" అంటూ పోయి టైలర్ని నడి వయస్సులో వున్న ఆ సన్నని టైలర్ని వెంటబెట్టుకొని వచ్చేడు. టైలర్ రాగానే వారిద్దరికి నమస్కరించి తన చంకలో వున్న బట్టల చుట్టను నేలమీద పెట్టి విడతీసేడు. అందులో నలిగిపోయిన యింగ్లీషు కంపినీ, మాదిరి పుస్తక మొకటి, సగం కుట్టి వున్న నీలం చుక్కల సిల్కు గౌను ఒకటి వుంది. గౌనును జాగ్రత్తగా దులిపి పైకి ఎత్తి ఆమెకు చూపేడు.

దాన్ని పరీక్షించి చూచి, వెంటనే స్వభావిక మయిన పెద్ద గొంతుకతో "ఆ కాలరేమిటి టైలర్ ? ఫ్రిల్లు పెట్టమనలేదూ ?" అంటూ తొందరగా మాదిరి పుస్తకంతీసుకుని పేజీలు వేగంగా తిప్పి "ఇదిగో యీ మాదిరి కాదూ నీకు చెప్పింది ? అంత వెడల్పు కాలరెందుకు పెట్టేవు ? నీకు చెప్పి ప్రయోజనమేమిటి ? నీవు వింటేగా ?— తీసుకుపో దాన్ని ?" అని గద్దించింది.

దానితో టైలర్ నిశ్చల మయిన మొహంలో చెమటలు పట్టుకు వచ్చేయి. "అలాగేనమ్మా" నీర్సంగా అన్నాడు. "మీరు మొదట ఫ్రిల్లే కావాలన్నారు తరువాత వద్దన్నారు. ఆరోజు వెడల్పు కాలరు పెట్టమన్నారు. ఫ్రిల్లు మరి ముతక అవుతుందన్నారు." అని ప్రార్థనా పూర్వకంగా ఆమెవైపు చూచేడు. కానీ ఆమె మాత్రం ఆ లావుపాటి చేతుల్ని వూపుతూ గొంతెత్తి "లేదు. లేదు. నీవన్నీ అబద్ధపు మాటలు చెబుతున్నావు" విసురుగా "నేనేంచెప్పిందీ నాకు తెలుసు. నే నెప్పుడూ పెద్ద కాలరు కావాలనలేదు. ఈ రోజుల్లో పెద్దకాలర్లెవరు పెట్టుకుంటున్నారు ? అదెందుకు పెట్టినట్లు నీవు ?" "అవునమ్మా" ఆశ పొడసూపింది. "ఫ్రిల్లు పెడితే కొంచం బట్ట యెక్కువ పడుతుంది. పరవాలేదంటారా అమ్మా" అని ప్రాధేయపూర్వకంగా వేడుకున్నాడు.

ఆమె మాత్రం అంత తేలికగా యే విషయం ఒప్పుకునేది కాదు. "నీకేమీ పరవాలేదు. కానీ నా బట్ట మాత్రం బోలెడంత తగలవేశావు. వూరికే యీ బట్టల్ని కొన్నాననుకున్నావా డబ్బు యెంతో వృధా చేసేవు." ఆ పడక కుర్చీలో వెనుకకూ ముందుకూ వూగుతూ వేగంగా విసురుకొంది. అతిథి వైపు తిరిగి "నేనీదుస్తులు వస్తాయని కనిపెట్టుకుని కూచున్నాను. ఇప్పుడు చూడండీ ! ఎల్లుండి వుద్యానవనంలో విందుకు వేసుకోవాలనుకున్నాను. ఫ్రిల్లు పెట్టమని మరీమరీ చెప్పేను. ఆవెఱ్ఱి కాలరు చూండండి !" అతిథి దానికి వంతవేస్తూ "అదే నేనూ అనేది, మరి దీని సంగతేం చేస్తారు ?" అంది. "అదీ నే చూస్తాగా" అంది శ్రీమతి ధైర్యంగా. కొద్దిసేపు టైలర్ వునికినే గుర్తించనట్లు తన చక్కని తోటపై దృష్టి నిలిపింది. టైలర్ ఆ గౌనును పట్టుకొని ఆమె ప్రసన్నత కొరకు ఎదురు చూస్తూ నిలుచున్నాడు. చెంపలు మీదుగా చమట ధారలు కారిపోతుంది. పెదాలు తడి చేసుకుని తొట్రు

పాటుతో "వేసుకుని చూస్తారా అమ్మా?" ప్రాధేయపడ్డాడు. "లేదు. అవుసరంలే" దని విసిరింది, "ఎందుకు వేసుకోవటం! అధ్వాన్నంగా వుంది కుట్టు. కాలరంతా శుద్ధతప్పు, వేసుకుని చూడటం దేనికి!" తోటమీది దృష్టి మరల్ప కుండగానే అంది. "ఆ ఫ్రిల్లే కుడతానమ్మా, మీరు చెప్పిన విధంగానే కుడతాను. మీ కెప్పుడు కావాలి?" "నాకు రేపు కావాలి. మధ్యాన్నం పన్నెండు గంటలకు. లేదా డబ్బు ఆశ పెట్టుకోకు." "అలాగే చేస్తానమ్మా" అంటూ ఆ బక్కచిక్కిన చేతులతో గౌనును జాగ్రత్తగా మడిచి వేసేడు. లేచి దేని కొరకో ఎదురు చూస్తున్నట్లు నిలుచున్నాడు. విచార రేఖలు అతని మొహంలో ప్రతిబింబిస్తున్నాయి. ఆవేదనతో కూడిన మొఖంలో చమటలు కమ్ముకున్నాయి. చివరికి ఆమె కూడా యీ ఆవేదన చాయలను గుర్తించ కుండా ఉండలేక పోయింది. ఏమిటి చూస్తున్నా వింకా? టైలరు పెదేలు తడిచేసు కొని, హీన స్వరంతో "కొంచెం డబ్బిప్పిస్తారా అమ్మా?" ఆమె వాడి చూపుల క్రింద అతని గొంతు మరీ నీరసించి పోయింది. "నాఅన్న కొడుకు యీ రోజు చచ్చిపోయేలా వున్నాడు. వాడికి భార్యా, ముగ్గురు పిల్లలూను. దహనానికి కూడా డబ్బు లేదు." ముగించ గలిగేడు. "నే ననుకుంటూనే వున్నాను. వాళ్ళ కెప్పుడూ యేదో ఒక విపత్తు వచ్చి పడుతూనే వుంటుంది. ఈ కుట్టుకు తోడు ఎప్పుడూ డబ్బు గొడవె." అతడికి ఆమె వైపు చూచే శక్తి కూడా నశించింది. "నేను చెప్పినట్లు ఫ్రిల్లుతో గౌనంతా పూర్తి చేసుకురా పూర్తి కాక పోతే డబ్బిచ్చేది లేదు" "అలాగేనమ్మా" అని నిట్టూర్చేడు. ఆశా జాడలన్నీ అడుగంటుకు పోయేయి. నిరాశ తెర ఆ ముఖాన కమ్ముకుంది. "రేపు తెస్తానమ్మా" అంటూ వెను తిరిగేడు. "చేసేలా చూడు" కేక పెట్టింది, జిగుప్సతో అతను పోయేవైపుగా చూస్తూ.

"నేను రేపంటే వాడు బహుశా ఎల్లుండి కయినా తెస్తాడేమో" అని యేదో గుర్తుకు వచ్చినట్లు గంట నొక్కింది. నౌకరు రాగానే "ఆ టైలరు వెధవ పోతూపోతూ యింట్లో వస్తువేదో పట్టుకు పోకుండా పోడు." అని హెచ్చరించిన ఆమె గొంతు దూరంగా వరండా దిగుతున్న టైలర్ కి కూడా వినిపించక పోలేదు. డబ్బు కొరకు వీళ్ళీ కథలన్నీ అల్లుకొస్తారు. వీళ్ళకి డబ్బు అవుసరం లేనిదెప్పుడు? ఇలాంటి మనుష్యుల్ని నేనెక్కడా చూడలేదు. మనకి బట్టలు కుట్టి బోలెడంత డబ్బు కూడ బెడుతున్నారు, వీళ్ళంతా. ఇతడు మరీ అన్యాయం. పనికాక ముందే డబ్బు కావాలని కూచుంటాడు. ఈ మధ్య మూడుపర్యాయాలు పిల్లలు చచ్చి పోతున్నారని బొంకేడు. అందులో నేనొక్క మాట నమ్మలేదు. తాగుడుకు, నల్లమందుకు తగలేస్తుండాలి. వీళ్ళంతా యింతే. ఒక్కమాట నమ్మకూడదు. "ముమ్మాటికి నిజం మీరన్నది" అంటూ అతిథి సెలవు తీసుకోవటానికి లేచింది. 'వీళ్ళతో ఖచ్చితంగా వుండాలండి' అంది శ్రీమతి.

ఎండ తీవ్రంగా వుంది. టైలరు శ్రీమతి యిల్లుదాటి నిశ్చింతగా సాగిపోతున్నాడు. ఆమెను అడిగి చూచేడు—కానీ ప్రయోజనం లేక పోయింది. తిరస్కరిస్తుందేమో నన్న భయం వేధిస్తున్నా ధైర్యం కూడబట్టుకుని అడిగినా ఫలితం మాత్రం లేదు. ఆ నాల్గుడబ్బులూ వస్తే తన కొడుకు దహనానికి పనికి వస్తుంది. తన ముగ్గురు కొడుకులూ తన కండ్లముందే మట్టిలో కలిసి పోయేరు. అన్న కొడుకయినా యితడొక్కడేగా మిగిలింది. ముగ్గురు కొడుకుల తండ్రి అయి అనుకోని విధంగా చావు దాపురించింది. రెండు నెల్లు వెనుక ఎఱ్ఱగా కాలిన నాగలికఱ్ఱు పొరపాటున కాలుమీదపడి ఎముకల కంటా కాలిపోయింది. వాడిన తైలా లేమీ పనిచేయలేదు. ఈ రెండు నెలల్లో కాలువాచి ఆశలు వదులుకునే పరిస్థితికి వచ్చింది.

ఈ రోజు ఉదయమే రోగిని చూచి వచ్చేడు. చావు పీఠమేసుకు కూర్చుందని అతనికి తెలిసి పోయింది. గుమ్మంలో అతని భార్య కూర్చుని రోదిస్తోంది. పెద్ద పిల్లలిద్దరూ దిగులుగా చూస్తూ కూచున్నారు. పొత్తిళ్ళలో పసివాడు రొదపెడుతున్నాడు. తల్లి రెండు రోజులుగా ఏడుపు పెడబొబ్బలలో పాలన్నీ ఎండి పోవటం వల్ల వాడు ఆకలికి గింజుకు పోతున్నాడు.

టైలరు సందు తిరిగి ఓ ద్వారంలోకి ప్రవేశించేడు. పెద్ద వసారాలో మొండి మొలలతో పిల్లలంతా ఆటలలో కీచులాడుకొని కాకి గోల చేస్తున్నారు. తలమీద మురికి నీళ్ళలో గుంజిన చింకి పాతలు దండేలమీద వ్రేలాడుతున్నాయి. అక్కడి ప్రతి గదిలోనూ ఒక కాపురం నివసిస్తుంది. ప్రతివాడూ చెత్తా చెదారం అంతా ఆ ముందే వేయడంవల్ల వేసవి అయినా ఆ ప్రదేశమంతా దుర్గంధంతో నిండి వుంది. కానీ యీతడు మాత్రం యివన్నీ పట్టించుకునే పరిస్థితిలో లేదు. కుడివైపుగా వున్న ఒక

చీకటి గదిలోకి దారి తీసేడు. ఈ గదిలోనూ దుర్గంధమే-కాని యిది మాంసము కుళ్ళిన వాసన. మంచం ప్రక్కన ఆమె రోదిస్తుంది. అతడు రావటం కూడా ఆమె గమనించలేదు. కన్నీటితో ముఖమంతా మలినంగా వుంది. నల్లని పొడుగాటి జుట్టు ముడి విడి బుజాల మీదుగా విరబోసి వుంది. "అయ్యో! నీవు వెళ్ళిపోతున్నావా? మా గతేమిటి" అని పదే పదే రోదిస్తుంది. ప్రక్కనే నేలమీద పడివున్న చంటివాడికి యేడవటాన్కి కూడా వూపిరి లేకుండా వున్నాడు. పెద్ద పిల్లలిద్దరూ తల్లి చెంగు పట్టుకు కూర్చున్నారు.

టైలరు మంచం వైపు తిరిగి "ఎలావుంది నాయనా?" అన్నాడు. రోగి కష్టంమీద కండ్లు విప్పి చూచేడు. అస్తిపంజరంలా వున్నాడు. ఎంతో సతమతమయి పెదేలు కదిపి 'యీ పిల్లలు' అనగలిగేడు నెమ్మదిగా. టైలర్ ముఖం బాధతో వివర్ణమయింది. మంచానికి ఓ మూలగా కూర్చుని "నీ బిడ్డల కొరకు విచారించకు నాయనా. శాంతంగా వెళ్ళిపో. నీ భార్యా బిడ్డలు నా యింటికి వస్తారు. నీ భార్య మాకుబిడ్డలాంటిది. నీ ముగ్గురు బిడ్డలు మాకు మనుమలు. నీవేమయినా దూరపు వాడివా నాకు?" లోలోపలే దుఃఖిస్తున్నాడు— కన్నీరు ధారలుగా కారిపోతోంది. రోగి కొంతసేపటికి గొణుగుడుగా "నీవూ బీదవాడివే నాయె...." "నీవు విచారించకు శాంతంగా వుండు నాకు చేతిలో పని వుంది. నాదగ్గర యిప్పుడు పోస్టు మాస్టరు భార్య దుస్తులు వున్నాయి. ఫ్రిల్లు తప్ప అది దాదాపు పూర్తి అయింది. బహుశా ఇంకా బట్టలు వస్తాయి. మాకు బాగానే జరిగిపోతుంది——" కానీ రోగి తిరిగి మాట్లాడలేదు. కండ్లు మూసుకొని నెమ్మదిగా వూపిరి పీలుస్తున్నాడు. టైలరు తన బట్టల చుట్టను ఒక మూల పెట్టి వచ్చి నిశ్శబ్దంగా రోగి ప్రక్కన కూర్చున్నాడు. రోగి భార్య పెద్దగా రొద పెడుతూనే వుంది. గంటలు గడిచిపోతున్నాయి. చివరకు ఆమె అలసిపోయి కండ్లు మూసుకొని మంచానికి చేరబడింది. పొరిగింటి ఒకామె చంటివాడిని పాలు పట్టటానికి తీసుకుపోయింది.

మసక చీకటి పడగానే రోగి ప్రాణం వదిలేడు. అప్పుడు టైలర్ లేచి మూల నున్న బట్టల చుట్టను పట్టుకొని కోడలితో "వాడు వెళ్ళిపోయాడు, నీదగ్గరేమయినా డబ్బు వుందా?" అన్నాడు. ఆమాటలు వినగానే ఆమె వెంట్రుకలు వెనక్కి లాక్కుని లేచి మంచంమీద చూచింది. ఆమె యింకా యౌవనంలోనే వుంది. ఇరవయ్యేళ్ళ కన్న ఎక్కువుండవు. అంత అందగత్తె కాకపోయినా కురూపి మాత్రం కాదు. ఏ పూట కాపూట సంసారాన్ని గడుపుకు వస్తున్న యిల్లాలు. ఇటువంటి అవాంతరం వచ్చి మీద పడుతుందని యెన్నడూ అనుకొని ఎరుగదు. దైన్యంతో టైలరు వైపు చూచి "మాకింకేమీ మిగలలేదు. వారి బట్టలు, నా చలికోటు అమ్మివేసేను. ఇప్పుడున్నదంతా యీ మంచమే!" అతని మొహం దిగులుతో కుంచుకుపోయింది. "ఎవరేనా అప్పిచ్చే వాళ్ళున్నారా?" అన్నాడు. "మా పొరుగు వాళ్ళు తప్ప నాకింకెవ్వరూ తెలియదు. వాళ్ళకి మాత్రం యేముంది?" కన్నీరుపెట్టుకుంటూ "మీరుతప్ప మాకీభూమ్మీద యెవ్వరూ లేరు" అంది. "అవునవును" అంటూ మంచంమీదికిచూచి "మొహంమీద బట్టకప్పు" అంటూ బయలుదేరాడు.

చాల దప్పిపోయి వున్నాడు. రోజంతా తిండీ తిప్పలూ లేకపోయినా ఆకలి మాత్రం కావడంలా. భార్య తెచ్చి అన్నం కంచం ముందు పెట్టినా తినబుద్ధి కాలేదు. ఆ దుర్గంధం యింకా అతని బట్టలకు పట్టుకొని వదలలేదు. హఠాత్తుగా సిల్కు గౌను సంగతి గుర్తుకు వచ్చింది. ఈ దుర్గంధం ఆ బట్టలలో పసిగడితే ఆమె! వెంటనే లేచి గౌను దులిపి వంకీకి తగిలించేడు. అయినా అది ఎంతసేపు అక్కడుంటుంది. కుట్టు పూర్తిచేసి డబ్బు తేవాలి. దుస్తులు మార్చుకున్నాడు. కుట్టేటప్పుడు చెమట గౌనుమీద పడకుండా చూచుకోవాలి. చెమట యింకటానికి గాను ఒక తువాలు తలకు చుట్టుకున్నాడు. చేతులు తుడుచుకోవటాన్కి ఒక బట్ట పక్కనే వుంచుకున్నాడు.

బట్టను అతి జాగ్రత్తగా పట్టుకొని ఆమెను ఎక్కడ అసంతృప్తి పరుస్తానో అన్న భయంతో తనకి చేతనైనంత నేర్పుతో కుట్టు ప్రారంభించేడు. ఆమె యింకో గౌను కూడా యిస్తే ఆ డబ్బు కూడా చేర్చి దహన క్రియలు జరపవచ్చు. కానీ ఒకవేళ ఆమె దగ్గర యింకేమీ కుట్టించవలసినవి లేకపోతే, తానేం చేయాలి! అప్పు చేయవలసిందే. అదయినా వడ్డీ భారం భరించవద్దూ! దహన క్రియలు చేసి అతని భార్యా పిల్లలను తీసుకురావాలి. ఈ ఒక్క గదిలో వారందరినీ యిముడ్చట మెలాగు? పిల్లలసంగతి తలపుకు రాగానే అదోవిధమయిన సంతోషం కలిగింది కానీ వారిని పోషించాలి అన్న సంగతి వెంటనే గుర్తుకు వచ్చి అది మాయమైపోయింది.

ఇంకా పని చూచుకోవాలి. తప్పక పని దొరుకుతుంది. శ్రీమతిగారి వద్ద యింకా కుట్టించవలసిన బట్టలు వుండే వుండాలి. ఆమె గొప్ప యింటి యిల్లాలు. అర్ధరాత్రి అయినా గౌను పూర్తి కాలేదు. అన్నిటికన్నా ముఖ్యమైన ఫ్రిల్లు యింకా కుట్టనే లేదు. మాదిరి పుస్తకం తిరగవేసి చూచేడు. సన్నని కుచ్చులు మడిచేడు. చేతులు నీరసంతో వణికేయి. తెల్లవారు ఝామున చేతితో కుట్టవలసిన అంచులు మాత్రం మిగిలాయి. ఒక్క క్షణం కన్నుమూసి బడలిక తీర్చుకుని కుట్టు పూర్తిచేయవచ్చు ననుకున్నాడు. గౌను వంకీకి తగిలించి నడుం వాల్చాడు. గాఢంగా నిద్ర పట్టింది.

కాని ఎంతో సేపు నిద్రపోలేదు. ఏడు గంటలకే లేచి కుట్టు ప్రారంభించి దాదాపు మధ్యాహ్నం వరకూ కుడుతూనే కూర్చున్నాడు. చివరకు ముగించేడు. తాననుకున్న దానికన్న ఎక్కువ కాలమే పట్టింది. తొందరపడి వెళ్ళాలి. ఆమెను ఆగ్రహ పరచకూడదు. ఇంకో గౌను కూడా కుట్టాలి. సాయంత్రము రాత్రీ కుడితే అది కూడా పూర్తి చేయవచ్చును. ఆత్రతగా కుట్టిన గౌను వాసన చూచేడు. కొద్దిగా మాత్రం వాసన కొడుతోంది. ఆమె అది గుర్తిస్తుందా ?

వెళ్ళగానే "పూర్తి అయిందా'' అందామె. "అయిం దమ్మా" అంటూ అందించేడు. "అయితే నేను వేసుకు చూస్తాను'' అంది. ఆమె గదిలోకి పోగానే వూపిరి బిగబట్టి వేచి వున్నాడు టైలర్. ఆమె ఆ వాసన గుర్తించిందేమో! ఆమె బయటికి వస్తూ తృప్తిగానే కనిపించింది. కానీ పూర్తితృప్తి పైకి కనబరచలేదు. "ఎంత ?" అంది క్లుప్తంగా. సందేహిస్తూ "ఇరవై రూపాయిలమ్మా" అన్నాడు. ఆమె కోపంగా చూడటం గమనించి "సిల్కు బట్ట కాదమ్మా. ఎవరైనా అంతే అడుగుతారు." "అంత ఎక్కువా అంత ఎక్కువా! నీవు నా బట్ట అంతా వృధా చేసేవుకూడాను!" చివరకు యిష్టం లేకుండానే డబ్బు యిచ్చింది. "వందనాలమ్మా" నెమ్మదిగా అన్నాడు. ఆమెను యిప్పుడు అడగాలి— కానీ ఎలాగు ? ఆమె లేదంటే, తానేంకావాలి! ధైర్యాన్ని ఎలాగో కూడబెట్టుకున్నాడు. ఆమె కండ్లలోకి చూడకుండా "అమ్మా! యింకా బట్టలుంటే కుడతాను. వూపిరి బిగబట్టుకొని ఆమె సమాధానం కొరకు ఎదురుచూస్తున్నాడు. ఆమె గౌను మార్చు కోవటానికి గదిలోకి వెడుతూ నిర్లక్ష్యంగా "లేవు లేవు. యింకేమీ లేవు. నాబట్టల్ని పాడుచేస్తున్నావు. ఇంకా చాలామంది టైలర్లున్నారు. వాళ్ళు చవుకగాకూడా కుడతారు" అంది. పిడుగువంటి యీ మాటలు టైలర్ చెవిని పడి కృంగిపోయేడు.

రెండవరోజు వుద్యానవనం విందులో కిందటిరోజు తన యింటికి వచ్చిన అతిధిని కలుసుకుంది శ్రీమతి. శ్రీమతి కొత్తగౌను చూచి ఆమె కండ్లు ఆశ్చర్యంతో మెరిసేయి. "చివరికి ఎలాగో మా గౌను తయారయిందండీ! అతడు పూర్తిచేసి యిస్తాడనుకో లేదు సుమండీ! ఆ ఫ్రిల్లు బాగా కుట్టేడు కదండీ!" శ్రీమతి తృప్తిగా తన ఫ్రిల్లు చూచుకుంది. "అవును బాగావుంది కదండీ! చివరికి ఫ్రిల్లే కుట్టించుకోవటం మంచిదే అయింది. పైగా ఎంతో చవక! ఈ ఫ్రిల్లూ యిదీ కుట్టటాన్కి మనవాళ్ళయితే యింకా ఎనిమిది రూపాయలు ఎక్కువ తీసుకునేవారు! ఏమంటారు ?" "అవునవును సరిగా పన్నెండు గంటలకే తెచ్చి యిచ్చేడు నేను చెప్పినట్లు. వాళ్ళతో ఖచ్చితంగా వ్యవహరించడమే దీనిలో రహస్యమండీ!"

★

సమాజసేవ: ఉత్సాహం కల్పించడము

శ్రీమతి దరిశి సుభద్రమ్మ.

సమాజ శ్రేయస్సుకు అందరూ సమిష్టిగా ఉత్తేజంతో కృషి సల్పిననే సర్వ జనులు సుఖప్రదమైన సాంఘిక జీవనం జీవించుటకు సాధ్యపడుతుంది. మానవులు సహజంగానే సంఘజీవులు. అన్యోన్యానురాగం, ఆత్మీయత, పరస్పరసహకారం, సానుభూతి అనేవి మానవుని ఉగ్గుపాలతోనే ప్రారంభమవుతవి. ఎప్పుడు కొందరు జనులు స్వార్థపరులై వ్యక్తిగత శ్రేయస్సుకే లక్ష్యమిచ్చి సమష్టి శ్రేయస్సును విస్మరిస్తారో, ఆ నాటినుండియే తక్కిన జనుల సాంఘిక జీవనం దుర్భరమవుతూ క్రమేణ సమాజమే శిథిలమగు స్థితికి వస్తుంది. కొన్ని వందల ఏండ్ల నుంచి నిన్న మొన్నటిదాక మన సమాజానికి అలాంటి పరిస్థితి ఏర్పడి వుండినది. సమాజంలో దురాచారాలు మూఢ విశ్వాసాలు, స్వార్థ పరత్వం, పదవీ వ్యామోహం భోగలాలసం, మతవైషమ్యాలు, అనైక్యత, అంతః కలహాలు పెచ్చు పెరిగిపోయినవి. తత్ఫలితంగానే భారతీయులందరం విదేశీ పరపాలన క్రింద దాస్యంతో, దారిద్ర్య క్లేశాలతో వందల ఏళ్ళ పర్యంతం నానా బాధలు పడ్డాము. ఇంతేకాదు; మన సమాజమే శిథిలమై భూగతమయ్యేస్థితి ఏర్పడినది. ఎందరెందరో మహనీయులు మన సమాజాన్ని సంరక్షించటానికి కృషి చేయసాగారు.

ఇట్టి తరుణంలో మనదేశపిత గాంధిజీ మన సమాజం యొక్క స్థితిగతులను అవగాహనం చేసికొని మనల్ని తరింపజేయుటకు దీక్ష వహించారు. మన బాపూజీ, సహచరులననేకులను కూడగట్టుకొని బహుముఖాలుగా సమాజసేవ చేస్తూ ఆ బాలగోపాలాన్ని ఉత్తేజపరచినారు. అందరితోబాటు భారత మహిళలు కూడా, కుటుంబం, ఆస్తి పాస్తులు మున్నగువాటిని పరిత్యాగం చేసి దుర్భర కష్టాలనోర్చుకొని అద్వితీయంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. సమాజంలో నానాటికి పెరిగిపోతున్న దుర్గంధపూరితమైన కుళ్ళును తొలగిస్తూ వివిధమైన నిర్మాణ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. పురుషులతోపాటు భారతవనితలు కూడా సమస్తం త్యజించి అపూర్వోత్సాహంతో సమాజసేవ సల్పినందుననే, మనకు స్వాతంత్ర్య సౌభాగ్యం లభించింది. కాని, ఇంతటితో మహిళల బాధ్యత పూర్తి కాలేదు. ఎందుకంటే మన దేశం దాస్యంనుంచి విముక్తి చెందినదే కాని, దారిద్ర్య క్లేశాలనుంచి చెందలేదు. ఈనాడు కూడా ఎక్కడ చూచినా నిర్ధనులు, నిరుద్యోగులు, నిర్వ్యాపారులు, నిరక్షరకుక్షులు, అజ్ఞానం అనారోగ్యాలతో అలమటించిపోతున్నారు. పూర్వంలాగే ఈనాడూ మన సమాజంలో అనేకులలో అధికారకాంక్ష, స్వలాభాపేక్ష, స్వబంధు, స్వజన పక్షపాతం మున్నగు దుర్గుణాలు తలెత్తుచున్న సూచనలు గోచరించుచున్నవి. అందుచేత ఇట్టి దుర్భర దారిద్ర్య స్థితులనూ, సమాజానికే అరిష్టదాయకమైన వ్యక్తిగత శ్రేయోభిలాషనూ, తుదముట్టించి సమస్త ప్రజలకు సుఖప్రదమైన సమాజాన్ని నిర్మించేందుకు తిరిగీ భారతమహిళలు పూనుకోవలసిన సందర్భమేర్పడినది. పైగా, ఆనాడు మహిళలను సమాజసేవకు ఉత్తేజపరిచినట్టి పరిస్థితుల్లాంటివే ఈనాడూ మనకి ఏర్పడియున్నవి. ఏలాగనగా, జాతిజనకుని మహాదాశయాన్ని గ్రహించిన ఆయన పరమ శిష్యులు, వినోబాభావే, ఆయన సహచరులు, అందరికీ ఆర్థిక సమానత్వము, వైజ్ఞానికంగా సాంఘికంగా అభ్యున్నతినొందుటకు సమాన సదవకాశములున్నట్టి నవ్య సమాజాన్ని నిర్మించుటకు "సర్వోదయ" అనే ఉద్యమాన్ని నెలకొల్పినారు; ఈ ఉద్యమంక్రింద, భూదాన, సంపత్తుదాన, శ్రమదాన అనే ఉద్యమాలని బయల్దేర్చి, అహర్నిశలు కృషి చేస్తున్నారు. భూస్వాములు, పారిశ్రామిక యజమానులు, ధనికులు, వీరియొక్క హృదయ పరివర్తనముద్వారా ఆర్థిక అసమత్వాన్ని క్రమేణ తొలగించటానికి సంకల్పించు

స మా జ సే వ

కొన్నారు. ఈ మహనీయులు దేశంలోని సమస్త గ్రామాలకు వేలకొలది మైళ్ళు పాదచారులగా వెళ్లుతూ అప్పుడే కొన్ని లక్షల యకరాల భూమిని భూస్వాములనుంచి సంపాదించారు. ఈ ఉద్యమాలలో వందలకొలది సమాజ సేవకులు చేరిపోయి అద్వితీయమైన ఉత్సాహంతో సమాజసేవ సల్పుచున్నారు. ఇదే రీతిగా మరికొందరు సమాజసేవకులు భారత సేవక సమాజం, స్త్రీలు, శిశువుల సంక్షేమ సంస్థలు, అనాథ శరణాలయములు ఇత్యాదులను స్థాపించి అవిరామమైన కృషి సల్పుతున్నారు.

ఒక వైపు ఈలాంటి సంస్థలూ, సమాజ సేవకులు మనలను సమాజ సేవకు ఉత్తేజపరుస్తున్నారు. మరోవైపు, భారత ప్రభుత్వమే మనలను సమాజసేవకు అనేకవిధాలుగా ప్రోత్సహిస్తున్నది. ఏలాగంటే, మన భారత ప్రభుత్వ లక్ష్యం కేవలం ప్రజాప్రభుత్వ స్థాపన మాత్రమేగాదు; భారత భాగ్య విధాత గాంధీజీ యొక్క పరమాశయమైన సంక్షేమ రాజ్య స్థాపన కావున, పరమ లక్ష్య సాధన కోసం, భారత ప్రభుత్వం కృషిచేయ నారంభించినది. మన ప్రభుత్వము, జాతి, మత, కుల, వర్గ విభేద రహితమై, సమస్త ప్రజలు, ఆర్థికంగా, సాంఘికంగా, వైజ్ఞానికంగా అభ్యున్నతి నొందునట్టి సమాన సదవకాశములుండి సమానత్వం, సహృదయం, సౌభ్రాతృత్వములతో ప్రజలే పరిపాలన చేసుకొనుటకు వీలగునట్లు నూతన రాజ్యాంగమును రూపొందించినది. అప్పుడే, ప్రజాస్వామ్య ప్రభుత్వ పద్ధతి ప్రకారం, అక్షరాస్యతతో నిమిత్తం లేకుండానే వయోజన ఎన్నికలుకూడా జయప్రదముగా జరిగిపోయినవి.

ఇక, సంక్షేమ రాజ్యస్థాపనకావశ్యకమైన ప్రణాళికలను అమలు పరచుటకు కేంద్ర ప్రభుత్వం పూనుకొన్నది. కాని, ఇట్టి కార్యకలాపాలను అమలు పరచుటకు ప్రభుత్వ కృషిమాత్రమే చాలదు. ప్రజల సహకార సానుభూతులు, వారి అఖండకృషి అత్యావసరంకదా ! అందుచేత, మన కేంద్ర ప్రభుత్వం సమస్త జనుల సహకారమును సమీకరిస్తూ జాతీయ విస్తరణ ప్రణాళికలను దేశవ్యాప్తిగా అమలు పరచుటకు 'ప్రారంభించినది.

ఇంతేకాదు. ప్రతి గ్రామంలోను, స్త్రీలు, బిడ్డలు, గ్రుడ్డి, మూగ మున్నగు వికలాంగులు, బాల నేరస్థులు సత్వరాభివృద్ధినొందుటకని, కేంద్ర ప్రభుత్వంవారు ప్రత్యేకంగా "అఖిలభారత సంక్షేమ బోర్డు"ను, 1953 సం॥ ఆగస్టులో స్థాపించినారు. ఆంధ్ర, అస్సాం, బొంబాయి, హైదరాబాదు, మధ్యప్రదేశ్, మద్రాసు, తిరువాన్కూర్, కొచ్చిన్, ఒరిస్సా, ఢిల్లీ మొదలగు ప్రాంతాలలో 300 సంక్షేమ కేంద్రాలు స్థాపించబడినవి. ఈ నెలలో అనగా, భారత స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15 తారీఖు నుంచి ఈ కేంద్రాలలో సంక్షేమ కార్య కలాపాలను సమగ్రంగా జరుప నిశ్చయించబడినది. క్రమేణ తక్కిన రాష్ట్రాలలో సంక్షేమ కేంద్రాలు స్థాపించబడుతవి.

ఈ 300 సంక్షేమ కేంద్రాలకూ 6000 గ్రామాలు 60 లక్షల జనాభా వుంటుంది. సంక్షేమ కార్యకలాపాల కయ్యే వ్యయంలో సగం కేంద్ర ప్రభుత్వం అఖిలభారత సంక్షేమ బోర్డుద్వారా గ్రాంటు యిస్తుంది. తక్కిన సగం ఆయా ప్రాంతాల ప్రజలు, స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు యిచ్చుకోవాలి. ప్రజలు ధన ధాన్యరూపంలో, కాయకష్ట రూపంలో యిచ్చి సహకరించాలి.

ఆంధ్ర రాష్ట్రంలో జూలైమాసంలో ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో సాంఘిక సంక్షేమ ప్రణాళికల నిర్వహణకు కమిటీలు ఏర్పరుపబడినవి. ఆగస్టు 15నుంచి సంక్షేమకృషి వివిధ రూపాల్లో జరుపబడుతవి.

స్త్రీలకు, విద్య విజ్ఞానాలకూ, బ్రతుకు తెరువుకూ, వయోజన విద్యాశాలలు, పరిశ్రమ కేంద్రాలు నెలకొల్ప బడుచున్నవి. ప్రసూతి వైద్యశాలలు, శిశుసంక్షేమకేంద్రాలు, శిశుసంరక్షణ, శిశుశిక్షణ శాలలు (క్రీచ్చీలు నర్సరీలు) వికలాంగులకు విద్య పరిశ్రమలు నేర్పు పాఠశాలలు, బాలనేరస్థులకు విద్యా వివేకాలు, సాంఘిక జీవనం సమాజసేవ. ఇత్యాదుల నేర్పు నట్టి పాఠశాలలు, సంస్థలూ, కుటుంబ సంక్షేమ కేంద్రాలు నెలకొల్పుటకు కృషి అతిచురుకుగా జరుగుతున్నది. ఇంతేకాక, కేంద్ర సంక్షేమ బోర్డు స్వచ్ఛంద సంక్షేమ సంస్థలకు ధనరూపంగా, సలహారూపంగా సహాయ పడుతూ ఉన్నది.


ఇదివరకే మనవిచేసి వున్నట్టుగా తిరిగి భారతమహిళలు అపూర్వోత్సాహంతో సర్వతోముఖంగా సమాజసేవ చేయుటకు సన్నివేశ సందర్భాలు ఏర్పడుచున్నవి. మనం అనేక

సమాజసేవ

విధాలుగా కార్య కలాపాల్లో పాల్గొనటమే స్వచ్ఛంద సంస్థలు, మహిళా సేవకులే కాక, భారత ప్రభుత్వమే మరెన్నో ప్రోత్సాహిస్తున్నది. కావున, మనం జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమాల నిర్వహణకు (1) జాతీయ ప్రణాళిక బాండు లను వీలయినంత పెద్దయెత్తున కొని కొనవచ్చును. (2) ముఖ్యంగా గ్రామోద్ధరణ కార్యక్రమం కోసం మనం ధన ధాన్య రూపంలో, కాయకష్ట రూపంలో సహాయం చేయ వచ్చును. (3) సాంఘిక సంక్షేమ కృషికి ఆవశ్యకమైన సుశిక్షణను పొంది స్వచ్ఛంద సమాజసేవకులుగానో లేదా జీవనోపాధికి తగినంత మాత్రమే వేతనం పుచ్చుకొని సంక్షేమ కార్యకర్తలుగానో కృషి చేయవచ్చు. ఇలా ఎన్నో విధా లుగా సేవ చేయుటకు పూనుకోవచ్చును. మహిళ కుటుంబా నికే కాక సమాజానికే మార్గదర్శకురాలిది కాదా, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన సర్వాంగ సుందర మైన నవసమాజాన్ని నిర్మించడం బాధ్యత ముఖ్యంగా భారత మహిళలపైన ఉన్నదను విషయాన్ని గుర్తించి వెంటనే కార్యాచరణకు పూనుకోవాలికదా!

(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)







గణపతి పూజ



గీ॥ ఆది మధ్యాంతశూన్య, మహావరన్య
రూప పరిపూర్ణ, పరిశుద్ధ పాపహరణ
పంచకర, దివ్యవదనాబ్జ, ప్రథమపూజ్య
వినుతిఁ గొనుమయ్య సరసిద్ధి విఘ్నరాజ!



అనాధ బాలలు !

"శ్రీ తాత"

బాలల్లారా, విన్నారా—ఈ" అనాధ బాలల" దీనచరిత్ర ! ?
బాలుడు, బాలిక— వారి పేరులను ఎరుగను నేనది పాతకథ !!
చిన్న తనంబునె తల్లి గతించెను ; తండ్రే సాకెను బిడ్డలను.
సిరిసంపదలతో తులతూగుచు పిల్లలు తల్లిని మరిచివేగ
ఇంతలోనే యా మృత్యుదేవత తండ్రినికూడా వలచినది ; ఆ
గతిని ఎరింగిన ముసలి తన పిల్లల గతికై చింతించెన్.
చేరువనున్న తమ్ముని పిలచీ పిల్లల నాతని సాకుమనెన్
పిల్లి కళ్ళతో, దేబె ముఖముతో కడు దుష్టుడయా పినతండ్రి.
చంకలు కొట్టెను, ఆస్థి చిక్కుటకు పిల్లల చంపగ తాదలిచెన్ !
మండు వేసవిలో మెండగు దుష్టుల నిద్దరి నాతడు మాట్లాడెన్
"సాయంసమయపు షికారుకై పొండి వీరితో మీర"నెను.
నమ్మిన పిల్లలు నెమ్మదిగా దుష్టుల వెంబడి చనినారు.
దాపున నున్న అరణ్యమందున ముద్దు బాలలను చంపగలేక,
"మిఠాయి లడ్లు తెచ్చెద" మంటూ మెల్లగ జారిరి దుష్టు లిర్వురు.

*   *   *   *

సంధ్యా సమయము— అమవశరాత్రి--సూర్యచంద్రులూ మటుమణిగారు !
పదిరెండేండ్ల పిల్లవాడు తన చెల్లితో అడవిని తిరుగాడెన్.
దారిని గానక, భీతిలిబాలలు గజగజ వణికీపోయారు,
కడుపు మంటచే నడువగలేరు, గొంతుకెండెను ఏడ్వగలేరు,
లేత హృదయములొక చెట్టు క్రిందనే శయనించెను నిశ్శబ్దముగా !
పసిపాపలను మృత్యు దేవత ఏడ్చుచు నెట్లో చేర్చుకొనెన్ !
చెట్లే ఏడ్చుచు ఆకులు రాల్చెను పూల పాన్పుగా పాపలకు ;
పిట్టలె పాడెను దీనముగా పిల్లల ఆత్మకు శాంతి కోరుతూ,
బాలల దుస్థితి చూడలేకనో తారలె రాలెను మెరయుచును,
మానవ జాతి, నీతి, మతములనె నిందించెగా అడవిమృగములె ! ! !
—బాలల్లారా, విన్నారా ఈ "అనాధ బాలల" దీన చరిత్ర ? !

గొప్పవారికి చిన్నపాఠం!

శ్రీమతి కె. అమ్మాజీ.

బాలలూ! మీలో చాలామంది న్యూటన్‌ను గురించి వినే ఉంటారు. ఇతడు ప్రపంచ ప్రఖ్యాతి చెందిన గొప్ప గణితశాస్త్ర వేత్త. ఇతడొకప్పుడు పప్పులో కాలు వేసిన చిన్న కథ వినండి!

ఒక రోజున ఆపిల్ పండు చెట్టునుంచి రాలి క్రిందకు పడుతుంటే చూచేడు; ఆ పండు క్రిందకే పడ్డమేమి- పైకెందుకు పోకూడదు? అన్న జిజ్ఞాస పట్టుకుంది అతడికి. అన్ని వస్తువులూ పైనుంచి భూమి మీదకే పడ్డానికి ఏదో కారణం ఉండాలి అని ఆలోచించి ఆలోచించి, అనేక పరిశోధనలు చేసి, గొప్ప లెక్కలు కట్టేడు. భూగోళం తన కేంద్రం వైపుకు అన్ని వస్తువుల్ని ఆకర్షించుకుంటుందని, అలాగే భూమి చంద్రుణ్ణి, సూర్యుడు నవగ్రహాల్ని, ఇలా ఒకటొకటి పరస్పరం ఆకర్షించుకోవడం వల్లనే అవి అనంతాకాశంలో బంతుల్లాగ తిరుగాడుతున్నాయని ప్రకటించేడు. దీన్నే 'గురుత్వాకర్షణ నియమం' **(Law of Gravitation)** అంటారు. ఇంతటి గొప్ప మేధావికి కూడ ఓ చిన్న విషయం తోచిందిగాదు; వినండి.

ఆయనకు ఒక పెంపుడు పిల్లి ఉండేది. అది తన యిష్టం వచ్చినప్పుడు ఆయనగదిలోకి రావడం, ఆయన్ని రాసుకొని ఆడుకోవడం వగైరాలు చేస్తుండేది. ఆయన దీర్ఘాలోచనల్లోను లెక్కల్లోను నిమగ్నుడై యున్నప్పుడు ఇది కొంత చికాకుగానే ఉండేది. రాకుండా తలుపు వేసేస్తే మ్యావ్ మ్యావ్ అంటూ కూచుని అతని ఆలోచనలకు అంతరాయాలు కల్పించేది. అలాగే కాలక్షేపం చేసుకొస్తుంటే కొన్నాళ్ళకు పిల్లల్ని పెట్టి, పిల్లలూ తానూ తయారయింది; తలుపు తీసి వుంచితే, లోనికివచ్చి గోలా ఆటలూను; మూసేసుకుంటే, తలుపు దగ్గర మ్యావ్ మ్యావ్‌లు। ఒకటికి ఐదయ్యేయి ఇప్పుడు; బయటి గోలకన్నా లోనికి రానిస్తేనే కొంతబాధ తగ్గేటట్టు కనిపించేది. తరుచు లెక్కలు అలాపెట్టి, లేచివెళ్ళి తలుపు తీసివచ్చి, మరీ పనిచూచుకో వలసివచ్చేది రాత్రుళ్లైనాను.

ఈ డిస్టర్బెన్సు తగ్గేమార్గాంతరం ఏమిట్రా అని ఆలోచించేడు. ఒక వడ్రంగి కుర్రాణ్ణి పిలిపించేడు, "చూడు: ఆతలుపులో ఒకపెద్ద కన్నం, ఒకచిన్న కన్నం కొట్టు; అస్తమానులేచి వీటికోసం తలుపుతీయ లేకుండా ఉన్నాను" అన్నాడు. "ఎందుకు మహాశయా రెండు కన్నాలు?" అన్నాడు అబ్బాయి. "ఎందుకేమిట్రా నీ బొంద; పెద్దది పిల్లికీను, చిన్నది దాని కూనలకూను. వేగం కొట్టేసి పో" అన్నాడు న్యూటన్. ఈయన లెక్కల్లో గొప్పమేధావిగదా, రెండు కన్నాలు కావాలంటాడెందుకురా? అని వడ్రంగి కుర్రాడు ఆశ్చర్యపోతున్నాడు. "పెద్దకన్నం ఒకటి కొడితే చాలదాండి? దాంట్లోనుంచే పిల్లలుకూడ రావచ్చునుగా" అన్నాడు. న్యూటన్ మేధావి, తన పరాలోచనకి, ఆ అబ్బాయి మేధాశక్తికి ఒకటే నవ్వట! "బలేపాఠం నేర్పావురా" అని బహుమతీ యిచ్చి పంపించేడట. ★

పాపాయి ఊహ?

మింటను మెరిసే చుక్కల్లారా!
మిమ్ముల చేరాలనుకుంటానోయ్.
నాకే, కనుకను, రెక్కలు వుంటే!
మిమ్ములచేరీ వుండుదు నోయ్!

మింటను మెరిసే జాబిల్లీ ఓ జాబిల్లీ,
క్రిందటి వారం చిన్నగ వున్నావ్?
ఇప్పుడు చూస్తే సున్నలాగనూ!
పెద్దగ ఎదిగావ్?

ఏమిటోయ్, నీలో విచిత్రమూ!

సూర్యుడు కానీ మీ అన్నయ్యా?
చుక్కలు కానీ మీ తమ్ముళ్ళా!
మీరులేనిదే విశ్వం లేదని మా తాతలు
తండ్రులు చెప్పుదురోయ్!

నిజమేనా అది నిజమేనా!
ఎలాగు మిమ్ముల చేరుదునోయ్?
ఉపాయ మేదైనా నుడువండోయ్?

రావుగారి పైజమా

శ్రీ చేబ్రోలు సూర్యారావు.

ఇది చాలా కాలం క్రిందటిసంగతై వుంటుందిలెండి ; అయినాకానీ చాలా గమత్తయిన విషయం అందుకనే, నేను దాన్ని కథగా రాయడాన్కి వుపక్రమించాను. ఇక చదవండి.

పది పదిహేనేళ్ళ క్రితం ఓ చిన్న పట్టణంలో "రావుజీ" అనే ఆయనొకడుండేవాడు. ఆయనవృత్తి ఓ పెద్ద ఆఫీసులో చిన్న గుమాస్తా.

ఒకనాడాయన ఆఫీసుకు పోతూ.... పోతూ.... ఓమాంచి పైజమా కుట్టి అట్టేపెట్టమని దర్జీవానికి ఆర్డర్ జారీ చేసాడు.

సాయంకాలం ఆఫీసునుంచి "రావుజీ"గారు రాకముసుపే దర్జీ పైజమాను తయారు చేసి "రావుజీ"గారింట్లో అప్పచెప్పి వెళ్ళిపోయాడు.

చీకటి పడ్డాక "రావుజీ"గారు ఆఫీసునుంచి యింటికి వచ్చి దర్జీ కుట్టిన పైజమా ఎలావుందో అని తొడిగి చూసుకొన్నాడు. కాలకర్మవశాత్తూ ఆ పైజమా రావుజీగార్కి రెండంగుళాలు పొడుగైంది.

పొడుగు తగ్గించమని దర్జీకి చెప్దామనుకున్నాడు కాని దర్జీ కొట్టుమూసివేసివుంది.

ఆమర్నాడే "రావుజీ"గారి ఆఫీసులో ఎవరో అధికారి ఇన్‌స్పెక్షన్‌కి వస్తాడట. అంచేత ఆ క్రొత్త షరాయి రావుజీగారు ధరించి ఆఫీసుకు వేంచెయ్యాలి.

అందుకని "రావుజీ" ఆయన భార్య వద్దకు వెళ్ళి పైజమా చూపించి దానిలో రెండంగుళాల పొడుగు తగ్గించి కుట్టమని చెప్పాడు. అందుకాయన భార్య తనకేదో పనివుందని కాస్సేపుపోయాక కుట్టిపెడతానని చెప్పింది.

కంగారులో వున్న రావుజీగారు తక్షణం ఆయన సోదరి దగ్గరకెళ్ళి పైజమా రెండంగుళాల పొడుగు తగ్గించమని చెప్పాడు. అందులకామె తనకు వంట యింటిలో పని వున్నదని ఒక అరగంట తరువాత కుడతాననీ చెప్పింది.

వీళ్ళిద్దరివల్లా పని జరుగకపోయేసర్కి రావుజీగార్కి మరీ కంగారు ఎక్కువై తనస్థితి కూతురితో చెప్పుకొన్నాడు.

ఆ అమ్మాయి చాలా మంచిదికనుక తండ్రి మాట శిరసావహించి పైజమా రెండంగుళాలు పొడుగు తగ్గించి కుట్టింది.

ఈమె రెండంగుళాలు పొడుగు తగ్గించినట్టు రావుజీగారి సోదరికి తెలియకపోవడంచే ఆమె మళ్ళీ రెండంగుళాలు పొడవు తగ్గించి కుట్టింది. ఈ సంగతులేవీ తెలియని ఆయనభార్య రెండంగుళాలు పొడుగు తగ్గించి మళ్ళీ కుట్టింది.

ఈ సంగతు లేవీ రావుజీగార్కి తెలీవు. ఆయన ప్రొద్దున్నేలేచి పైజామా తొడుక్కునేసర్కి అది నాలు గంగుళాలు పొట్టై వూరుకుంది. అదలా ఎందుకైందా అని ఆయన చాలా తికమక పడ్డాడు.

కాస్సేపటికి జరిగిన దంతా గ్రహించాడు కాని ఏం చేయగలడు. అదే ధరించి ఆఫీసుకు సిద్ధ మయ్యాడు రావుజీ.

కృతజ్ఞత

శ్రీమతి గజ్జెల లీలగారు ఆంధ్ర మహిళా సభ నిర్మలాదేవి గ్రంథాలయమునకు కొన్ని పుస్తకములు విరాళముగానిచ్చిరి. వీరికి మా కృతజ్ఞత.

కార్యదర్శినులు.

భర్త ఉన్నత విద్యకు తోడ్పాటు

రచన :
శ్రీ శ్రీమతి జానకీదేవి.

సమర్పణ :
శ్రీ బుద్ధవరపు సత్యనారాయణ

నాకు వివాహం కావడానికి పూర్వమే నేను బి. ఏ. ప్యాసై, టీచరు ట్రైనింగు పొందాను. అప్పుడు నా భర్త ఒక వ్యాపారం చేసేవారు. లేమి అనేది లేకుండా చాలా హాయిగా ఉండేది.

కొంతకాలానికి వ్యాపారంలో చాలా నష్టం వచ్చింది. అది మానుకొని ఆయన ఒక ఉద్యోగంలో ప్రవేసించా లని నిశ్చయించుకున్నారు. కానీ ఆయన ఇంటర్‌మీడియట్ వరకే చదివారు. ఆ చదువుకి సరైన ఉద్యోగం రాదు. అందుచేత ఇంకా పెద్ద చదువులు చదవాలని నిర్ణయించు కున్నారు.

మేం ఉన్న ఊళ్ళోనే టీచరు ఉద్యోగంలో చేరతా నన్నాను నేను. ఎలాగయితేనేం ఆయన్ని ఒప్పించాను. ఉద్యోగంలో ప్రవేశించాను. నేను సంపాదించేది మాకు బాగానే సరిపోయేది. ఎందుకేనా మంచిదని ట్యూషన్లు చెప్పేదాన్ని.

ఇంట్లో ఇబ్బంది లేకుండా గడవడం వల్ల ఆయనకు ఉత్సాహంగా ఉండేది. బి. ఏ. చదువుతూ ఉండేవారు. ఇదివరలో ఆయన చేసిన వ్యాపారాన్ని పూర్తిగా వదిలిం చేసు కోవడంవల్ల కొంత డబ్బుకూడా మా చేతికి వచ్చింది,

బి. ఏ. పూర్తిచేసిన తరువాత బి. టి. క్లాసులో చేరారు. సంవత్సరం గడిచేసరికి నాకు మల్లేనే ఆయనకూడా అధ్యా పకత్వం స్వీకరించారు. మంచి జీతం చక్కటి ఉద్యోగం దొరికింది.

తరవాత. ఇంక ఉద్యోగం మానెయ్యమని నన్ను బలవంతం చేసి నంత పనిచేశారు. ఆయన మనస్సును కనిపెట్టి నేనూ అందుకు అంగీకరించాను. కొన్ని మాసాలు గడిచేసరికి ఆయన తనకు ఎం. ఎ. ప్యాసవ్వా లని వుందన్నారు. మళ్ళీ వదులుకున్న ఉద్యోగంలోనే నేను తిరిగి ప్రవేశించాను. ఆయన కాలేజీలో చేరారు. ఎం. ఎ. చదవడం ప్రారంభించారు. రెండు సంవత్సరాలు పట్టింది పూర్తి అయ్యేసరికి.

క్రిందటి సంవత్సరమే ఆయన ఎం. ఎ ఫస్టు క్లాసులో ప్యాసయ్యారు. వెంటనే లెక్చరర్‌గా ఒకమంచి ప్రభుత్వో ద్యోగంలో ప్రవేశించారు. త్వరలోనే ఆయన గెజిటెడ్ ఆఫీసరు అయ్యే అవకాశాలున్నా యంటున్నారు. నా ఉద్యోగం ఈ విధంగా ఆయన అభివృద్ధికి తోడ్పడినందుకు నాకు చాలా సంతోషంగా వుంది.

గడచిన ఈ నాలుగు ఏళ్ళపాటు మే మిద్దరం ప్రాణ స్నేహితుల్లాగ - ఒకరి కొకరు సహాయం చేసుకొనే అప్పుల్లాగ గడిపాం. సాయంకాలం మేం చల్లగాలిలో షైరు వెళ్ళేవాళ్ళం.

మాకు ఉన్న ఇద్దరు పిల్లలయందు మేము ఎటువంటి అశ్రద్ధా చూపలేదు. వాళ్ళని నిర్లక్ష్యం చేయడం అన్న ప్రశ్నే లేదు. వేళకి అన్నం పెట్టేదాన్ని. బట్టలు తొడిగే దాన్ని. టైమయ్యేసరికి బడికి పంపుతూ వుండే వాళ్ళం. వాళ్ళ చదువులు గురించి కూడా మే మిద్దరం తగిన శ్రద్ధ తీసుకున్నాం.

కష్టించి పనిచేసుకున్న ఈ నాలుగు సంవత్సరాలు మా యిద్దరిని మరింత ఆత్మీయుల్ని చేశాయి. త్వరలో ఒక చక్కటి ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాం. మా పెద్ద పిల్లాడిని తగిన వయస్సు రాగానే మంచి ప్రామాణికమైన స్కూలుకు పంపిస్తాం.

మనలో చాలామంది అత్యవసరమైనప్పుడు స్నేహితుల దగ్గర అప్పు తీసుకుంటూ వుంటాం. నా వల్ల జరిగిన

స్త్రీలు : ఉద్యోగాలు

పుట్టుటయెగాని పూవేమి పొందగలిగె?

* శ్రీ వెంకట పార్వతీశ్వరకవులు *

ఆమె :
చెట్టునకు మొగ్గ దొడిగెడు చేష్టగలదు,
కోరకమునకు వికసించు గుణముగలదు,
విరికి వలపుల వెదజల్లు విద్యగలదు ;
వలపునకు గుభులొక్కను నలవాటు గలదు ;
ఇట్టి సౌభాగ్యమంతయు నెందుకొరకు ?

అతడు :
తీగ సాగిన తొలికారు తీపి పెనుప,
మొగ్గ దొడిగిన మలికారు మురువుగొలుప,
దళము విరిసిన క్రొక్కారు తళుకులొలుక,
ననుచు వలపుల విరిదోట మనువఁగాదె

ఆమె :
లలిత పరిమళతతి వాయువులు హరించు,
మధుర మకరంద రసము బంభరముగ్రోలు,
తత ఫలోదయమునకె జీవితము గడచు,
పుట్టుటయెగాని పూవేమి పొందగలిగె ?

అతడు :
తరపి తేనెల తృషితాళి తనిపి తనిపి,
అలరు నెత్తావి నాశల నాక్రమించి,
సుకృత సత్ఫల సంపద చూరగొన్న
పూత చారిత్ర పూవేమి పొందలేదు ?

భర్తకు ఉన్నత విద్యకు తోడ్పాటు.

(45 వ పేజీ తరవాయి)

"సహాయం" కూడా మా ఆయన అదేవిధంగా చూస్తున్నారు: ప్రతినెలా ప్రత్యేకంగా కొంత డబ్బు నా చేతికి ఇస్తున్నారు – ఏదో ఖచ్చితంగా నా బాకీ నాకు తీర్చివేస్తునట్టు, ఋణం తీర్చుకుంటునట్టు!

నా జీతంవల్ల – మాకు సరైన ఆహారం దొరుకుతోంది. మంచి గృహవసతి దొరికింది, నేను ఉద్యోగంలో చేరడానికి 'అభిమానపడి' చేరకపోతే మా పాట్లు ఎల్లా ఉండేవో.

అందుచేత ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రులకు నాదొక్క విన్నపం. ఆర్థికంగా స్వతంత్ర జీవనాన్ని ఇవ్వగలిగే ఏదో వొక వృత్తిని మీ పిల్లలకు చెప్పించండి. ఆడపిల్లలు తమ కాళ్ళమీద తాము నిలబడ గలిగేటట్టు చేయండి. మీరు అలాచేస్తే అవసర సమయాల్లో వాళ్ళ భర్తకు తోడు నీడగా వాళ్ళు ఉండగలుగుతారు. వాళ్ళ జీవితాలు నిరాటంకంగా హాయిగా సాగిపోతాయి.

ఉద్యోగం చేస్తున్నాం కదా అని ఏ స్త్రీ కూడ తన ధర్మాన్ని మర్చిపోకూడదు. ఇల్లు చక్కబెట్టుకుంటూ వుండాలి, భర్తను ఉత్సాహ పరుస్తూవుండాలి. పిల్లలను నిర్లక్ష్యం చెయ్యతగదు. అన్నిటికంటే కూడా తన ఆరోగ్యం విషయంలో ఎక్కువ మెలకువతో వ్యవహరించాలి.

అలవాటు

★

శ్రీమతి సి. హెచ్. అరవిందాదేవి.

మన అలవాట్లను బట్టే మన ఊహలు, చర్యలు, నడవడి ఉంటుంటాయి; వాటినిబట్టే మనం ఎలాంటి వారమో, లోకం నిర్ణయిస్తూ ఉంటుంది. జీవితంలో చిన్నప్పుడే మంచి అలవాట్లు అలవర్చు కొందుకు ప్రయత్నించాలి. అలవాట్లు మంచి వైనా, చెడ్డవైనా, ఒకసారి ఏర్పడ్డాక వాటిని విడిపించు కొందుకు చాలా ప్రయాస పడాలి. అలవాట్ల ప్రభావాన్ని నచ్చచెపుతు ఒకసారి మా నాన్నగారిలా బోధించేరు: "ఇంగ్లీషులో అలవాటును HABIT అంటారు. దింట్లో కొంత (H) వదుల్చు కున్నామనుకోండి, ఇంకా కొంత A-BIT ఉండనే వుంటుంది. ఇంకా కొంత (A) వదుల్చు కొన్నా 'కొంచెం' BIT ఉంటుంది। మరికొంత (B) వదుల్చుకున్నాకూడా IT'అది' ఉండనే ఉంటుంది।। అలవాట్ల ప్రభావం అలాంటిది"

అందుకే ఎప్పుడూ 'మంచి' అలవాట్లే అలవర్చుకోవాలి. చెడ్డవారినీ, చెడ్డ అలవాట్లనూ తెలియక చేరదీసినా తెలుసుకున్న వెంటనే వదల్చు కోవాలి. పట్టుదలతో తరిమేస్తేగాని అవి ఒక పట్టునపోవు. ఒకాయన రామకృష్ణ పరమహంస నడిగారట "నేను ప్రార్థన దగ్గర కూర్చున్నా పూర్వపు పాడు తలంపులే యింకా వస్తున్నాయి. దీనికేమిటి మార్గం" అని. అందుకు వారి జవాబు "మీరు చాలా కాలంగా ఆ తలంపులనే జేరదీసేరు. ఒక్కసారిగా ఎలాపోతాయ్? మీ కుక్క చూడండి, దానిమీద మీకు మక్కువ తగ్గి, తన్నేస్తున్నా మళ్ళీ తయారవుతుంది. వచ్చినప్పుడల్లా తన్నుతుంటే గాని కొంత కాలానికి మిమ్మది విడిచి పోదు. తలంపులూ అలవాట్లూ అంతే."

మానవులనగానే కొన్ని అలవాట్లకు అలవడి వ్యవహరించే జీవులు. మన నిత్యజీవితంలోని చర్యలు, ఊహలు గూడ పూర్వపు అనుభవాలు, అలవాట్ల వల్ల నిర్ణయింపబడి, మనకు పూర్తిగా స్మృతి పథంలోకి రాకుండానే అలా జరిగి పోతుంటాయి. ప్రొద్దుట దైవ ప్రార్థనతో లేవడం, పళ్ళుతోముకోవడం, తతిమ్మా కాలకృత్యాల్ని నిర్వహించుకోవడం వగైరాలన్నీ కొన్ని అలవాట్ల ప్రకారం యథాతథాగా సాగిపోతుంటాయి. అలవాట్లకు ఎంతైనా ప్రభావం ఉంది. పొగత్రాగుడూ, మద్యపానం అలవాట్లున్న వారిని చూడండి. మనుష్యులు వీటికి దాసులై చరిస్తుంటారు. అందుచేతనే చిన్నప్పటినుంచీ మంచి అలవాట్లు అలవర్చుకోవాలని తల్లి తండ్రులు, మేష్టర్లు, పెద్దలూ అలా అనేక విధాలుగా నూరిపోస్తుంటారు.

మంచి అలవాట్లవల్ల మనం ప్రపంచంలో మంచి వారిగా పరిగణింప బడ్డమేగాక, మనశరీర మానసికారోగ్యాలు మన జీవితంకూడా వాటిపైనే అధారపడి వుంటుంది. ఆరోగ్య జీవన సూత్రాలు – పరిశుభ్రమైన గాలి, మంచి నీరు, సాత్వికాహారం, నిరాడంబర వస్త్రధారణ, శుచిగానుండే గృహం, తగువ్యాయామం వగైరాలు, వీటీతోబాటు ఆనందంగా ఉండడం, మంచితలంపులు, సంఘీభావం, దేశభక్తి, పెద్దలయెడ వినయం, పరోపకారం, ప్రేమ, దైవచింతన వగైరాలు మానసికారోగ్యానికి ఆవశ్యకం. వాటిని సరిగా చిన్నప్పటినుంచీ అలవర్చు కున్నవారు ఆరోగ్య వంతులై, సజ్జనులై, ప్రజామోదాన్ని పొందుతుంటారు. వీటి నుల్లంఘించినవారు ఆరోగ్యం కోల్పోయి, దుర్జనులై, లోక కంటకు లౌతారు. అలవాట్లే మనం, ఎప్పుడూ ప్రతివిషయంలోనూ - తిండి, వస్త్రధారణ, విహారం, సాంగత్యం, సంభాషణ, తలంపులు, ప్రవర్తన మొదలైన విషయాలన్నిట్లోనూ చక్కటి అలవాట్లు ఏర్పరుచు కోవడం చాలా ముఖ్యం.

మంచి అలవాట్లకంటే చెడ్డవి చప్పున పట్టు బడతాయి గనుక మరీ జాగ్రత్త అవసరం. ఇదే ఒకసారి గాంధీజీని ఒకరడిగితే "మెట్లు ఎక్కడం కష్టంగాని, దిగడం సులువేగా! పతనానికేమి యిట్టేపడొచ్చు - పొడవ్వొచ్చు. పైకి సాగడం, ప్రయోజకులవడం ప్రయత్నాలతో కూడుకొని వుంటాయి" అని ఆయన సహజ మాధురీ రీతిని మారుబలికేరు. ఇవి ఆయన జీవితంలో స్వానుభవం అన్న మూసలోనుంచి రాలిన బంగారు తునకలు. చిన్నప్పుడు దుర్జన సాంగత్యం. దురలవాట్లు ఆయన్ని ఎంత వరకూ తీసుకెళ్ళేయో, బాధించాయో, మర్మం లేకుండా చెప్పి మనకందరికీ మరువరాని గుణపాఠాలు నేర్పేరు. ఆ సత్యసంధత, ఆ తాలిమి, ఆ అహింస, ఆ విశ్వమానవ సౌభ్రాత్రత, ఒకటేమిటి భారత దేశంలోని మహామహుల "సద్గుణంబులెల్ల సంఘంబులై వచ్చి" సమ్మిశ్రత జెంది లోకోత్తర ప్రతిభా సంపన్నుడైన "మహాత్ము"డై, లోకానికే ఆదర్శకుడయ్యేటట్లు చేసేయి. ఆయన ప్రయత్నించి, చర్యల్లోను, తలంపుల్లోను అలవర్చుకున్న అలవాట్లేగదా

అలవాటు

ఆయన్ని అంతవారినీ, ఆయన్ని కన్నభారతాంబ నంతటి దాన్నీ జేసేయి.

అలా మంచివార్ని ఆదర్శంగా, తీసుకొని, వారిలోని మంచి గుణాల్ని స్మరిస్తూ, ఆలోచిస్తూ అలాంటివి అలవర్చుకొందుకు అంతాకూడా ప్రయత్నించడం తమకూ, తమవారికీ, తమ దేశానికీ కూడా శుభావహం.



బిడ్డలు - తల్లిదండ్రులు

బిడ్డల పెంచుటలో తల్లిదండ్రులకు తర్ఫీదు

* శ్రీ కె. వెంకట్రామయ్య *

పెద్దవారికి పిల్లలయెడగల యభిప్రాయములలోను, భావములలోను, నేటికాలమున నొక గొప్ప మార్పు గన్పట్టుచున్నది. నలుబది ఏబదియేండ్లకు పూర్వము "శిశు పరిశీలన" తలిదండ్రులకవసరమని జెప్పిన వారునవ్వి యుండెడివారు. ఏలయన బిడ్డ పుట్టగనే తల్లికి ఆ బిడ్డను పెంచు జ్ఞానము సహజముగ నలవడునని వారి యభిప్రాయమైయుండెడిది. ఇప్పటికిని ఆ నమ్మకము వారిలో జూడనగును. కాని అది క్రమముగా మారుచున్నది.

శిశువును పెంచుటకవసరమగు జ్ఞానసంపత్తి తలిదండ్రులకు సహజముగనేయలవడు ననుకొనుట వట్టి పొరబాటు. అదే నిజమైనచో బిడ్డలవలనవారికి కష్టములే యుండవు. బిడ్డలను వారు తరచుగ శిక్షించుటయును, శిక్షించియు ఫలితమును బొందకుండుటయును జరుగవు. చాలమంది పిల్లలు చెడుత్రోవల బడుటయు, నిష్ప్రయోజకులగుటయు మనము చూడబోము. పిల్లల దుర్గుణములు మాన్ప ప్రయత్నించిన కొలది నవిపెంపొందు వింతను గనము. కడుశ్రద్ధతో బిడ్డలను పెంచినను వారు చెడ్డవారుగ తయారైన యెడల చెడు స్వభావమువారికి సహజమేయై యుండవలెనని తలిదండ్రులనుకొనవచ్చును.

కాని ఈకాలపు తలిదండ్రుల తలంపులు వేరైయున్నవి. బిడ్డ జీవించుట తమకొరకును తమ యింటికొరకేయని వారను కొనుటలేదు. గృహమును, కుటుంబమును గూడ బిడ్డకొరకేయని వారు గ్రహించుచున్నారు. దీనిని బట్టి బిడ్డనింటి యందును, కుటుంబమునందును, విచ్చలవిడిగ నుండనీయవలెనని మనమనుకొనరాదు. బిడ్డ పుట్టుకకు తలిదండ్రులే కారకులుగనుక, ఆ బిడ్డ సంపూర్ణాభివృద్ధి బొందుటకనువగు వసతిని జేకూర్చు బాధ్యత వారిదేయని తెలిసికొనవలెను. శిశువులకు తమయెడ సంపూర్ణ విశ్వాసముండునట్లు తలిదండ్రులు ప్రవర్తించుచుండవలెను. వారు శిశు మనస్తత్వమును బాగుగ తెలిసికొనగలిగి యుండవలెను. బిడ్డయెడ సానుభూతిని గలిగి ప్రవర్తింపవలెను. ఈ విషయము లందెట్టిలోపములున్నను పిల్లల ప్రవర్తనా సమస్యలను వారెదుర్కొనక తప్పదు. అట్టి సమస్యల నెదుర్కొనుటకు తగిన సహాయమును తలిదండ్రులకు చేకూర్చుటకే "తలిదండ్రుల బోధనోద్యమము" (Parents Education Movement) బయలుదేరినది. నేటికాలపు తలిదండ్రులు తామే నీతిపరులమను భావముతో తమ బిడ్డలయెడ ప్రవర్తింపరు. బిడ్డల నన్నివిధముల నర్థము జేసికోనుటకే యాశింతురు. మరియు ప్రయత్నింతురు.

శిశుపాలనము తలిదండ్రుల వృత్తి :

ఎవరి వృత్తికి తగిన శిక్షణ వారి కొసగుట యవసరమని మానవు లాది నుండియు గ్రహించియే యున్నారు. వడ్రంగి, వైద్యుడు, శాస్త్రజ్ఞుడు, కృషికుడు మొదలగు వారందరును శిక్షణను బొందవలసినవారేయై యున్నారు. విద్యను గరపుటయు, "శిశుపాలనము"ను గూడ వృత్తులే యగును. ఇవి వృత్తులలోకెల్ల చాల ముఖ్యమైనవి. ఐనను శిక్షణ బొందవలసినవారిలో నుపాధ్యాయుడును, తలిదండ్రులును, కడపటివారగుట ఎంతయు శోచనీయము. ఉపాధ్యాయుడు తాను బోధించు విషయములందేగాక "శిశు స్వభావము"ను దెలిసికొనుటయందు గూడ తగిన శిక్షణమును బొందవలెనని "కిండర్‌గార్డెన్" స్థాపించిన ఫ్రోబెల్ మహాశయుడును, ఇతర విద్యాసంస్కర్తలును చాలకాలము క్రిందనే జెప్పిరి. దానియవసరము నిప్పుడందరు నొప్పుకొనుచునే యున్నారు. కాని తలిదండ్రులకు గూడ బిడ్డలను పెంచుటలో శిక్షణమవసరమను విషయ మింకను తగినంత ప్రచారమును బొందవలసియున్నది. ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు దేశములందు శిశు సంరక్షణ విషయములలో తల్లులకు తగిన శిక్షణము నొసగుటకును, సహాయపడుటకును, సలహానిచ్చుటకును, "శిశుసంరక్షణాలయము"లు స్థాపింపబడి యున్నవి. వీని వలన తల్లులు తమ బిడ్డల శరీర సంరక్షణ విషయము లందు తగిన తర్ఫీదును పొందుచునే యున్నారు.

బిడ్డయవసరములు కేవలము శరీరమునకు జెందినవే గావు. అవి మనస్సునకును, భావములకును గూడ చెంది యున్నవి. శిశువునకు శీలమును, మూర్తిత్వమునుగూడ నున్నవి. ఇవియు నభివృద్ధి జెందవలెను. వీనిని దెలిసికొనుటకు సూక్ష్మగ్రహణ శక్తియు, శిక్షణయు చాలముఖ్యము.

శరీర విషయములందు కడుశ్రద్ధ దీసికొన్నను ఒక్కొక్క శిశువు చిరచిరలాడుచుండుటకు కారణమేమి? అనుకొనకుండ మరియొక బిడ్డ భోజన స్నానాదిక విషయములందు బాధించుటకు కారణమేమి? ఎప్పుడు సంతోషముగా నుండు బిడ్డ తటాలునవస్తువులను పగులగొట్టుచుండుటకు కారణమేమి? ప్రతి దినమును బిడ్డలవలన తలిదండ్రుల కిట్టిసమస్యలే, యెన్నో గలుగుచుండును. కాని ఇట్టి సమస్యలకు గల కారణములను వారు గ్రహింపలేక ఎంతయు బాధపడుచుందురు. అట్లు బాధపడకుండ నుండవలెనన్న బిడ్డల మనోవృత్తులను తలిదండ్రులు బాగుగ తెలిసికొనవలెను. చిన్న బిడ్డలు తమ యూహలను, ఉద్దేశ్యములను మాటలలో జెప్పుకొనజాలరు. అట్లగుటచే, వారి మనస్సులోనేమున్నదియు దెలిసికొనుట చాల కష్టము. ఐనను తగిన ఇంగితజ్ఞానమును, సానుభూతియు, మనకున్నయెడల బిడ్డల ప్రవర్తనలను బట్టి వారి నర్థము జేసికొనవచ్చును. బిడ్డల నర్థము జేసికొన్నచో వారు సంతోషముగా నుండగలరు. అప్పుడు సమస్యలే ఉండక పోవచ్చును.

తలిదండ్రులు తమ బిడ్డలను బెంచుట నొకవృత్తిగా భావించి తగిన శిక్షణమును బడయుట యవసరమని పై కారణములే మనకు జెప్పుచున్నవి. మన గృహ నిర్మాణములకే శిక్షణనొసగి శిల్పులను తయారు జేసికొనుచున్నాము. అట్టియెడ మానవశీలమును మూర్తిత్వమును నిర్మించు తలిదండ్రులకు తగిన శిక్షణనిచ్చుట ఎంత యవసరమో వేరుగ జెప్పనక్కరలేదు.

తలిదండ్రులు మేలుకొనుచున్నారు:

తలిదండ్రుల బోధనోద్యమమింకను శీఘ్ర గతిని సాగుటలేదు. ఐనను దాని ఫలితములప్పుడే గన్పట్టుచున్నవి. తలిదండ్రులలోననేకులు మానసిక శాస్త్ర గ్రంథములను పఠించియు, నవలలను, పత్రికలను చదివియు, రేడియో సంభాషణలను వినియు, పిల్లలను గూర్చిన విషయముల నెన్నిటినో దెలిసికొనుచున్నారు. మానసిక శాస్త్రము సంపూర్ణమే యైనను, పిల్లల ప్రవర్తనను పరిశీలించుటలో నది తలిదండ్రులకెంతయు తోడ్పడుచున్నది. కొన్ని సందర్భములలో తలిదండ్రులు తమ్ము దామే పరిశీలించుకొనుచు బిడ్డల క్షేమమునకై తమ ప్రవర్తనలను సవరించుకొనుచున్నారు. మరియు శిశు నిర్వహణమందలి కొన్ని సామాన్య దోషములను వారు గ్రహించి అవి లేకుండ జేయుటకై ప్రయత్నించుచున్నారు. ఆ దోషములేవన—

(1) నిశ్చితోద్దేశములేని విద్యా విధానము

(2) బిడ్డల దృక్పథమునర్థముజేసికొనకుండుట

(3) ఎదిగెడి బిడ్డలకేవయస్సునందెట్టి యవసరములు గలుగునదియు దెలిసికొనకుండుట.

(4) క్రమశిక్షణను గూర్చిన తప్పభిప్రాయములు.

(5) తలిదండ్రులకేకాభిప్రాయమును అన్యోన్యతయు లేకుండుట ఇక వీనిని గూర్చి మనమిచట కొంచము వివరముగా పరిశీలించి చూతము.

(1) విద్యా విధానము యొక్క ముఖ్యోద్దేశము:

బిడ్డలు బడిలో చేరినంతనే వారిచదువారంభమగుననియు, బడి పాఠములను నేర్చుకొనుటయే చదుయువని చాలమంది యభిప్రాయమై యున్నది. మరియు బిడ్డలెదిగి ఉన్నత పాఠశాలకుబోయి పిదప కళాశాలలో జదివి పెద్ద పరీక్ష ప్యాస్‌కాగానే చదువు ముగియునని వారనుకొందురు. కాని బిడ్డలు బడి పాఠములనేగాక ఇంకను ఎన్నో విషయముల నేర్చుకొనవలెను. ఇతరులతో కలసి మెలసి సంతోషముగానుండుట, స్వయముగా నాలోచించుట, నిర్ణయించుకొనుట, స్వతంత్రముగానుండుట, ధైర్యము కలిగియుండుట, మొదలగు విషయములు బిడ్డల కతిబాల్యమునందే యలవడ జేయవలెను. అట్టి గుణములనలవరచుటకూడ విద్యా విధానములో నొక ముఖ్య భాగమై యున్నది.

స్వతంత్రముగానుండుట, ధైర్యము కలిగి యుండుట, నిజము పాటించుట, ఇతరులతో కలసి మెలసియుండుట మొదలగు మంచి గుణములను బిడ్డలకలవరచు తలిదండ్రులు బడిలోని ఉపాధ్యాయులకన్న నెక్కువ కృషియే చేయుచున్నారని చెప్పవలెను.

నిజమైన విద్యా విధానము బిడ్డ తొట్టెయందుండగనే యారంభమగును. అది బిడ్డబాల్య యవ్వన దశలు గడచు వరకు సాగుచునే యుండును. మరియు నట్టి విద్యకు గల లక్ష్యమేమన బిడ్డ మనశ్శరీరం శీల స్వభావాదులకు తగిన లక్షణ నొసగుచు అతనిని సంపూర్ణాభివృద్ధిని జెందినవ్యక్తిగను, సంతోషముగ నితరులతో సహకరించు సంఘ జీవిగను తయారు చేయుటయే యైయున్నది.

(2) బిడ్డ యొక్క దృక్పథము:—

శిశు నిర్వహణము సరిగా కొనసాగవలెనన్న మన మెన్నో విషయములను గూర్చి విచారింపవలసియుండును. ఐనను బిడ్డల దృష్టినుండి విషయములను జూడగలుగుట అన్నిటి కంటెను చాల ముఖ్యము. ఇది అందరకును సాధ్యమగు పనిగాదు. కాని బిడ్డ లెదుగు విధమును గూర్చి బాగుగ తెలిసికొన్నచో, మనకది కొంత వరకు బోధపడగలదు.

భౌతిక ప్రపంచమందలి వస్తువులను జూచుటయందే బిడ్డలకును మనకును ఎంతో భేదముండును. రెండున్నర సంవత్సరముల బిడ్డ దృష్టినుండి మనమీ ప్రపంచమును జూచిన, అది యెంతో వేరుగ నగుపడగలదు. కుర్చీలు కూర్చుండుట కెంతో యెత్తుగా నుండును. మేజా యంచు లను మించి మనము చూడలేము. చిన్న కుక్కయు నెంతో పెద్ద జంతువుగా గోచరించును. తండ్రి మనకంటె నెన్నో రెట్లు పెద్దవానిగ దోచును. ఇట్లే చిన్న బిడ్డల దృష్టికి అన్నియు పెద్దవిగా నగుపడుచుండును. వారు తమ జీవిత మును చాల వరకు వారియెక్కయు, కుర్చీ మేజాల యొక్కయు కాళ్ళ మధ్యనే గడుపుచున్నారనిపించును. వారు బాహ్య ప్రపంచమునే దృష్టితో జూచుచుందురో అట్లే ఇతరుల చేష్టలను, ప్రవర్తనలను గూడ జూచు చుందురు.

బిడ్డలకు మనకువలె తప్పొప్పులు తెలియవు. అను భవమును లేదు. మనమిది తరచు మరచి, తెలియక పశితనముచే, జేసిన పనులకు వారిని దండించుచుందుము. తప్పని తెలియని దానికి వారిని దండించినప్పుడు వారికి మన న్యాయ బుద్ధియందు నమ్మకముండదు. అట్టి దండన లధికమగు కొలది బిడ్డలు మనల నెక్కువగా బాధించుచుం దురు. చేసిన తప్పు ఉద్దేశరహితమై, పొరబాటు మాత్రమే యైనప్పుడు బిడ్డలను దండించుట చాల అన్యాయము. దానివలన వారికి మనయెడ నెంతో కోపమును, ద్వేష మును జనించునేగాని పశ్చాత్తాపమెంత మాత్రమును కలుగదు. కాబట్టి పిల్లలను పరిశీలించునపుడు వారి చర్య లనేగాక ఉద్దేశ్యములను గూడ తెలిసికొనుట చాల ముఖ్యము. లేనిచోవారికి మనయందలి నమ్మికచెడును. నమ్మకమున్నంతకాలమే బిడ్డలు మనలను ప్రేమింపగలరు. వారి ప్రేమయే మనకు ముఖ్యమగునెడ ఆ నమ్మికకు భంగకరమగు పరిస్థితులేర్పడకుండ జూచుకొనుటయే మన కర్తవ్యము.

(3) బిడ్డల అవసరములను దెలిసికొనుట :

బిడ్డలెదుగునపుడు ప్రతిదశయందును వారికి కొన్ని ప్రత్యేకావసరము లేర్పడుచుండును. వీనిని పెద్దలు గ్రహింపకపోయిన యెడల బిడ్డలువారిని బాధింపగలరు. ఆహారము, నిద్ర, తగిన ఉష్ణము బిడ్డలకవసరమను సంగతి అందరకును దెలిసినదే. కాని బిడ్డకు శరీర సంబంధమగు అవసరములేగాక మనస్సునకును, భావ ములకును సంబంధించిన యవసరములుగూడ గలుగు చుండును. వీనిని గూడ పూర్తిగా సంతృప్తి పరచినగాని బిడ్డ శరీరమును, మనస్సును భావములును (Emotions) సంపూర్ణారోగ్య స్థితియందుండ జాలవు.

బిడ్డలు శరీరావసరములను దీర్చుకొనుటకు ప్రయత్నిం చునట్లే, మనస్సునకును, భావములకును జెందిన యవసరములను దీర్చుకొనుటకు గూడ ప్రయత్నింతురు. ఈ విషయము వారి చర్యలను సరిగా గమనించినచో తెలియగలదు. మూడేండ్ల బిడ్డయొకడు దండనలకు లెక్క సేయక ఇంటినుండి పారిపోవుటకారంభించెను. అతడా విధముగనేల ప్రవర్తించు చుండెనో మనమాలోచించి చూతము. బిడ్డకు చాల రకముల ఆట వస్తువులున్నను వానియం దతనికిష్టములేక పోవచ్చును. పోవలెనను బుద్ధి ప్రబలమై దండనలయెడ భయమతనిని నాపలేకున్నది. ఇట్లతనిని ప్రేరేపించునదేమై యుండగలదు ? అతని కాటవస్తువులున్నను అవి యాంత్రికములో, మెత్తని, జంతువుల బొమ్మలో యగుటచే అతని వయస్సునకు తగినవి కాకపోవచ్చును. అతని యాటవస్తువులు లాగుట, త్రోయుట, త్రవ్వుట, దిగగొట్టుట మున్నగు పనులకనువై యుండవలెను. పెద్దకండరములకు పని కల్పించునవి కావలెను. ఊహనుపయోగించుట అవసరమగు ఆట వస్తువులా వయస్సు బిడ్డకు పనికిరావు.

ఆటవస్తువులు సరియైనవే యనుకొందము. కాని అత డొంటరి బిడ్డకాబోలు. లేదా కుటుంబములో నితరపిల్ల లందరు బడికిబోవువారై యుండవచ్చును. ఇంటనింకొక శిశువున్నను తనతో నాడు వయస్సు లేనివాడగుటచే, నా బిడ్డ తగిన జతగానికై వెదకుచుండవచ్చును. ఏలయన

బిడ్డలకు రెండు, మూడేండ్లు రాగానే అదే వయస్సు గల ఇతర పిల్లల సహవాస మవసరమగును. బిడ్డ ఇంటినుండి పారిపోవుటకింకొక కారణముగూడ నుండవచ్చును. అతనికి క్రొత్తగా తమ్ముడో, చెల్లెలో పుట్టెనను కొందము. అప్పుడు తల్లి అతనియెడ పూర్వము జూపినంత ప్రేమ జూపకపోవుటచే ఆమె ప్రేమయందు అతనికి నమ్మికచెడి యావిధముగ నితరులయిండ్లకేగ వచ్చును. అట్టియెడ బిడ్డపై నెక్కువమక్కువ జూపుచూ, నా తల్లి నన్నెప్పటి యట్లే ప్రేమింపగలదను భావమతనికి గలుగజేయుట యవసరము. దండనలచే నతడు మరింత బాధపడునేగాని ఎట్టి ప్రయోజనమును గలుగబోదు.

బిడ్డలకు వారి వయస్సును బట్టి కొన్ని ప్రత్యేకావసరములు గలుగుచుండునని మనము తెలిసికొనియున్నాము. ఈయవసరములను దీర్చుట మన విధియైయున్నది. మన మొకవేళ వానిని దీర్చకున్న యెడల బిడ్డలే వానిని దీర్చుకొనుటకు ప్రయత్నించుచుందురు. కాని వారి ప్రయత్నములు తరచు తప్పుత్రోవలబడి ప్రవర్తనా సమస్యలకును, నాడీవ్యాధులకు దారి దీయుచుండును. ఎదిగెడి బిడ్డలకెట్టి యవసరము లేయేదశలయందు గలుగు చుండునో, వానిని దీర్చుట యెట్లో రాబోవు అధ్యాయములలో చర్చింపబడును.

(4) క్రమశిక్షణను గూర్చిన తప్పభిప్రాయములు:—

దీనిని గూర్చి గూడ పైయధ్యాయములలో ప్రత్యేకముగా వ్రాయపడినది. ఒక్క విషయమును మాత్ర మిచ్చట జెప్పుచున్నాము. అది ఏమనగా శిక్షణ పద్ధతులు అసంగతములును, అవిరుద్ధములునుగాక ఏక రీతిగ నుండుట చాల యవసరము. తలిదండ్రుల శిక్షణా విధానమీరీతిగ లేని యడల బిడ్డలు తరచు వారిమాట వినక ఎదిరించుచుందురు. తమ బిడ్డ డొక విధముగ నుండిన బాగుండునని తలి దండ్రు లొకప్పుడనుకొందురు. తిరిగి మనసు మారగనే వేరొక విధముగ తలంచుచుందురు. ఇట్లు తమల్లో స్థిరత్వమును, నిశ్చితాభిప్రాయములును లేక పిల్లలను నిర్వహించుటకు తగిన విధానమును వారు తెలిసికొన జాలకుందురు.

బిడ్డల దైనిక జీవనమునందు క్రమవిధానముండవలెను దానివలన వారు మానసికముగను శారీరకముగను గూడ నారోగ్యమును బొంది మనలను కష్టపెట్టకుందురు.


ఈకాలపు తల్లులు చాల మంది తమ బిడ్డలను బెంచుటలో నొక క్రమవిధానము ననుసరించుచునే యున్నారు. కాని బిడ్డ యెదుగగనే వారాక్రమ విధానమును పాటించుట నంత ముఖ్యముగా తలంచుటలేదు, దాని వలన బిడ్డ భుజించుట, నిద్రించుట, మొదలగు విషయములందు తన యిష్టప్రకారముండుట కటస్థించుచుండును. మరియు నతడు తల్లి మాట వినక తన మాట చెల్లించుకొనుట కప్పుడప్పుడు ప్రయత్నించుచుండును. అట్టి సమయములందు తల్లి కేమిచేయుటకును తోచక బిడ్డ పట్టు చెల్లింపవచ్చును. లేదా బిడ్డ తల్లిని బాధించుటయు, ఆమె కొట్టుటయు, అత దేచ్చుటయు జరుగగలవు.

ఇట్టి సందర్భము లెక్కువైనకొలది తల్లిని తా నొకప్పుడు ధిక్కరింపగలననియు, మరియొకప్పుడు ధిక్కరింపలేననియు బిడ్డ తెలిసికొనును. మరియు తల్లి మంచిగానున్న సమయములలో తానేది చేసినను ఆమె ఊరకుండగలదని గూడ బిడ్డ గ్రహించును. తల్లి యెడగల యభిప్రాయమే తండ్రి యెడను అతనికి గలుగును. తలిదండ్రులకు తప్పొప్పుల విషయమై నిశ్చిత భావములున్నవని అతనికి తోచదు. తప్పొప్పులు వారి మనస్థితులనుబట్టి మారుచుండును. ఇట్టి అనుమాన పరిస్థితులలో మెలగుట బిడ్డలకెంతయు కష్టముగా దోచవచ్చును. తా మేదిచేయవచ్చునో ఏది చేయగూడదో బిడ్డలకు సరిగా దెలియక ఎంతో బాధపడుదురు. ఒకేపనిని తలిదండ్రు లొకదినమునచేయ నిత్తురు, మరియొకదినమున చేయరాదందురు, ఇట్లగుటచే బిడ్డల కేమిచేయుటకును తోచక తలిదండ్రుల నెదిరించి కష్టపెట్టుచుందురు. బిడ్డలు తమ్ము బాధింపక, సంతోషముగా నుండి, సరిగా మెలగవలెనని పెద్దవారాశింతురేని తమ్ము దామే శాశించుకొనవలెను. మరియు వారి ప్రవర్తనములు పరస్పర రానుగుణ్యములును, బిడ్డల కాదర్శ ప్రాయములును ఐయుండవలెను.

(5) తలిదండ్రులన్యోన్యతగలిగి యుండునవసరము :—

బిడ్డజనించిన కొన్ని నెలల వరకు తల్లియే చాల ముఖ్యము, అతడు నడచుట కారంభించి నప్పటినుండియు తండ్రికిగూడ నొక ప్రత్యేక స్థానమేర్పడును. ఐనను ఈ కాలపు తండ్రులు కొందరు మొదటినుండియు పశి బిడ్డల శరీర సంరక్షణ విషయములందు తల్లులతోబాటు తాము పాల్గొనుచున్నారు.

[సశేషం]



కండ్లు

"సర్వేంద్రియాణాం నయనం ప్రధానం"

మనకున్న పంచేంద్రియాలన్నిట్లోకీ కన్నుకే గొప్ప ప్రాధాన్యత, ఎందుకంటే ప్రపంచమంతా, బ్రతుకంతా చాలవరకు దీనితోటే వుంది. అదీగాక "మనస్సుకు ముఖం ఒక విషయసూచిక వంటిది" అన్నారు. అంటె- ముఖం లోని కళ్ళల్లోనే యిది వ్యక్తమౌతూ ఉంటుంది. కళ్ళ యొక్క ఆకారం, దృష్టియొక్క వైఖరీ, నిజంగా మనిషియొక్క మనస్తత్వానికి దర్పణం. అందుచేత కంటినిగురించి ఎంత శ్రద్ధ అయినా తీసుకోవలసియుంది. ముఖ్యంగా స్త్రీలకు యిది మరీ అవసరం. కవులు చూడండి: స్త్రీల కళ్ళుచూచి మృగేక్షణ, ఇందీవరాక్షి, మీనాక్షి, కమలాక్షి, అని వర్ణిస్తారు. నిజానికి కండ్లసోయగం, అర్ధచంద్రాకారంగా వంగి విల్లును బోలు ఆ కనుబొమలు, కలువరేకులవంటి ఆకారము రంగూగల కండ్లు, అందు బాహ్యప్రపంచాన్ని లోనికి, లోని ఊహా ప్రపంచాన్ని బాహ్యానికి తోపించే ఆ చిత్రాతిచిత్రమైన నల్లటి కనుగ్రుడ్లు, అన్నిటికంటె ప్రాధాన్యమైన ఆ కంటిచూపు ప్రసారం ఎంతో ఆకర్షవంతంగావుండి, అట్లే చూడబుద్ధి వేస్తుంది. కండ్లయొక్క సహజసౌందర్యాన్ని కాపాడుకొందుకు స్త్రీలకు ఈ క్రింది సలహాలు అందిస్తున్నా.

కళ్ళకు ఇంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ వీటినిగురించి ప్రజలు తీసుకొనే శ్రద్ధచూడండి: సామాన్యంగా ప్రొద్దుటి పూట ముఖంతోబాటు కండ్లనుకూడా కడుగుతారు, బొట్టు పెట్టుకునేటప్పుడింత కాటుక తీసి రాస్తారు. కాని అంత మాత్రం చాలదు. కొంతమందికి అదృష్టవశాత్తు మంచి కనుబొమలు, ఆకర్షించె కండ్లు పుట్టుకతోనే వస్తాయి. అలాంటి వాళ్ళు ఎక్కువ శ్రమపడకుండానే కండ్ల సౌందర్యాన్ని సంరక్షించుకోవచ్చు. కాని కొంత మందికి రెప్ప వెంట్రుకలు, కనుబొమలుకూడా బాగుండవు. అలా అని నిరాశ పడనక్కరలేదు. కొంచెం శ్రద్ధ తీసుకొంటే చక్కగ దిద్దుకోవచ్చు.

రోజూ ప్రొద్దుట స్నానానికి ముందొక అరగంట సేపు కొబ్బరినూనెగాని, హైర్ వేసలైనుగాని కనుబొమలకు, రెప్ప వెంట్రుకలకు రాయాలి. కనుబొమలెంత అందాన్నిస్తాయో రెప్ప వెంట్రుకలుకూడ అంత అందాన్నిస్తాయి. కనుక వాటిని గురించికూడ శ్రద్ధ తీసుకోవాలి. పై రెప్పవెంట్రుకలు కనుబొమల కానేటట్టుగా వంగి ఉంటే అందంగా ఉంటాయి. అలా వంగి యుండని రెప్ప వెంట్రుకలకు ఆముదం గాని, వేసలైనుగాని రాసి, మునివేళ్ళతో వాటిని పైకి ఐదారు సార్లు వంచితే కొద్ది

శ్రీ సువేణికాశ్యప్.

రోజులలో మంచి రెప్ప వెంట్రుకలు వస్తాయి. ఇలా నూనె వ్రాయడంవల్ల కనుబొమలు, రెప్ప వెంట్రుకలు వత్తుగా పెరగటమేగాకుండా నల్లగా నిగనిగలాడుతూ ఉంటాయి.

కొంతమందికి కనుబొమలు వత్తుగా ఉన్నాకూడ అందంగా కనిపించవు. దానికి కారణం అవి సరిగా లేక బద్దెలాగ వెడల్పుగా ఉండడమే. అలాంటప్పుడు కావల సినవి ఉంచుకొని అక్కర్లేని వెంట్రుకలను రేజరుతో గాని, కత్తెరతో గాని తీసివేస్తే బాగుంటుంది. కను బొమలు ఒకదానికొకటి ఎంత దూరంలో ఉంటే అంత బాగుంటుంది. అందుకని భ్రూమధ్యం లోని వెంట్రుకలను తీసేయాలి. ఇలా చేస్తే కనుబొమలు బాగా ఉంటాయి.

కొంతమందికి ముఖానికి పసుపు రాసుకొనే అలవాటుం టుంది. అలాంటప్పుడు పసుపును గబ గబ రెండు చేతు లతో ముఖం అంతా పులమక నెమ్మదిగా వ్రేళ్ళతో రాసు కొంటే, పసుపు కనుబొమలలోకి పోకుండా ఉంటుంది. పసుపులో వెంట్రుకల నూడదీసే గుణముంది. అందుకని జాగ్రత్తగా రాసుకోవాలి. సబ్బుతోనో, సీకాయితోనో కొంచెము ఎక్కువ రుద్ది, దానిమీద నీళ్ళుపోసి వ్రేళ్ళతో అటు ఇటు వాటిని నెమ్మదిగా కదిలించడం మంచిది.

కాటుకను కొంతమంది చక్కగా పెడ్తారు. కనుకొలు కులలోనుండి కంటి చివర వరకు సన్నగా పెడ్తే చూసేం దుకు చక్కగా ఉంటుంది. కాటుకను చేత్తోకంటే, బాగా కడిగిన చీపురు పుల్లతో పెడ్తే ఇంకా చక్కగా ఉంటుంది. అయితే పుల్లతో పెట్టేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం కంటికి తగిలినా నీళ్ళు వచ్చి కాటుక అస హ్యంగా కన్నంతా అవుతుంది. కాటుకను రెండు మూడు పద్ధతులలో పెడ్తారు. కొంచెము పట్టుకొనే కాటుక అయితే ముఖం రుద్దుకొనే ముందు కంటికి రాసుకొని, తర్వాత సబ్బుతో జాగ్రత్తగా కంటిని రుద్దాలి. అలా అయితే కాటుక కన్నంతా అంటుకొని బాగా ఉంటుంది. కాటుకను క్రింది రెప్పకి పెట్టినట్లే పై రెప్పకి కూడా పెడ్తారు. కొందరికి పై రెప్పకి పెట్టడం కుదరదు. అలాంటప్పుడు క్రింది రెప్పకి కొంచెం మందంగారాసి, కన్నును కొంచెము గట్టిగా మూస్తే పై రెప్పకి అంటుకొంటుంది.

కొంతమంది కనుబొమలను వెచ్చు పెన్సిల్‌తో దిద్దు కొంటారు. ఇది మితంగా చేస్తే బాగానే ఉంటుంది. ఈ పెన్సిల్‌తోనే కంటి రెప్పమీద సన్నని గీతను గీస్తారు. అయితే ఇది అందమైన కంటికిగాని బాగుండదు.

ఇలా పైన జూపే శ్రద్ధ కండ్ల పూర్తి సౌందర్యానికీ ఆరోగ్యానికీ చాలదు. కండ్లు ఆరోగ్యంగా ఉండాలంటే మనం తినే తిండిని గురించి శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా కండ్లను ఆరోగ్యంగా ఉంచేది విటమిను 'ఎ'. చక్కని చూపు నిచ్చేది ఈ విటమినే. ఇది మనం తినే తిండిలో లోపిస్తే ఎన్నో కంటి జబ్బులొస్తాయి. దీర్ఘదృష్టిగాని, హ్రస్వదృష్టి గాని (**Long Sight; Short Sight**)ఉంటే దినానికి 10,000 యూనిట్సు తీసికొంటే రెండు నెలల్లో పూర్తిగా తగ్గిపోయి మామూలు దృష్టి వస్తుంది. అయితే దీనితోపాటు విటమిను 'డి' ని కూడ తీసికోవాలి. ఇది 100 యూనిట్సు ఉండాలి. ఇవి రెండు కలిపి తీసికొంటే బాగా పనిచేస్తుంది. కండ్లలో పువ్వులు, దుర్మాంసాలు లేవటానికి కారణం తిండిలో విటమిను 'సి' లోపించడం. ఈ విటమిన్లు మందుల షాపుల్లో మాత్రలుగా అమ్ముతారు. లేకపోతే మనము తినే సహజ కూరలు వగైరాలనుండి పొందవచ్చు.

విటమిను 'ఎ' ఆకు కూరలు, పాలు, కేరట్సు, కేబేజి మొదలగు వాటిలో ఉంటుంది. కేరెట్సు పచ్చివి తినగల్గితే రోజుకొక గడ్డను తినడం మంచిది.

విటమిను 'సి' నిమ్మ, నారింజ, టొమాటో వగైరాల్లో ఎక్కువగా ఉంటుంది. 'డి' విటమిను సూర్యరశ్మి ద్వారా వస్తుంది. మంచి చెట్లుంటే మధ్యాహ్నము పూట ఒక అర గంట వాటి క్రింద కూర్చుంటే చాలు 'డి' విటమిను లభి స్తుంది. లేకపోతే మాత్రలు కాడ్‌లివర్ ఆయిలు వంటివి తీసికోవచ్చు.

ఆహారంలో శ్రద్ధతోబాటు తగు వెలుతురులో పనులు చేసుకుంటూ ఉండాలి. చదివేటప్పుడు, కుట్టేటప్పుడు సరి అయిన వెలుతురుండాలి. సన్నని అచ్చు చదివి నప్పుడు, ఎక్కువ కుట్టినప్పుడు కండ్లు అలసిపోయి మంటగాను, నొప్పిగాను ఉంటాయి. అలాంటప్పుడు బోరిక్ లోషన్‌తో గాని, చల్లని స్వచ్ఛమైన నీళ్ళతోగాని కండ్లను కడుగు కొంటే కళ్ళ శ్రమ నివారిస్తుంది. లేదా కండ్లను బాగా చీకటిగా ఉండేట్లు చేత్తో మూసుకొని ఐదు నిముషాలుంటే కండ్ల మంటలు తగ్గుతాయి. కండ్లు ఎక్కువగా మండే టప్పుడు ఐడ్రాప్స్ వేసుకోవచ్చు. వారానికొక సారి ఆము దంతో తలంటు కూడ కండ్లకు మంచిపని చేస్తుంది. ఇలాంటి శ్రద్ధలు తీసికొంటే కండ్లు అందంగానే గాకుండా దృష్టి లోపాలు రాకుండా ఆరోగ్యంగా ఉండి ఆకర్షవం తంగా ఉంటాయి.

హిందూ వారసత్వపుబిల్లు - స్త్రీల హక్కులు

కుమారి డి. శారదాదేవి, **B.A.,B.L.,**

చిరకాలం నుండి స్త్రీలకు సాంఘికంగా జరుగుతున్న అన్యాయాలను తొలగించాలని ఆందోళన జరుగుతోంది. అనేక స్త్రీ సమాజాలు, స్త్రీశ్రేయోభిలాషులు మహాసభలు జరిపి ప్రభుత్వానికి తమ కోరికలు తెలుపుతూ వచ్చారు. వీని ఫలితంగా యీ సాంఘిక దురన్యాయాలను తగ్గించడానికి ప్రభుత్వం ఒకదాని వెంట ఒకటిగా శాసనాలు చేస్తూ వచ్చింది. ఈ విధంగా హిందూ వితంతు స్త్రీలకు వివాహం చేసుకునే హక్కు, వివాహిత స్త్రీలు కొన్ని కొన్ని సందర్భాలలో భర్తనుండి వేరుగా నివసించుతూ మనోవర్తి కోరే హక్కులు, కొన్ని రాష్ట్రాలలో విడాకులు కూడా కోరే హక్కు మొదలైనవి లభించాయి. అలానే ఆస్థిలో కూడా కొద్దిపాటి వారసత్వపు హక్కుల నిస్తూ కొన్ని శాసనాలు వచ్చాయి. కొద్ది కాలంలో పార్లమెంటు ముందు చర్చకు రాబోయే 'హిందూవారసత్వపు బిల్లు' కూడా ఇలాంటిదే.

ఈ బిల్లుద్వారా హిందూ వారసత్వ శాస్త్రంలో మూడు ముఖ్యమైన మార్పులు చేయబడు తున్నాయి. మొదటిది కుమార్తెకు కుమారునితోబాటు తండ్రి ఆస్థిలో భాగం రావడం. ఇప్పటి 'లా' ప్రకారం కుమారులుగాని, భార్యగాని ఉన్నట్లయితే కుమార్తెకు ఆస్థిలో భాగం లేదు. వారు లేనప్పుడు కుమార్తెలకు జీవితకాల హక్కులతో ఆస్థి సంక్రమిస్తుంది. రెండో మార్పు యేమిటంటే స్త్రీలకు ఆస్థి సర్వహక్కులతో సంక్రమించడం. ఇప్పటి 'లా' ప్రకారం బొంబాయి రాష్ట్రంలో తండ్రి ఆస్థి కుమార్తెలకు సంక్రమించి నప్పుడు తప్ప మిగతా అన్ని సందర్భాలలో స్త్రీలకు వారసత్వేణా ఆస్థి వస్తే అందులో పూర్తి హక్కులు ఉండవు. కేవలం జీవితకాలంలో అయివేజు అనుభవించే హక్కు మాత్రమే ఉంటుంది, కొన్ని పరిస్థితుల్లో తప్ప ఆస్థిని అన్యాక్రాంతం చేయడానికి వీలులేదు. మూడోమార్పు యేమిటంటే తల్లి ఆస్థిలో కుమార్తెతోబాటు కుమారునికి భాగం యివ్వడం. ప్రస్తుతం తల్లి ఆస్థి కుమార్తెలకు, వారులేకపోతే మనుమరాళ్ళకు, తరువాత మనుమలకు, వారెవ్వరూ లేకపోతే కుమారులకువస్తుంది. తండ్రి ఆస్థిలో కూమార్తెలకు భాగం యిస్తున్నాము కాబట్టి దానికి ప్రత్యామ్నాయంగా తల్లి ఆస్థిలో కుమారునికి భాగం యివ్వడం సమంజసంగా భావించి యీ మార్పు చేస్తున్నారు.

ఈ విధంగా యీ బిల్లు చట్టం అయితే హిందూ వారసత్వంలో అతి ముఖ్యమైన మార్పులు వస్తాయి. అందువల్ల ప్రజలంతా యీ బిల్లువల్ల కలగబోయే ఫలితాలను తెలుసుకొని తమ తమ అభిప్రాయాలను ప్రకటించాలని ప్రభుత్వం కోరుతోంది.

ఈ బిల్లు వలన స్త్రీలకు అమూల్యమైన హక్కులు కొన్ని వస్తున్నాయనేది నిస్సంశయం. కాని రాజ్యాంగం ప్రకారం యే సమానత్వాన్ని మనం కోరుతున్నామో అది మాత్రం లభించటం లేదు. కుమార్తెలకు కుమారునితోబాటు సమాన హక్కులు లభించటంలేదు, సగం హక్కు మాత్రమే యివ్వ బడుతోంది. అంటే, కుమారుడు, కుమార్తె, భార్య, ఉంటే, భార్యా కుమారులకు చెరొక భాగం, కుమార్తెకు సగభాగం వస్తాయి. ఇంతేగాదు. ఈ బిల్లు జాయింటు కుటుంబ ఆస్థులకు వర్తించదు. ఒక్క బెంగాలు రాష్ట్రంలో తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలలో జాయింటుకుటుంబాస్థులకు, స్వార్జితపు ఆస్థులకూ వారసత్వంలో తేడా ఉంటుంది. జాయింటు కుటుంబాస్థి అంతా పూర్వార్జితమైన ఆస్థి, అంటే పెద్దలార్జించి పెట్టిన ఆస్థి అన్నమాట. తండ్రి స్వార్జితంగా సంపాదించిన ఆస్థి కుమారునికి సంక్రమించగానే పూర్వార్జితపు ఆస్థిగా మారి పోతుంది. దీనిలో కుటుంబంలో ఉన్న పురుషులకు వారిలో ఎవరైనా చనిపోతే వారి వితంతువులకూ, మాత్రమే భాగం ఉంటుంది. స్వార్జితపు ఆస్థి ఒక తరం దాటగానే పూర్వార్జితపు ఆస్థి అయి పోతుంది కాబట్టి మనలో సాధారణంగా స్వార్జితపు ఆస్థికన్నా కుటుంబాస్థి యెక్కువుంటుంది. వారసత్వపు బిల్లు కుటుంబాస్థులకు వర్తించదంటే, కుటుంబాస్థిలో కుమార్తెకు భాగం రాదన్న మాట, అంతేకాకుండా, తండ్రి స్వార్జితపు ఆస్థిలో కుమా

రునికి వచ్చిన పూర్వార్జితంగా మారి పోతుంది కాబట్టి మనుమరాలికి అందులో భాగం ఉండదన్నమాట. ఇలా ఒకతరంలో కుమార్తెకు భాగం వస్తుంది, రెండోతరంలో భాగం లేకుండా పోతుంది. ఈ విధంగా లెక్క చూస్తే మొత్తం ఆస్థిలో కుమారునికి వచ్చేదానిలో నాలుగోవంతో అయిదోవంతో కుమార్తెకు వస్తుంది.

అలాగే సర్వహక్కులు రావడం కూడాను. భార్యకు స్వార్జితపు ఆస్థిలో వచ్చే భాగంలో పరిపూర్ణ హక్కులు ఉంటాయి, కుటుంబాస్థిలో వచ్చే భాగంలో జీవిత హక్కులు మాత్రం ఉంటాయి.

ఇవే కాకుండా వారసుల జాపితాలో కూడా స్త్రీలకు పురుషులకు భేదం చూపబడింది. కుమారుడు, కుమారుని కుమారుడు అతని కుమారుడూ మూడుతరాలూ వారసులే. కాని మనుమరాలి పిల్లలు, కుమార్తె కుమారుని పిల్లలు, కుమారుని కుమారుని ఆడపిల్లలూ వారితోపాటు వారసులు కారు.


ఇలానే ఇతర వారసుల విషయంలో కూడా భేదం చూప బడుతుంది. పురుషుల ద్వారా మాత్రమే చుట్టరికం ఉన్నవారు దూరపు బంధువులైనా సరే, స్త్రీలద్వారా చుట్టరికం ఉన్నవారికంటే దగ్గిర వారసులు, అంటే మేనత్త కూతురు, పినతండ్రి మనుమడూ, ఇద్దరూ ఉంటే ఆస్థి పినతండ్రి మనుమడికే పోతుంది. ఒకే బంధుత్వం ఉన్న స్త్రీ పురుషులు ఇద్దఋూ ఉంటే పురుషునికి ఆస్థి వస్తుంది.

ఈ విధంగా అడుగడుగునా స్త్రీ పురుష వివక్షత చూప బడుతూనే ఉన్నది. మన రాజ్యాంగం 13, 15 సూత్రాల ప్రకారం స్త్రీ పురుష వివక్షత పాటించడానికి వీలులేదు. అలా పాటిస్తూ యేవైనా శాసనాలు చేసినా అవి చెల్లనేరవు. ఈ భేదాన్ని పాటించడానికి సక్రమమైన కారణాలేమీ లేవు కూడాను.

ఇక మూడో మార్పును పరిశీలించుదాము. కుమార్తెకు తండ్రి ఆస్థిలో భాగం వస్తోంది, కాబట్టి తల్లి ఆస్థిలో కుమారునికి భాగం యివ్వబడు తున్నట్లున్నది. ఈ న్యాయాన్ని ఎవ్వరూ కాదనరు. కాని తండ్రి ఆస్థిలో కుమార్తెకు యే అయిదోవంతో లభిస్తూండగా తల్లిఆస్థిలో కుమారునికి సగంభాగం యివ్వడం యేమిన్యాయం? సమానత్వమే చూపదలచు కొంటే కుమార్తెకు తండ్రి ఆస్థిలో సగంభాగమును యివ్వాలి. లేదా కుమారునికి తల్లి ఆస్థిలో యే అయిదో వంతు భాగమన్నా యివ్వాలి. లేక పోతే స్త్రీలకు కొత్త హక్కులు రాకపోగా ఉన్న హక్కులు కూడా తగ్గి పోతాయి.

ఇవన్నీ కాకుండా బిల్లులో మరొక విచిత్రమయిన అంశం ఉన్నది. ఇది 1937 వ సంవత్సరపు 'హిందూ వివాహిత స్త్రీల ఆస్థి హక్కుల చట్టం'లో కూడా ఉన్నది. అది యేమిటంటే, ఒక పురుషునికి ఇద్దరో ముగ్గురో భార్యలు ఉంటే ఆ భార్యలందఋకూ కలిపి ఒకే భాగం వస్తుంది. అంటే యిద్దఋ భార్యలూ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉంటె కుమారునికి ఒక భాగం, యిద్దరు భార్యలకూ కలిపి ఒక భాగం, కుమార్తెకు సగంభాగం వస్తుంది. ఈ సూత్రం యే న్యాయాన్ని అనుకరించి ఏర్పరిచారో తెలియదు. తన ఆనందానికి, స్వార్థానికిగాను పురుషులు అనేకమంది స్త్రీలను వివాహం చేసుకొని, బ్రతికి ఉన్నంత కాలంవారిని పరస్పర సంఘర్షణలకూ, యీర్ష్యాద్వేషాలకూ గురి చేసింది చాలక, అతడు మరణించాక కూడా వారందఋూ ఒకే భాగాన్ని పంచుకొని తక్కువ ఆస్థితో జీవించాలా? పురుషుడు చేసే దురన్యాయానికి ఆ అమాయిక స్త్రీలకు ఈ శాస్తి దేనికి? ఎంతమంది భార్యలుంటే అంతమందికీ తలొక భాగం యివ్వడం న్యాయం.

ఈ బిల్లువల్ల కలగబోయే ముఖ్యమైన మార్పులివి. స్త్రీలకు కొన్ని హక్కులు వస్తున్నమాట నిజమైనప్పటికీ పైన సూచించి నట్లుగా సవరణలు జరిగితేనేగాని బిల్లు నిర్దుష్టంగా ఉండదు. ప్రజలు, సంఘాలు తమ తమ సూచనలను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంపాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. కాబట్టి స్త్రీ సంఘాలన్నీ వెంటనే సభలు చేసి, బిల్లును పూర్వార్జితపు ఆస్థికి కూడా వర్తింప చేయాలని, కుమార్తెకు సమాన భాగం యివ్వాలని, వారసులలో స్త్రీ పురుష భేదం పాటించరాదనీ, భార్య లందఋకూ తలొక భాగం యివ్వాలని, తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపాలి. లేకపోతే యింత కాలం నుండీ స్త్రీలకు ఆర్థికంగా జరుగుతూన్న అన్యాయాలు ఇంకాజరుగుతూనే ఉంటాయి.



రత్నగీతి

(ఖండకావ్యము)

గ్రంథకర్త్రి : చదలవాడ నాగరత్నము

ప్రాప్తిస్థానము :— సరస్వతీ బుక్ డిపో, విజయవాడ

శ్రీమతి రత్నమ్మ ఆలపించిన గీతములు రత్నములవలె నున్నవి. కవిసామ్రాట్ శ్రీ విశ్వనాధసత్యనారాయణగారి వంటి ప్రముఖుల ప్రశంసల నందుకొన్న "యువతీరత్నము. ఆంధ్రనారీ లోకమునకంతకు గర్వకారణ మనక తప్పదు. ప్రతి యువతీరత్నము చదువదగిన వివిధ విషయముల గూర్చి వ్రాసిన పద్యసంపుటి.

వెల తెలియదు.

మానవా - మానవా

(గేయసంపుటి)

రచన : వసంతరావు వేంకట్రావు.

ప్రాప్తిస్థానము : వసంతనికేతనము, విజయనగరము.

వెల : 0—8—0

ఈ సంపుటిలో గేయములు ఆరుగలవు. ప్రధమ గేయ నామమె సంపుటి కంతకును యిచ్చియుండుట సమంజస ముగానే యున్నది. "ఉబలాటం, విగ్రహారాధన, వాతావరణం, పరమశూన్యం, రెడ్‌క్రాస్‌సంఘం," అనే శీర్షికల క్రింద గేయరూపంలో అధునాతన విజ్ఞానసంపత్తికి సనాతనమైన ఆధ్యాత్మికశక్తికి వుండే సంబంధమును యుక్తియుక్తముగ సమన్వయించి చెప్పిరి. గ్రంథకర్త శైలి మాత్రము సరళముగాను గేయములు భావ గాంభీర్యము తోను వున్నవనుటకు సందియములేదు. కాని వైజ్ఞానిక విషయములు గేయరూపములో సులభముగా ప్రచార మయ్యే అవకాశము వున్నదనిన గ్రంథకర్తగారి యభిప్రాయముతో మేమేకీభవింప జాలకున్నాము. వైజ్ఞానిక విషయములు పద్యములలోకన్న గద్యములోనే యుండుట మంచిది. ఈ గ్రంథమునందుకూడా రచయిత గద్యసహాయమపేక్షింప వలసి వచ్చిన ఘట్టములు కలిగి యుండుటయే మాయభిప్రాయమును బలపరచు చున్నది. నాస్తిక వాదము ప్రబలియున్న యీ నేటి ప్రపంచకమునకు యిట్టి గ్రంథములు మిక్కిలి యవసరమే.

ఉపహారము

(గేయాలు)

రచయిత : సామవేదం వేంకటశార్ఙ్గపాణి

ప్రాప్తిస్థానం : శ్రీ కృష్ణమణిమాల, పొన్నూరు.

వెల తెలియదు.

గ్రంథనామము తెనుగుతల్లికి ఉపహారమై సార్థకమైనది. కృతికర్త ఉభయభాషా కోవిదులైనట్లు వారి రచనయే చెప్పు చున్నది. భావ గాంభీర్యము పదములకూర్పు ఉత్తమ స్థాయిని పొందినవి, ఇందు "భృంగము, కోకిలా, మత సామరస్యము, ప్రాణత్యాగి" మొదలగు గేయములున్నవి.

గాదేపల్లి సుందరీశంకరం.

శ్రీ త్యాగ గురుస్తుతి కీర్తనలు

* శ్రీమతి కె. ఎమ్. సౌందర్యవల్లి *

కీర్తన - 27

రాగం. ఖరహరప్రియ - ఆది తాళం.

ఆ. స రి గ మ ప ద ని స — అ. స ని ద ప మ గ రి స

ప॥ ఏమాటలాడిన, నీమాట ప్రియమౌ
మారామచంద్రునకు మహానుభావ ॥యే॥

అ॥ప॥ రామాభిరాముని, నీ ప్రేమవలలో
నేమంబుతో బట్టి, నామామృతంబాని ॥యే॥

చ॥ ఏరా పలుకవిది యేపాటియందువు
ధీరానన్నేలుకో రారాయటందువు
ధారాధరాభ శరీరా యనుచుకడు
గారామున బల్కెడు, గాక త్యాగగురు ॥ఏమాట॥

/4	0	0
ప॥ దా నీ పా దా ప మ ద ప మ గ రి స	రీ గ మా, మా	ప, ప, ద మ్మ పా
ఏ - మా ట లా . . . డి . న .	నీ - మా ట	ప్రి య - మౌ .
మ పా ద్దా, నీ సా; స ని దా .	నీ సా ; సా	ని ద ద మ పా దా
మా - రా మ చం ద్రు . న	కు - మ	హా- ను - భా వ॥
దా నీ పా దా		
ఏ - మా ట		
అ॥ప॥ మ పా దా, నీ సా; సా సా	సా; సా సా	స ని రి స స ని ని ద
రా మా భి రా ము ని	నీ ప్రే మ	వ - ల - లో - - -
దా, ా, నీ దా ని పా, దా	దా నీ పా పా	మ గ రి రి గ మ ప ద
నే మం బు తో బ - ట్టి	నా . మా మృ	తం . . బా . . ని .
దా నీ పా దా		
ఏ మా - ట		
చ॥ దా; దా నీ దా దా న్నీ దా	దా; ద పా ద	నీ నీ ద ప ప మ
ఏ రా ప లు క వి ది	ఏ పా . టి	యం. దు . వు .
నీ ద పా పా, మ గ ద ప మ గ రి స	రీ గ మా, మా	ప ద నీ దా పా
ధీ - రా న న్నే - - - లు . కో .	రా - రా య	టం . దు వు

అ. ప. వలె.

ధారాధరాభ శరీరాయనుచుకడు
గారామున బల్కెడుగాక త్యాగగురు ॥యే॥

శ్రీ త్యాగ గురుస్తుతి కీర్తనలు

కీర్తన - 28

కళ్యాణిరాగం — రూపకతాళం.

ఆ. సరిగమపదనిస — అ. సనిదపమగరిస

ప॥ పేదలలో కుచేలుడవు, సాధుజనులలో మేటివి ॥పే॥

అ॥ప॥ నాదగానసుధ నెరుంగ, నారదువలె కోవిదుడవు ॥పే॥

చ॥ భక్తిని ప్రహ్లాదుండవు, విరక్తి భువిని బుద్ధుండవు
ముక్తిగన పరీక్షితుడవు, శక్తియెంతో త్యాగరాజ ॥పే॥

0	/4	0	/4
ప॥ మ పా మ	గ రి గ రి సా ;	స రి స ని	దా సీ రీ గా
పే - -	ద - ల - లో .	కు . చే .	. లు డ వు
పా, ప	పా సా సా సా	స ని ద ప	మ ద ప మ గ రి గా
సా .	ధు జ ను ల	లో - - -	మే - - - టి . వి
(పామ)			
(పే -)			
అ॥ప॥ ; సా	సా స స ని ద పా	నీ దా	నీ సా ; సా
నా	ద గా . . . స	సు ధ	నె రుం గ
సా గ రి	సా స ని దా పా	ప ప ని ద	మ ద ప మ గ రి గా
నా . .	ర దు . వ లె	కో - - -	వి . దు - డ - వు
(పా మ)			
పే .)			
చ॥ ; పా	పా పా పా ;	పా ;	పా; మ ని ద ప
భ	క్తి ని ప్ర	హ్లా	దుం . డ . వు
మా ప మ	గా రీ సా సా	; పా .	గా; మా పా
వి ర .	క్తి భు వి ని	బు	ద్ధుం డ వు

అ. ప. వలె

ముక్తిగన పరీక్షితుడవు

శక్తి ఎంతో త్యాగరాజ ॥పేదలలో॥

చిత్రసమీక్ష :

భారతవాణి


'ది వాయిస్ ఆఫ్ ఇండియా' (భారతవాణి) అన్న 35 మిల్లీ మీటర్లు గాంధీజీ డాక్యుమెంటరీ ఫిల్ము 1,8,15 తారీఖుల్లో మద్రాసు నగరపౌరులకు చూపించేరు. ఆబాలగోపాలం చూచి ఆనందించేరు. ప్రదర్శనకాలం ఒక గంట. సైలెంటు ఫిల్మేగాని, బ్యాక్‌గ్రౌండు మ్యూజిక్కుతోను, మిస్. మీరాబెన్ (మిస్‌స్లేడ్) శ్రీ ప్యారీలాల్, శ్రీ దేవదాస్ గాంధీగార్ల విస్పష్టమైన ఇంగ్లీషు కామెంటరీలతోను అపూర్వంగాఉంది. నే పథ్యసంగీతం ప్రాచ్య - ప్రచీతల సమ్మేళనం వల్ల మరీ సమంజసంగా ఉంది. మధ్యలో ఈజిప్టు పడవపాటకూడా ఉంది. ఐతే గాంధీజీకి అత్యంత ప్రియతమమైన రామధున్, మనజాతీయ గీతం కోసం మనం ఆశపడతాంగాని ఈ ఫిల్ము ముఖ్యంగా పాశ్చాత్త దేశాలవారికని తయారయిందని కొంత సంతృప్తి పడతాం.

ఫిల్ము ఆశయం గాంధీజీ జీవితమంతా చూపించడం గాదు. మహాత్ముని జీవితంలోను, భారత స్వతంత్ర పోరాటం చరిత్రలోను చిరస్థాయిగా నుండి పోయే రెండు సంవత్సరాల సంఘటన లిందున్నాయి. ఫిల్ముపొడుగునా గాంధీజీ వ్యక్తిత్వం ప్రస్ఫుటమౌతూ ఉన్నా ఇంకా మన ఇష్టనాయకు లందర్నీకూడ చూచాయగా చూస్తాం. డిశంబరు 1929 నుంచి జనవరి 1932 మధ్యకాలానికి సంబంధించిన హంశాలు : రెండవ రౌండుటేబిల్ సమావేశానికి గాంధీజీ ఇంగ్లాండు ప్రయాణం, అక్కడి ప్రజలకు ఆయన భారతవాణి — సందేశం ; అప్పట్లో వినపడింది గాని అంతగా పాటించింది గాదు అప్పటి పాశ్చాత్త ప్రభుత్వం.

విదేశ పత్రికా ప్రతినిధితో గాంధీజీ సంభాషణ "మీరు ఇంగ్లాండు రాజును సందర్శిస్తున్నప్పుడు ఏ దుస్తులు ధరిస్తారు" అన్న ప్రశ్నకు "ఇప్పుడేమి ఉన్నాయోఅవే!" నన్న గాంధీజీ నిరాడంబర వాక్కులు, ఓడపై బాలుణ్ణి ఎత్తుకుని నవ్వుతున్న ఆ విశ్వ సమ్మోహనమైన నవ్వు. లాంకషైరులో పళ్ళు అందిస్తున్న బాలలతో ఛలోక్తి, ఎక్కడికి వెళ్ళినా అనంత ప్రజాసందోహాన్ని ఆకర్షించే ఆ వ్యక్తిత్వం, ఇటలీలో ముసోలినీ బాలకభట వర్గాన్ని తిలకించడం, రోమైన్‌రొలాండ్‌తో సమావేశం, ఓడదిగేసరికి భర్త అరెస్టును చెప్పవచ్చిన కమలానెహ్రూ, వగైరా సన్నివేశాలు చూస్తాం. కాంగ్రెస్ సమావేశాలు, ఆ దండి సత్యాగ్రహం, బొంబాయి పోలీసుల దుండగాలు, వగైరాలన్నీ తిలకించి ఎలాంటి పోరాటం సల్పి యీ స్వాతంత్రత సాధించుకున్నామో జ్ఞప్తికి తెచ్చుకుంటాం. మళ్ళీ మన పూజ్య బాపూజీతో ఆ రోజుల్లో గడిపినట్లే అనుభవిస్తాం.

ఈ అపూర్వ చిత్రాన్ని తయారు చేసిన గాంధీస్మారక నిధి కమిటీవారూ, నిర్మాత శాంతారాం, వ్యాఖ్యాన ప్రముఖులూ అంతాకూడా భారతీయుల కృతజ్ఞతను చూరగొన్నారు. ఇంకా గాంధీజీ పూర్తి జీవితగాధను చూపించే ఫిల్ము నిర్మింప బడుతూవుందని విన్న భారతీయులు ఆబాలగోపాలం ఆతురతతో ఎదురు చూస్తున్నారు.

కె. సు.



ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రంలో పర్యటిస్తూ, భారత ప్రసిడెంటు శ్రీరాజేంద్రప్రసాద్‌గారు బస్తర్ జిల్లా దంటివారాలో మేరియాజాతి ఆదిమవాసులకు బట్టలు, చీరలు పంచిపెడుతున్న దృశ్యం.

Edited, Printed & Published for the Andhra Mahila Sabha, Luz, Madras 4
by Mrs. A. C. Krishna Rao, M.A., L.T., at the Andhra Mahila Press, 24-A, Luz Church Rd., Madras 4